RNI.No.TELTEL/2013/52694
Estd.: 2000
www.voodayam.com /voodayam /Voodayam




# ఉదయం

Simultaneously published from Adilabad, Hyderabad, Khammam, Karimnagar,Guntur & Warangal




సంపుటి : 12 ‖ సంచిక : 277 ‖ ఆదిలాబాద్ ‖ గురువారం, మార్చి 27, 2025 ‖ VOODAYAM Telugu Daily ‖ వెల : రూ. 3.00 ‖ పేజీలు : 12

## నిరంతరాయంగా కొనసాగుతున్న మట్టి తవ్వకాలు, ఊట నీటి పంపింగ్ ప్రక్రియ

- ఎస్.ఎల్.బీ.సీ టన్నెల్ వద్ద కొనసాగుతున్న సహాయ చర్యలు
- సమీక్షించిన ప్రత్యేకాధికారి శివ శంకర్



హైదరాబాద్ : బుధవారం ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ఆఫీస్ వద్ద టన్నెల్ లోపల కొనసాగుతున్న సహాయక చర్యలపై డిజాస్టర్ అండ్ మేనేజ్మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్ కుమార్, ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదంపై సహాయక చర్యల పర్యవేక్షణ కొరకు నియమించబడిన ప్రత్యేక అధికారి శివ శంకర్ లోతేటి ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఫిబ్రవరి 22వ తేదీన ఎస్ఎల్‌బీసీ టన్నెల్లో జరిగిన ప్రమాదంలో మొత్తం ఎనిమిది మంది కార్మికులు టన్నెల్‌లో చిక్కుకోగా, ఇద్దరి మృతదేహాలను గుర్తించి వారి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు, మిగిలిన ఆరుగురి కోసం సహాయక చర్యలను వేగవంతం చేయడానికి అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ లోపల సహాయక బృందాలు నిరంతరం పూర్తి స్థాయిలో సహాయక చర్యలు కొనసాగిస్తున్నట్లు, 4 ఎస్కేవేటర్ లతో మట్టి తవ్వకాలు కొనసాగిస్తు, మట్టిని కన్వేయర్ బెల్టు ద్వారా బయటికి తరలిస్తున్నట్లు, మట్టి తవ్వకాలకు అడ్డుపడుతున్న టీబీఎం భాగాలను తొలగిస్తూ సహాయక చర్యలు వేగవంతం చేస్తున్నట్లు వివరించారు. నిరంతరాయంగా వస్తున్న ఊట నీటిని టన్నెల్ లోపల 2.5 కిలోమీటర్లకు ఒకటి చొప్పున 150 %వూ% సామర్థ్యం గల 5 పంపింగ్ స్టేషన్ ల ద్వారా నిమిషానికి 3600 లీటర్ నీటిని కృష్ణా నదిలోకి పంపుతున్నట్లు తెలియజేశారు. ఉన్నత స్థాయి అధికారులు క్షేత్ర స్థాయిలో వుంటూ సహాయక బృందాలకు అవసరమైన సూచనలు, సలహాలు ఇస్తూ సహాయక చర్యలను కొనసాగిస్తున్నట్లు వివరించారు. టన్నెల్ లో చిక్కుకున్న వారి ఆచూకీ తెలుసుకునేందుకు 24 గంటలపాటు నిరంతరం సహాయక బృందాలు శ్రమిస్తున్నయని, మట్టి తవ్వకాల అనంతరం లోకో ట్రాక్ ను పునరుద్ధరిస్తున్నట్లు, తెలిపారు.

ఈ సమీక్ష సమావేశంలో, ఆర్మీ అధికారి వికాస్ సింగ్ ,ఎన్ డి ఆర్ ఎఫ్, అధికారులు డాక్టర్ హరీష్, సింగరేణి మైన్స్ రెస్క్యూ జనరల్ మేనేజర్ బైద్య , నాగర్ కర్నూల్ ఆర్డీఓ సురేష్ , ఎస్ డి ఆర్ ఎఫ్, హైడ్రా, దక్షిణ మధ్య రైల్వే అధికారులు, ఇరిగేషన్ ఈ ఈ శ్రీనివాస్, జే పి, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.



బుధవారం హైదరాబాద్‌లోని అసెంబ్లీ కమిటీ హాల్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన శాతవాహన యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఉమేష్ కుమార్...



## సీఎం రేవంత్‌తో ఆస్ట్రేలియా ఎంపీల బృందం భేటి...

హైదరాబాద్ : ప్రీమియర్ ఆఫ్ సౌత్ ఆస్ట్రేలియా పీటర్ మాలినాస్కస్ ఎంపీ బృందం బుధవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మర్యాద పూర్వకంగా భేటీ అయ్యింది. హైదరాబాద్‌లోని అసెంబ్లీ కమిటీ హాల్‌లో జరిగిన ఈ సమావేశంలో మంత్రి శ్రీధర్ బాబు, ఆస్ట్రేలియా హై కమిషనర్ టు ఇండియా ఫిలిప్ గ్రీన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## నేటినుంచి 4వ జాతీయ కరాటే ఛాంపియన్ షిప్ 2025.

### జి.ఎం.సి.బి స్టేడియం, గచ్చిబౌలి.

హైదరాబాద్: తెలంగాణలోని ప్రతిష్టాత్మక గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో 4వ కేఐఓ జాతీయ కరాటే ఛాంపియన్ షిప్ 2025 మార్చి 27 నుంచి 29 వరకు జరగనుంది. ఈ ప్రతిష్టాత్మక ఈవెంట్ లో పురుషులు, మహిళల కోసం సీనియర్, అండర్ 21, పారా కరాటే కేటగిరీలను ప్రదర్శిస్తారు, దేశవ్యాప్తంగా 1,500 మందికి పైగా ఈ పోటీలలో పాల్గొంటున్నారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో కరాటే ఇండియా ఆర్గనైజేషన్ (కేఐఓ)కు అనుబంధంగా ఉన్న తెలంగాణ స్పోర్ట్స్ కరాటే దూ అసోసియేషన్ ఈ 4వ కేఐఓ జాతీయ కరాటే చాంపియన్ షిప్ 2025ను నిర్వహిస్తోంది. ఈ ఛాంపియన్ షిప్ లో 28 రాష్ట్రాలు, 8 కేంద్రపాలిత ప్రాంతాలతో పాటు పారా మిలటరీ జట్లు మొత్తం 49 విభాగాల్లో జాతీయ టైటిల్ కోసం పోటీపడుతున్నాయి. సాంకేతిక అధికారులతో కలిపి మొత్తం 1500 మంది సభ్యులు పాల్గొంటున్నారు. 27.03.2025న ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క (గురువారం) ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభిస్తున్నారు. 28.03.2025 (శుక్రవారం) ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ, టీఎస్ కేడీఏ గౌరవాధ్యక్షుడు శ్రీ మహేష్ కుమార్ గౌడ్ హాజరవుతున్నారు. 29.03.2025 (శనివారం) ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి హాజరవుతారు. ఇందుకోసం తెలంగాణ స్పోర్ట్స్ కరాటే దూ అసోసియేషన్ (టీఎస్ కేడీఏ) అధ్యక్షుడు, కరాటే ఇండియా ఆర్గనైజేషన్ (కేఐఓ) ఉపాధ్యక్షుడు శ్రీ బి.మహేష్ కుమార్ గౌడ్, కరాటే ఇండియా ఆర్గనైజేషన్ (కేఐఓ) అధ్యక్షుడు శ్రీ భరత్ శర్మ, శాట్జ్ చైర్మన్ శ్రీ కె.శివసేనారెడ్డితో కలిసి ఈ రోజు ఉదయం గచ్చిబౌలి స్టేడియాన్ని సందర్శించి, గచ్చిబౌలి వేదిక వద్ద చేసిన ఏర్పాట్లను పరిశీలించి, టోర్నమెంట్ కు చేసిన ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ 4వ కియో జాతీయ కరాటే ఛాంపియన్ షిప్ ను హైదరాబాద్ లో నిర్వహించడం వల్ల మన అథ్లెట్ల అంకితభావం మరియు నైపుణ్యాన్ని హైలైట్ చేయడమే కాకుండా దేశవ్యాప్తంగా కరాటే కమ్యూనిటీని బలోపేతం చేస్తుందని ఆయన పేర్కొన్నారు. ప్రపంచ ఛాంపియన్ షిప్ లు, ఆసియా ఛాంపియన్ షిప్ లు మరియు దక్షిణాసియా ఛాంపియన్ షిప్ లకు మన క్రీడాకారులను తీర్చిదిద్దడానికి ఉపయోగముంటున్నదని అన్నారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ చైర్మన్ కె. శివసేనారెడ్డి మాట్లాడుతూ ఈ పోటీలు విజయవంతం కావడానికి స్పోర్ట్స్ అథారిటీ తరుపున అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. క్రీడాకారులు తమ క్రీడా నైపుణ్యాలను ఉన్నత స్థాయికి మెరుగుపరుచుకునేందుకు ఈ పోటీలు దోహదం చేస్తాయని అన్నారు మరిన్ని జాతీయ, అంతర్జాతీయ టోర్నమెంట్లను నిర్వహించేందుకు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ సిద్ధంగా ఉందని అయన తెలిపారు.

## హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల పరిరక్షణకు భారత రాష్ట్ర సమితి అండ



- సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులకు సంఘీభావం తెలిపిన వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- విద్యార్థులు తమ ఆందోళనను కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలని కేటీఆర్ సూచన
- తమ న్యాయమైన డిమాండ్‌కు మద్దతు నిలిచినందుకు విద్యార్థుల ధన్యవాదాలు

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన భూములను తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం అమ్మకానికి పెట్టడం పట్ల విద్యార్థులు చేస్తున్న ఆందోళనకు భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పూర్తి మద్దతు తెలియజేసింది. ఈ మేరకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈ రోజు మద్దతు తెలిపారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన పలువురు విద్యార్థి సంఘాల నాయకులు మరియు విద్యార్థులు తెలంగాణ భవన్‌లో కేటీఆర్‌ను కలిసి, తమ ఉద్యమానికి మద్దతు అందించాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థులు తమ ఆవేదన వ్యక్తం చేస్తూ, గతంలో కాంగ్రెస్ ప్రభుత్వమే ఈ భూములను యూనివర్సిటీ వినియోగం కోసం ఇచ్చినట్లు చెప్పగా, ఇప్పుడు అదే పార్టీ ప్రభుత్వం వాటిని వేలం వేయడం ద్వారా అన్యాయం చేస్తోందని కేటీఆర్‌కు వివరించారు. విద్యార్థుల విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన కేటీఆర్, ఈ ఆందోళనను హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీతో పాటు దేశవ్యాప్తంగా ఉన్న ఇతర సెంట్రల్ యూనివర్సిటీల విద్యార్థులకు కూడా తీసుకెళ్లాలని సూచించారు. ఈ యూనివర్సిటీ కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న నేపథ్యంలో, ఈ అంశాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లేందుకు కూడా మద్దతు అందిస్తామని కేటీఆర్ హామీ ఇచ్చారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల పరిరక్షణ కోసం కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను కలిసేందుకు సహకారం అందిస్తామని తెలిపారు. అలాగే, బ్యాకరి కంచె భూములను వాణిజ్య అవసరాలకు వినియోగిస్తే అక్కడి వైవిధ్యమైన జీవవైవిధ్యం మరియు వృక్షజాలం నశించి, పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంలో కేంద్ర పర్యావరణ శాఖ జోక్యం చేసుకోవాలని, ఆ శాఖ మంత్రిని కలవాలని కేటీఆర్ విద్యార్థులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు దాసోజు శ్రవణ్‌తో పాటు విద్యార్థి విభాగం అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ తో సమన్వయం చేసుకోవాలని కేటీఆర్ తెలియజేశారు. తమ ఆందోళనను అర్థం చేసుకొని, న్యాయమైన డిమాండ్‌కు సానుకూలంగా స్పందించిన కేటీఆర్‌కు విద్యార్థులు ధన్యవాదాలు తెలిపారు. తమ ఆందోళనను దేశంలోని అన్ని యూనివర్సిటీలకు విస్తరిస్తామని, హైదరాబాద్ యూనివర్సిటీ భూములతో పాటు పర్యావరణ పరిరక్షణ కోసం తమ పోరాటం కొనసాగుతుందని విద్యార్థులు ప్రకటించారు.

## విద్యా రంగంపై కూడా కాంగ్రెస్ రాజకీయమా ?

హైదరాబాద్ : విద్యారంగంపై కూడా కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయం చేయడం ఆ పార్టీ దివాలాకోరుతనాన్ని నిరూపించుకుంటుందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విరుచుకుపడ్డారు. విద్యారంగంపై కాంగ్రెస్ పార్టీకి చిన్న చూపు ఎందుకని నిలదీశారు. అత్యధికంగా పేద ప్రజల పిల్లలు చదువుకునే ప్రభుత్వ పాఠశాలలను మరింత మెరుగుపరచాల్సింది పోయి బీఆర్ఎస్ పార్టీపై దుష్ప్రచారం చేయడం ఏంటని ప్రశ్నించారు. తెలంగాణ ఏర్పడిన వెంటనే రాష్ట్రంలో విద్యా వికాసానికి కెసిఆర్ గారు పునాది వేశారని, వందలాది గురుకులాలను, ప్రభుత్వ పాఠశాలలను కొత్తగా తెరిచి లక్షలాది మందిని విద్యావంతులుగా తీర్చిదిద్దారని తెలిపారు.

బుధవారం నాడు శాసనమండలిలో విద్యారంగంపై జరిగిన స్వల్పకాలిక చర్చలో ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ... అగ్రశ్రేణి విద్యాసంస్థల్లో సీట్లు సాధించేలా తాము గురుకుల విద్యార్థులను తీర్చిదిద్దితే కాంగ్రెస్ ప్రభుత్వం వారిని వల్లకాటికి పంపుతోందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో గురుకుల విద్యార్థులు ఐఐటీలు, ఐఐఎంలు సహా ప్రఖ్యాత విద్యాసంస్థల్లో సీట్లు సాధించారని గుర్తు చేశారు. ప్రఖ్యాత ఢిల్లీ యూనివర్సిటీకి తాము వేల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ బిడ్డలను పంపితే కాంగ్రెస్ ప్రభుత్వం 15 నెలల్లో 84 మంది బిడ్డలను కాటికి పంపిందన్నారు. పేదతల్లి తన పిల్లలను చదివించుకునేందుకు ఎలా తపన పడుతుందో అలాంటి బాధ్యతను ప్రభుత్వం తీసుకోవాలని కేసీఆర్ గారు పరితపించారని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా విద్యపై ఖర్చు చేసే విషయంలో ఈ అంశాలను పరిగణలోకి తీసుకోవాలని సూచించారు. తెలంగాణ ఏర్పడే నాటికి 200 గురుకులాలు ఉంటే తమ ప్రభుత్వం వాటిని వెయ్యికి పెంచిందన్నారు. ఇప్పుడు ఆ గురుకులాలు ఎలా దెబ్బతిన్నాయో అందరికీ తెలుసన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన విద్యా కమిషన్ రాజకీయ కమిషన్ లా వ్యవహరించడం ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వం తీరును తప్పు బట్టే విధంగా విద్యా కమిషన్ ఎలా




వ్యాఖ్యానిస్తుందని.. గత తొమ్మిదిన్నరేళ్లలో విద్యా వ్యవస్థ నాశనమైందని కమిషన్ ఎలా చెబుతోందని నిలదీశారు. తెలంగాణ బిడ్డల చదువుకు మంచి బాటలు వేయాలని కమిషన్ అనుకుంటే గత 60 సంవత్సరాల చరిత్రను ప్రస్తావించాలన్నారు. నిజాం హయాంలో తెలంగాణలో అక్షరాస్యత కేవలం నాలుగు శాతమేనని.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో తెలంగాణ ప్రాంతంలో విద్యా వికాసానికి అప్పటి ప్రభుత్వాలు చేసిందేమి లేదన్నారు. కేసీఆర్ గారు సీఎం అయ్యాకే విద్యావ్యవస్థను మెరుగు పరిచేందుకు బలమైన పునాదులు వేశారన్నారు. వ్యవస్థలో లోపాలుంటే విద్యా కమిషన్ ఎత్తి చూపాలి కానీ ఇలా పొలిటికల్ కమిషన్ లా వ్యాఖ్యలు చేయడం ఏమిటని నిలదీశారు. కమిషన్ ను ఏర్పాటు చేసిన ప్రభుత్వం ఆ సిఫార్సులను ఎంతమాత్రం పరిగణలోకి తీసుకోలేదని బడ్జెట్ ప్రతిపాదనలతో తేలిపోయిందన్నారు. రాష్ట్రంలోని 632 మండలాల్లో రూ.31 వేల కోట్లతో పబ్లిక్, ఫౌండేషన్ స్కూళ్లు ఏర్పాటు చేయాలని కమిషన్ సిఫార్సు చేసిందని, మొదటి ఏడాదిలో వంద మండలాల్లో రూ.5 వేల కోట్లతో ఈ స్కూళ్లు నిర్మించాలని సిఫార్సు చేస్తే ప్రభుత్వం బడ్జెట్ లో రూ.వంద కోట్లు మాత్రమే కేటాయించిందన్నారు. దీంతోనే కమిషన్ సిఫార్సుల అమలుపై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఎంతో తేటతెల్లమవుతుందన్నారు. ప్రభుత్వానికి విద్యావ్యవస్థను మెరుగు పరచాలన్న చిత్తశుద్ధి లేనప్పుడు కమిషన్ ఎందుకు ఏర్పాటు చేసిందో చెప్పాలన్నారు. కేసీఆర్ గారి ప్రభుత్వం ప్రభుత్వ స్కూళ్లను మూసేసిందని తప్పుడు ప్రచారం చేశారని.. కానీ 15 నెలల కాంగ్రెస్ ప్రభుత్వంలోనే 1,913 స్కూళ్లను మూసేశారని తెలిపారు. కేసీఆర్ గారి పాలనలో ప్రభుత్వ స్కూళ్లు మూతపడ్డాయని ప్రచారం చేసే వారి కళ్లు తెరిపించేలా కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ సాక్షిగా సమాధానం ఇచ్చిందన్నారు. తెలంగాణ ఏర్పడేటప్పుడికి 29,268 ప్రభుత్వ పాఠశాలలు ఉంటే, 2023-24 నాటికి వాటి సంఖ్య 30,022కు పెరిగిందని.. ప్రైవేటు పాఠశాలల సంఖ్య 15,069 నుంచి 12,126కు తగ్గిందని అలాంటప్పుడు బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను ఎక్కడ మూసివేసిందో చెప్పాలన్నారు. ప్రైవేటు విద్యాసంస్థలతో పోటీ పడేలా ప్రభుత్వ స్కూళ్లను కేసీఆర్ గారు ప్రోత్సహించారని, అందుకే గవర్నమెంట్ స్కూళ్లలో ఎన్ రోల్మెంట్ పెరిగిందన్నారు.

## దేశంలో ఈ ఏడాది కూడా దంచికొట్టానున్నఎండలు

### హెచ్చరించిన భారత వాతావరణ కేంద్రం

న్యూ డిల్లీ మార్చి 26 : దేశంలో ఈ ఏడాది కూడా ఎండలు దంచికొడుతాయని భారత వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ముఖ్యంగా వాయవ్య భారతదేశం లో ఎండలు మండిపోనున్నాయని తెలిపింది. నార్తవెస్ట్ ఇండియాలో ప్రతి ఏడాది అత్యంత వేడి రోజులు నమోదవుతాయని, ఈ ఏడాది వేడి రోజుల సంఖ్య రెట్టింపు అయ్యే అవకాశం ఉందని, అంటే 10 నుంచి 12 హీట్ వేవ్ డేస్ నమోదు కావచ్చని ఐఎండీ అంచనా వేసింది. వేడి రోజులు ఎక్కువగా నమోదవుతాయంటే సీజన్ మొత్తం వేడి వాతావరణం ఉంటుందని అర్థం కాదని, ఆయా హీట్ వేవ్ డేస్‌లో మాత్రమే అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని ఐఎండీ శాస్త్రవేత్త సోమా సేన్ రాయ్ చెప్పారు. అయితే 2024 కంటే ఇప్పుడు ఎండలు ఎక్కువగా ఉండనున్నాయా అన్న ప్రశ్నకు ఆమె ఎలాంటి సమాధానం ఇవ్వలేదు. 2024 సంవత్సరం భారతదేశ చరిత్రలోనే అత్యంత వేడి సంవత్సరంగా రికార్డుల్లోకి ఎక్కింది. గత ఏడాది దేశంలో 554 అత్యంత వేడి రోజులు నమోదయ్యాయి. అదేవిధంగా ఈ వేసవిలో దేశంలోని పలు ప్రాంతాల్లో సాధారణం కంటె తక్కువ కనిష్ఠ ఉష్ణోగ్రతలు, సాధారణం కంటే ఎక్కువ గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం కూడా ఉన్నదని ఐఎండీ అంచనా వేసింది. రాగల నాలుగైదు రోజుల్లో ఉత్తర భారతదేశంలో ఎండల తీవ్రత పెరగనుందని, దేశ రాజధాని ఢిల్లీ దాని పరిసర రాష్ట్రాల్లో ఒకటి నుంచి రెండు డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు పెరగనున్నాయని ఐఎండీ తెలిపింది.

## విభేదాలు వీడి బీసీ రిజర్వేషన్ల పెంపుకు పోరాడుదాం

హైదరాబాద్ : 42 శాతం రిజర్వేషన్ల అమలు,దేశ వ్యాప్త కులగణన, చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్ల కోసం ఇకపై ఉద్యమాలు ఉధృతం చేస్తాం.. బీసీ ఐక్య కూటమి కన్వీనర్ దాసు సురేశ్ హైదరాబాద్, మార్చి 26 : బీసీ సంఘాలు సమన్వయంతో కదిలితేనే విద్యా, ఉద్యోగ, రాజకీయాల్లో 42 శాతం రిజర్వేషన్ల అమలు సాకారం అవుతుందని ఐక్య కూటమి కన్వీనర్ దాసు సురేష్ పిలుపునిచ్చారు. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కామారెడ్డి డిక్లరేషన్ హామీని నిలబెట్టుకునేలా అసెంబ్లీలో బీసీ బిల్లును ప్రవేశపెట్టి పాస్ చేయించిందన్నారు. దీనికి చట్టబద్ధత కల్పించేందుకు ఐక్యంగా కదిలి కేంద్రంపై ఒత్తిడి తీసుకువద్దామని బీసీ నాయకులకు ఓ ప్రకటనలో సూచించారు. విద్యా ఉద్యోగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు, జతీయ స్థాయిలో కులగణన, చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు, మహిళా రిజర్వేషన్లలో బీసీలకు సబ్ కోటా వంటి డిమాండ్ల సాధనకు ఐక్య కూటమి ఏర్పాటైందని దాసు సురేష్ తెలిపారు. రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య రాజకీయంగా ఎలాంటి నిర్ణయం తీసుకున్నా.. బీసీ నాయకుడిగా గౌరవించుకుందామన్నారు. బీసీ నేతలు పరస్పర గౌరవంతో ముందుకు కదిలి



కేంద్రంపై ఒత్తిడి పెంచుదామని చెప్పారు. ఈ దిశగా విజ్ఞులైన బీసీ నాయకులు ఆలోచించాలని దాసు సురేష్ సూచించారు. హైదరాబాద్ కేంద్రంగా బీసీ ఉద్యమ కారులతో చర్చలు కొనసాగుతున్నాయని , త్వరలోనే స్టీరింగ్ కమిటీ , ఎక్సక్యూట్ కమిటీలను, చైర్మన్ , కో చైర్మన్లను ఎన్నుకోనున్నామని ఒక ప్రకటనలో తెలిపారు..

# సంపాదకీయం

## ట్రంప్ గ్రీన్‌ల్యాండ్ ఆరాటం..

గ్రీన్‌ల్యాండ్‌ను అమెరికా స్వాధీనం చేసుకోవడం తథ్యం అంటూ ట్రంప్ పదే పదే ప్రకటిస్తున్నాడు. రెండోసారి అధికారం చేపట్టగానే ఉక్రెయిన్‌లో యుద్ధాన్ని ఆపాలని, గాజాను తాము స్వాధీనం చేసుకుంటామని, పనామా జలసంధి పైన ఆధిపత్యాన్ని తామే చేపడతామని ప్రకటించాడు. ఆ యా దేశాల, ప్రజల సార్వభౌమాధికారాన్ని బేఖాతరు చేస్తూ ఇలా ఒక దేశాధినేత ప్రకటించడం అన్ని అంతర్జాతీయ న్యాయ సూత్రాలకు విరుద్ధం. ప్రపంచ శాంతికి, సహజీవనానికి భంగకరం. ఐనప్పటికీ వాటిని పట్టించుకోకుండా ట్రంప్ వ్యవహరించడం వెనుక కారణం ఏమిటి? అమెరికా అన్న దేశం ఏర్పడిందే స్థానిక తెగలను నాశనం చేయడం, ఆక్రమించుకోవడం ద్వారా. బలవంతుడిదే రాజ్యం అన్న ఆటవిక న్యాయం అమలు చేయడం సామ్రాజ్యవాదుల స్వభావం. అయితే అమెరికా దానికొక ముసుగు తొడిగింది. దాని పేరే జాతీయ భద్రత. తాజాగా 2020లో జారీ చేసిన ఇంధన చట్టంలో దేశ భద్రతకు అవసరమైన కీలక ఖనిజాల జాబితాను ప్రకటించారు. అంటే ఆ కీలక ఖనిజాలు ఎక్కడున్నా, ఏ దేశంలో ఉన్నా వాటిని స్వాధీనం చేసుకోవడం అనేది జాతీయ భద్రత పేరుతో సమర్థించుకోడానికి అమెరికా తయారైంది. మనం మామూలుగానైతే మన దేశానికి వెలుపలి నుండి కాని, ఆంతరంగికంగా కాని ప్రమాదం ఎదురైనప్పుడు దానిని భద్రతా సమస్యగా పరిగణిస్తాం. కాని అమెరికా తీరే వేరు. భద్రతా అవసరాల పేరుతో అది ఎప్పుడైనా, ఏ దేశం మీదనైనా దాడి చేయవచ్చు, అక్కడ ఏ సంపదనైనా స్వాధీనం చేసుకోవచ్చు. బైటకు మాత్రం ప్రపంచంలోని ప్రజాస్వామ్యాన్నంతటినీ కాపాడే రక్షకుడిని తానే అన్నట్టు పోజు పెడుతుంది. ఆ పేరుతో కూడా కుట్రలు సాగిస్తుంది.

అమెరికన్ కార్పొరేట్ల పరిశ్రమల ఉత్పత్తులకు కావలసిన 50 రకాల ఖనిజాలను ఆ ఇంధన చట్టంలో పేర్కొన్నారు. వాటిలో కనీసం 12 ఖనిజాలు గ్రీన్‌ల్యాండ్‌లో లభిస్తాయి. రేర్ ఎర్త్‌గా పిలిచే ఖనిజాలు టైటానియం, లిథియం వంటివి ఆధునిక పరిశ్రమల్లో ముడి పదార్థాలుగా ఉన్నాయి. ఇవేవీ అమెరికాలో లభించవు. కాబట్టి అవి ఎక్కడ లభిస్తే ఆ దేశాలతో వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకుని వాటిని కొనుగోలు చేయాలి. కాని అమెరికా రూటే వేరు. ఆ దేశాలనే తన నియంత్రణలోకి తెచ్చుకోడానికి, కుదరకపోతే ఆక్రమించుకోడానికి పూనుకుంటుంది. ఇప్పుడు గ్రీన్‌ల్యాండ్, ఉక్రెయిన్‌ల మీద అమెరికా దృష్టి సారించింది ఇందుకే. గ్రీన్‌ల్యాండ్ భూభాగంలో 1.5 శాతం, అంటే 35,000 చదరపు కి.మీ ప్రాంతంలో ఖనిజాల తవ్వకం, అన్వేషణ సాగుతోంది. ఆర్కిటిక్ ధృవ ప్రాంతానికి అతి దగ్గర్లో ఉంది గనుక ఎక్కువ భాగం మంచుతో కప్పబడి వుంటుంది. ధృవ ప్రాంతపు మంచు కరిగిపోవడం అంటే అది పలు ప్రకృతి వైపరీత్యాలకు దారి తీస్తుంది. అందుకే చాలా పరిమితంగానే అక్కడ ఖనిజాల వెలికితీతకు అనుమతులు ఇస్తున్నారు. గతంలో చమురు, సహజవాయువు నిక్షేపాల అన్వేషణకు అనుమతిచ్చినా, 2021 నుండి అటువంటి అనుమతులను నిలుపుచేశారు. భూతల ఉష్ణోగ్రతలు పెరిగిపోయే ప్రమాదం ఉన్నందువల్ల ఆ విధంగా నిర్ణయించారు. ఇప్పటివరకూ చేసిన అన్వేషణలను బట్టి చూస్తే గ్రీన్‌ల్యాండ్‌లో 4.4 ట్రిలియన్ల డాలర్ల విలువైన కీలక ఖనిజాల నిక్షేపాలు ఉన్నట్టు అంచనా తేలింది. అందులో 1.76 ట్రిలియన్ల విలువైన చమురు, సహజవాయువు నిక్షేపాలు ఉన్నాయి. వాటిని వెలికి తీయకుండా నిలుపు చేశారు. గతంలో అమెరికన్ కంపెనీలైన బిపి. షెవ్రాన్, షెల్ తదితర సంస్థలకు ఖనిజాల అన్వేషణకు అనుమతులు ఇచ్చారు. కాని తర్వాత పర్యావరణ రక్షణ ప్రాధాన్యత రీత్యా వాటిని పునరుద్ధరించడం మానివేశారు. ఇప్పటికీ బ్రిటన్‌కు చెందిన నాలుగు కంపెనీల కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. వాటి కాల వ్యవధి 2027తో ముగుస్తుంది. తమ ఇంధన అవసరాలను సౌర విద్యుత్తుతో తీర్చుకోడానికి గ్రీన్‌ల్యాండ్ సిద్ధపడుతోంది. ఇదే ట్రంప్ కంటగింపుకు కారణం అయింది. స్వయంగా గుత్త చమురు సంస్థల యజమాని అయిన ట్రంప్ పర్యావరణ లక్ష్యాలను పూర్తిగా వ్యతిరేకిస్తున్నాడు. కాప్ శిఖరాగ్ర సమావేశాన్ని అమెరికా పట్టించుకోలేదు. ప్రపంచంలో ఉన్న సమస్త చమురు నిల్వలనూ తన ఆధీనంలోకి తెచ్చుకోవాలని ఆరాటపడుతున్నాడు. వాస్తవానికి 1955లో అమెరికా గ్రీన్‌ల్యాండ్‌ను 100 మిలియన్ డాలర్లకు కొనేయడానికి బేరం పెట్టింది. ప్రస్తుత విలువ ప్రకారం అది 1.3 బిలియన్ డాలర్లు. అంటే గ్రీన్‌ల్యాండ్ మీద అమెరికన్ గుత్తాధిపతుల కన్ను అప్పటి నుంచీ పడిందన్నమాట. ఇక ఉక్రెయిన్ మీద అమెరికా ప్రేమకు కారణం అక్కడ అమెరికాకు కావలసిన 'కీలక ఖనిజాలు' చాలా పుష్కలంగా ఉండడమే. టైటానియం, యురేనియం, ఇల్మెనైట్ వంటి విలువైన, అరుదైన ఖనిజాల నిల్వలు ఉక్రెయిన్ భూభాగంలో ఉన్నాయి. వీటి విలువ 14.8 ట్రిలియన్ల డాలర్లు ఉంటుందని అంచనా. ఎలక్ట్రిక్ కార్ల బ్యాటరీల తయారీకి ఉపయోగించే గ్రాఫైట్ నిల్వలు అక్కడ 19 మిలియన్ టన్నులు ఉన్నాయి. 1990 వరకూ ఉక్రెయిన్ రష్యాలో అంతర్భాగంగా ఉండేది కనుక ఆ నిక్షేపాల జోలికి పోవడం సాధ్యం కాలేదు. ఆ తర్వాత రష్యాతో సన్నిహిత సంబంధాలు నెలకొల్పుకోడానికి పూనుకున్న ప్రభుత్వాన్ని కూలదోసి జెలెన్‌స్కీని అమెరికా, బ్రిటన్ ముందుకు తెచ్చి నిలబెట్టాయి. సామ్రాజ్యవాద దేశాలకు ఉక్రెయిన్‌లో ఉన్న కీలక ఖనిజసంపద తమను దాటి బైటకు పోనివ్వరాదన్న దుగ్ధ ఉంది. అందుకే రష్యాతో ఘర్షణను ఎగదోశాయి. వీళ్ళు ఈ తగువుల్ని రేగ్గొట్టుతూ వుంటే ఇంకోపక్క చైనా చల్లగా ప్రపంచంలోని రేర్ ఎర్త్ ఖనిజాల నిల్వలలో 75 శాతంపై తన పట్టు సంపాదించింది. అమెరికా ఆక్రోశం పెరిగిపోడానికి ఇది మరో కారణం. ఉక్రెయిన్–రష్యా యుద్ధం మరికొంత కాలం కొనసాగితే తాము చైనా కన్నా మరింత వెనుకబడి పోతామన్న భయం పట్టుకుంది. అందుకే యుద్ధాన్ని వెంటనే ఆపుచేయాలని జెలెన్‌స్కీని ట్రంప్ ఆదేశించాడు. యుద్ధాన్ని రెచ్చగొట్టడమైతే చేయగలిగారు కాని విరమింపజేయాలంటే అదంత తేలికైన వ్యవహారం కాదు కదా.

ఎలాగో ఒకలా ఈ యుద్ధాన్ని త్వరగా ముగించి, ఆ తర్వాత ఉక్రెయిన్‌లోని ఖనిజ సంపదను చేజిక్కించుకోవాలని అమెరికా తొందరపడుతోంది. మరోపక్క బ్రిటన్, జర్మనీ తదితర దేశాలు తమ పొరుగునే ఉన్న ఉక్రెయిన్ నుండి ప్రయోజనాలు వస్తే గిస్తే తమకే ముందు దక్కాలన్న తాపత్రయంలో ఉన్నాయి. ఇంకో పక్క గ్రీన్ ల్యాండ్ జోలికి అమెరికా గనుక వస్తే "అది నాటో కూటమిలో సభ్యులైన దేశాల నడుమ యుద్ధానికి దారి తీస్తుంది'' అంటూ డెన్మార్క్ పార్లమెంటు ప్రతినిధి ప్రకటించారు. అంటే యూరోపియన్ సామ్రాజ్యవాద, సంపన్న దేశాలు అమెరికా ఏకపక్ష వైఖరికి తలొగ్గడానికి సిద్ధంగా లేవని కనపడుతోంది. ఈ మొత్తం వ్యవహారంలో అమెరికా గనుక పైచేయి సాధిస్తే అది మొత్తం మానవాళి మనుగడనే ప్రమాదంలో పడవేస్తుంది. పర్యావరణానికి దిద్దుకోలేనంత హాని జరుగుతుంది. ఒకవేళ యూరప్ లోని అమెరికా మిత్రులు అమెరికా యత్నాలను అడ్డుకుంటే అది సామ్రాజ్యవాద దేశాల నడుమ ఘర్షణలను తీవ్రతరం చేస్తుంది. మొత్తం మీద ఈ వ్యవహారాన్ని ప్రపంచం యావత్తూ శ్రద్ధగా పరిశీలిస్తోంది.

# కొత్త శకానికి నాంది యూరీ గగారిన్

యూరీ అలెక్సియేవిచ్ గగారిన్ ఒక సోవియట్ పైలట్, వ్యోమగామి, ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిన అంతరిక్ష యాత్రికుడు. 1961 ఏప్రిల్ 12న, వోస్టోక్ 1 అనే అంతరిక్ష నౌకలో ప్రయాణించి, భూమిని ఒకసారి పరిభ్రమించిన మొదటి మానవుడిగా చరిత్ర సృష్టించాడు. ఈ ఘనత అతన్ని అంతర్జాతీయంగా ఒక మహావ్యక్తిగా నిలిపింది. అంతరిక్ష పరిశోధనలో ఒక కొత్త శకానికి నాంది పలికిన గగారిన్, మానవ జాతికి సరికొత్త దిశను చూపించాడు. యూరీ గగారిన్ 1934, మార్చి 9న, సోవియట్ యూనియన్‌లోని రష్యాలోని స్మోలెన్స్క్ ప్రాంతంలోని క్లుషినో అనే చిన్న గ్రామంలో జన్మించాడు. ఆయన తండ్రి అలెక్సీ గగారిన్ ఒక పెదకారు (కార్పెంటర్), తల్లి అన్నా గగారినా ఒక పాల ఉత్పత్తి కార్మికురాలు. గగారిన్ బాల్యం సామాన్యమైనదే అయినా, రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో నాజీ ఆక్రమణ వల్ల ఆయన కుటుంబం తీవ్రంగా ప్రభావితమైంది. యుద్ధం తర్వాత, ఆయన విద్యను కొనసాగించి, ఓడ నిర్మాణ విద్యనభ్యసించేందుకు మాస్కోకు వెళ్లాడు. అక్కడే ఆయన విమానయానంపై ఆసక్తి కలిగి, ఒక వైమానిక క్లబ్‌లో చేరి తన మొదటి పాఠాలను అభ్యసించాడు. ఇది ఆయనను పైలట్‌గా మారే దిశగా నడిపించింది. 1955లో, గగారిన్ సోవియట్ వైమానిక దళంలో చేరి, "ఒరేన్‌బర్గ్ పైలట్ స్కూల్"లో శిక్షణ పొందాడు. 1957లో, మిగ్–15 యుద్ధ విమానాన్ని నడిపే అర్హత పొందాడు. అదే సంవత్సరం, వలెంటినా గోర్యచేవా అనే యువతిని వివాహం చేసుకున్నాడు. 1960లో, అంతరిక్ష కార్యక్రమానికి సంబంధించి వ్యోమగాములను శిక్షించేందుకు, సోవియట్ యూనియన్ కొంతమంది పైలట్లను ఎంపిక చేసింది. 3,000 మందికి పైగా దరఖాస్తు చేసుకోగా, 20 మందిని ఎంపిక చేశారు. గగారిన్ తన ప్రతిభ, శారీరక స్థైర్యం, మానసిక మాన్యతలతో ప్రత్యేకంగా నిలిచాడు. ఆయన చివరి పోటీలో జర్మన్ టైటోవ్‌తో కలిసి ఉన్నా, తన చిన్న కదలికలతో కూడిన శరీర ఆకృతి (5 అడుగుల 2 అంగుళాల ఎత్తు) వల్ల వోస్టోక్ క్యాబిన్‌లో సులభంగా కూర్చో గలుగుతాడని ఎంపికయ్యాడు. 1961, ఏప్రిల్ 12న, గగారిన్ "వోస్టోక్ 1" అనే అంతరిక్ష నౌకలో ప్రయాణించి, 108 నిమిషాల్లో భూమిని పూర్తిగా ఒకసారి చుట్టి వచ్చాడు. ఇది మానవాళి అంతరిక్ష యాత్రలో మొదటి ఘన విజయం. వోస్టోక్ 1 వ్యోమనౌక బైకొనూర్ కాస్మోడ్రోమ్ నుంచి ప్రయాణమైంది. భూమి చుట్టూ సుమారు 27,400 కి.మీ వేగంతో తిరిగింది. గగారిన్ అంతరిక్షంలో 108 నిమిషాలు గడిపాడు. ఆయన భూమిని చూసి చెప్పిన ప్రముఖ మాట – "పృథ్వీ ఎంత అందంగా ఉంది!" తిరిగి భూమిపై దిగేటప్పుడు, ఆయన 7 కిలోమీటర్ల ఎత్తునుండి పారాచూట్ ద్వారా కిందకు దిగి భద్రంగా ల్యాండ్ అయ్యాడు. ఈ ఘనత ప్రపంచాన్ని ఉద్రూతలూగించింది. సోవియట్ యూనియన్ గొప్ప విజయం సాధించిందని ప్రపంచ మంతటా గుర్తింపు లభించింది. వోస్టోక్ 1 ప్రయాణం తరువాత, గగారిన్ ఒక అంతర్జాతీయ ప్రముఖుడిగా మారిపోయాడు. సోవియట్ యూనియన్ అతనికి "హీరో ఆఫ్ ద సోవియట్ యూనియన్" అనే అత్యున్నత పురస్కారం అందించింది. ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాలను సందర్శించి, శాంతి మరియు అంతరిక్ష పరిశోధన కోసం తన మద్దతును తెలిపాడు. సోవియట్ అంతరిక్ష యాత్రికుల శిక్షణా కార్యక్రమంలో ఉపాధ్యాయుడిగా చేరాడు. 1967లో "సోయుజ్ 1" అనే కొత్త అంతరిక్ష నౌకను పరీక్షించేందుకు ఎంపికయ్యాడు, కానీ దానికి బదులుగా అతని మిత్రుడు వ్లాదిమీర్ కొమరోవ్‌ను పంపారు. కొమరోవ్ ఆ ప్రయాణంలో మరణించడంతో, గగారిన్ తదుపరి అంతరిక్ష యాత్రకు ఎంపిక కావడానికి అవకాశం తగ్గిపోయింది. 1968, మార్చి 27న, గగారిన్ తన శిక్షణా పైలట్ వ్లాదిమీర్ సెరోగిన్‌తో కలిసి మిగ్–15 యుద్ధ విమానం నడుపుతున్న సమయంలో ప్రమాదానికి గురయ్యాడు. కిర్జాచ్ నగర సమీపంలో విమానం కూలిపోవడంతో, ఇద్దరూ మరణించారు. ఆ ప్రమాదానికి గల కారణాలు ఇప్పటికీ పూర్తిగా అర్థం కాలేదు. కొందరు ఇది వాతావరణ సమస్య కారణంగా జరిగిందని భావిస్తారు. మరికొందరు ఇతర యుద్ధ విమానం వద్దకు వచ్చినప్పుడు ఏర్పడిన గందరగోళం వల్లనే ప్రమాదం జరిగిందని భావిస్తున్నారు. కొన్ని వాదనలు అసలు ప్రమాదం ఒక కుట్ర అని కూడా చెబుతున్నాయి. అయితే, గగారిన్ మృతితో అంతరిక్ష పరిశోధనలో ఒక గొప్ప ధైర్యవంతుడిని కోల్పోయింది.



రష్యాలో అనేక అంతరిక్ష కేంద్రాలు, రహదారులు, శిల్పాలు గగారిన్ పేరుతో నామకరణం చేయబడ్డాయి. ఏప్రిల్ 12ని "అంతర్జాతీయ మానవ అంతరిక్ష ప్రయాణ దినోత్సవం"గా పాటిస్తారు. గగారిన్ యొక్క విగ్రహాలు ప్రపంచ వ్యాప్తంగా నిలబెట్టబడ్డాయి. 1980లో "స్టార్ సిటీ" అనే అంతరిక్ష శిక్షణా స్థలానికి అతని పేరు పెట్టారు బైకొనూర్ కాస్మోడ్రోమ్‌లోని అతను ప్రయాణించిన లాంచ్ ప్యాడ్‌కు ఈ పేరు పెట్టారు. యూరీ గగారిన్ కేవలం ఒక వ్యోమగామి మాత్రమే కాదుబీ ఆయన మానవ సాహసానికి, శాస్త్రీయ పురోగతికి, మానవత్వానికి ఒక ప్రతీక. ఆయన చేసిన తొలి అంతరిక్ష యాత్ర మానవాళికి నూతన మార్గాలను చూపింది. ఆయన పేరు ఎప్పటికీ మానవ చరిత్రలో చిరస్థాయిగా నిలిచి పోతుంది. గగారిన్ స్ఫూర్తితో, భవిష్యత్తులో మరిన్ని అంతరిక్ష యాత్రలు, పరిశోధనలు జరగనున్నాయి.

# తెలంగాణకే తలమానికమైన ధర్మపురి నాటక సంస్థ

తెలంగాణలోనే మొదటిదిగా, తెలంగాణకే తలమానికంగా, ధర్మపురి పుణ్య క్షేత్రంలోని శ్రీ లక్ష్మనరసింహ నాట్య మండలి గత 88 సంవత్సరాలకు పైగా, కళామత ల్లికి ఎనలేని సేవలందిస్తూ తనకంటూ ఒక ప్రత్యేకతను సంతరించుకుంది. సనాతన ఆర్ష విద్యా సభ్యతా సంస్కృతులకు నిలయమైన ఈ క్షేత్రంలో, 1936 లో ప్రారంభమైన నాటక సంస్థ 3 తరాల నటులతో పలు పౌరాణిక సాంఘిక చారిత్రక నాటకాలు – నాటికలు ప్రదర్శిస్తూ రాష్ట్రంలోని పలు ప్రాంతాలు ప్రజాభిమానాన్ని చూర గొన్నది. గోదావరి తీరస్థ ప్రాచీన తీర్థము, పుణ్య క్షేత్రము అయిన ధర్మపురి పట్టణం, వేల సంవత్సరాల నుండి ఉజ్వల సాంస్కృతిక, వైదిక, నాగరికత, కలిగివున్న క్షేత్రంగా... ఆర్ష విద్యతో పాటు, సంగీతాది లలిత కళలకు నిలయంగా వాసికెక్కింది. తెలంగాణ ప్రాంతంలో సాంస్కృతిక చైతన్యం అంతగా లేక, స్తబ్దంగా ఉన్న రోజుల్లో, స్థానికుల సహకారంతో స్థాపించబడిన నాటక సంస్థ, తెలంగాణ లోనే మొదటిదిగా నిలువ కలిగింది. ఇది ప్రారంభం అయ్యే నాటికి తెలుగు భాషకు విలువ లేని "ఉర్దూ రాజభాష"గా గల నిజాం రాష్ట్ర ప్రభుత్వం ఒక వైపు... భారతీయ సంస్కృతికి వైద్యులకు కళలకు విలువ ఇవ్వని కేంద్ర ఆంగ్ల ప్రభుత్వం మరోవైపు, అననుకూల వాతావరణం ఉండేది. అయినా స్థానికుల అభిమానం, ధనం, సేవాభావం, ఈ సంస్థకు ఊపిరి పోసాయి. కీర్తిశేషులు కాసర్ల వెంకట రాజయ్య శిక్షణలో, దర్శకత్వంలో, తొలి తరం నటులు "సతీ సావిత్రి" నాటక ప్రదర్శనతో ప్రారంభించి, అనంతర కాలంలో వెను తిరిగి చూడకుండా, సుమారు పాతిక పౌరాణిక నాటకాలు... ద్రౌపతి వస్త్రాపహరణం, భక్త ప్రహ్లాద, శ్రీకృష్ణ తులాభారం, లవకుశ, భక్త రామదాసు, సతీ సక్కుబాయి, సతీ తులసి, శ్రీకృష్ణ రాయబారం, పాండవోద్యోగం వంటి అనేక నాటకాలు ప్రదర్శించారు. ఆరోజుల్లో ఈ నటులు ప్రదర్శించని పౌరాణిక నాటకమే లేదంటే అతిశయోక్తి లేదేమో. కాకెరి లక్ష్మీ కాంత శాస్త్రి, రొట్టె చంద్రశేఖరశాస్త్రి, సంగనభట్ల మాణిక్య శాస్త్రి, తెలంగాణ త్యాగయ్య చాచం కృష్ణయ్య, జగన్నగారి విశ్వనాథశాస్త్రి లాంటి ఉద్దండులు, వారి సరసన దెమ్మ బాలకృష్ణయ్య స్త్రీ పాత్ర ధారిగా తొలి తరం నటులు బహు ప్రశంసా పాత్రులు అయినారు. నాటక సంస్థ రథసారథులలో ఒకరైన కే. వీ. కేశవులు ( రాష్ట్ర మాజీ మంత్రి), 1946 లో మంచిర్యాలలో ఆంధ్ర సారస్వత పరిషత్తు మహా సభలలో, శ్రీకృష్ణ తులాభారం నాటకాన్ని ప్రదర్శింప చేయగా, సురవరం ప్రతాపరెడ్డి, మాడపాటి హనుమంతరావు, స్థానం నరసింహా రావు, నార్ల వెంకటేశ్వరరావు వంటి ప్రముఖులు నాటకాన్ని కాంచి, బహుధా ప్రశంసించారు. తర్వాత కాలంలో దేవులపల్లి రామానుజరావు, కాళోజీ నారాయణరావు, పివి నరసింహారావు, స్థానం నరసింహారావు లాంటి మేధావుల ప్రశంసా పాత్రమైంది. స్థానిక దైవం



లక్ష్మీ నరసింహ బ్రహ్మోత్సవాలలో, ప్రత్యేక ఓపెన్ థియేటర్ లో ప్రదర్శిత నాటకాలకు జనం టిక్కెట్టు కొని మరీ చూసేవారు. ఆ రోజుల్లోనే సొంత నాటక ప్రదర్శన శాల ఉండేది. రకరకాల సీనరీ పరదాలు, మేకప్ సామగ్రి, గదలు, కిరీటాలు, ఉయ్యాలలు, నిచ్చెనలు, ఫైర్ వర్క్స్, వగయిరా సకల హంగులతో అట్టహాసంగా ఉండేది. మొదటి తెరపై భారతమాత చిత్రపటం కలిగి ఉన్న ఈ సంస్థ ఆ రోజుల్లో పెద్ద సాహసమే చేసింది. ఎందుకంటే ఇది రాజ ద్రోహం కిందకు వచ్చేది. ఫైర్ వర్క్స్ లో యముని రాక, నారదుని మబ్బుల్లో ప్రయాణం, శిశుపాలుని శిరచ్ఛేదం, ప్రహ్లాదుని అగ్నిగుండంలో వేయడం, ద్రౌపదికి కృష్ణుడు చీరలు అందించడం, వంటి ఎన్నో అద్భుతాలను కశోజ్జల శివరామయ్య పర్యవేక్షణలో చూపారు. రెండవ తరం నటులు దశాబ్దకాలం ప్రదర్శన ఇవ్వగా, నాటి సీనియర్ నాయకులు దాద గారి కిషన్ రావు నిర్వహణలో, సంస్కృతాంధ్ర డిగ్రీ కళాశాలకు ప్రారంభ నిధుల సేకరణ గావించారు. గయోపాఖ్యానం నాటకం తెలంగాణ లోని చాలా ప్రాంతాల్లో రొట్టె విశ్వనాథశాస్త్రి, గుండయ్య శాస్త్రి, పెండ్యాల శంకర్, ఓజ్జల రామచంద్రం, నరసింహా చారి, గుండి హనుమాన్లు, భోగం పురుషోత్తం, కొరిడె నరహరి వంటి మేటి నటులతో ప్రదర్శించారు. మూడవ తరంలో పౌరాణిక నాటకాలతో పాటు వీరపాండ్య కట్ట బొమ్మన, వీర కాపయ, నాగమ నాయకుడు లాంటి చారిత్రక నాటకాలు పెక్కు సాంఘిక నాటకాలు ప్రదర్శనలను కొనసాగిస్తున్నారు. 1984 లో జిల్లా కలెక్టర్ కె ఎస్ శర్మ, 1991 లో కలెక్టర్ బన్వర్ లాల్ ఆహ్వానం మేరకు, వారి సమక్షంలో కరీంనగర్ కళాభారతిలో ప్రదర్శనలిచ్చి బహుమతులు అందుకున్నారు. 1989 లో తెలుగు విశ్వ విద్యాలయం నిర్వహించిన, సాంప్రదాయ పద్య నాటక పోటీలలో సూర్యాపేటలో "కట్టబొమ్మన" ప్రదర్శించారు. 2016లో వరంగల్ లో, వేణుమాధవ్ ఆడిటోరియంలో... అనంతరం హైదరాబాదులోని రవీంద్ర భారతిలో.. ప్రదర్శన ఇవ్వడం జరిగింది. నిధులు ప్రోగు చేసి సొంత సామగ్రిని సమకూర్చు కున్నారు. ప్రస్తుత నటులలో కొందరు వీడియో, చలన చిత్రాలలో అవకాశాలు పొందారు. విద్యావేత్త విశ్రాంత ప్రాచార్యులు డాక్టర్ సంగనభట్ల నరసయ్య, బహుముఖ ప్రజ్ఞాశాలి, నటులు కొరిడె నరహరిశర్మ, కాకెర్ల దత్తాత్రేయ, ఎస్ రామకృష్ణయ్య, మునిగాల కిషన్ తదితరులు చారిత్రక నటులుగా మిగుల గుర్తింపు పొందారు. 1993 లో తెలుగు యూనివర్సిటీ వైస్ ఛాన్స్ లర్ పేర్వారం జగన్నాథం ద్వారా నిధులు పొంది, స్వర్ణోత్సవాలు జరిపి, గయోపాఖ్యానం నాటకం ప్రదర్శించి ముఖ్య అతిథిగా విచ్చేసిన సినీ దర్శకులు దివంగత బి. ఎస్. నారాయణ చేత కళాకారులకు సన్మానాలు చేయించారు. సావనీర్ విడుదల చేశారు. 1955 లో ఈ సంస్థ కళాకారులకు ఆంధ్ర నాటక పరిషత్తు 1983 లో ఆంధ్ర ప్రదేశ్ నాటక అకాడమీ కాకర్ల లక్ష్మీకాంత శాస్త్రికి, పెండ్యాల సీతారాములకు ఘనంగా సత్కారం చేశాయి. స్థానిక డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ నర్సయ్య నాటక రంగంలో చేసిన కృషికి గుర్తింపుగా గ్రామీణ కళా జ్యోతి అవార్డు లభించింది. నలుగురు వృద్ధ కళాకారులకు గత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పెన్షన్ పథకాలను మంజూరు చేసింది. ఎనిమిదిన్నర దశాబ్దాలకు పైగా కళామ తల్లికి సేవ చేస్తూ సాంప్రదాయక పద్య నాటకాలను బ్రతికిస్తున్న అపురూప అరుదైన నాట్యమండలి 2017 ఏప్రిల్ 2,3 తేదీలలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కే.వీ. రమణాచారి, నాటి ప్రభుత్వ చీఫ్ విప్, మాజీ రాష్ట్ర సంక్షేమ శాఖల మంత్రి కొప్పుల ఈశ్వర్, బీసీ కమిషన్ చైర్మన్ బీ. ఎస్.రాములు తదితర ప్రముఖులు హాజరు కాగా, 80 వసంతాల వేడుకలు ఘనంగా నిర్వహించు కున్నారు. ప్రస్తుతం నరహరి శర్మ ఆధ్వర్యంలో, నర్సయ్య పర్యవేక్షణలో, దత్తాత్రి నిర్వహణలో, రామకిష్టయ్య, చంద్రమౌళి, వెంకట రమణ, కిశోర్, మహేందర్, సురేశ్, బాలకృష్ణ, శేఖర్, నర్సింహమూర్తి, జన్మంచి నరసయ్య, వంశీ కృష్ణ, నరహరి, అమర్, అనిల్, రాజగోపాల్, విజయ్, శ్రీనివాస్, రాంకిషన్, సంజీవ్, సురేందర్, పుల్లయ్య శాస్త్రి లకు తోడు కాకెరి అరుణ, సంగనభట్ల ప్రతిభ తదితరులు స్త్రీ పాత్రలను పోషిస్తూ, పౌరాణిక చారిత్రక నాటకాల ప్రదర్శనలను కొన సాగిస్తున్నారు.



రామ కిష్టయ్య సంగన భట్ల...

# ఎక్స్‌కిరణాల ఆవిష్కర్త రాంట్జెన్

19 వ శతాబ్దం సంచలనాత్మక శాస్త్రీయ ఆవిష్కరణలకు స్వర్ణ యుగం. అలాంటి యుగంలో భౌతిక శాస్త్ర ప్రొఫెసర్ విల్హెల్మ్ కాన్రాడ్ రాంట్జెన్ ఒక వింతను కనుగొన్నాడు, దానిని చాలా మంది నమ్మలేదు. రాంట్జెన్ యొక్క ఆవిష్కరణ వార్తలు జనవరి 1896 ప్రారంభం నుండి ప్రపంచ వ్యాప్తంగా వ్యాపించాయి. శాస్త్రవేత్తలు సైతం నివేదికలను ప్రాక్టికల్ జోకర్ ఉపాయం అని కొట్టి పారేశారు. రోగ నిర్ధారణకు కొత్త ఒరవడిని సృష్టించి, ప్రపంచంలో వైద్య రంగంలో రోగ నిర్ధారణకు (రేడియోగ్రఫీ), రోగ నిర్మూలనకు (రేడియో థెరఫీ) కొరకు ఉపయోగించే ఎక్స్ కిరణాలను కనుగొన్న ప్రఖ్యాత శాస్త్రవేత్త విల్హెల్మ్ కన్రాడ్ రాంట్జెన్. ఆయన కనుగొన్న ఎక్స్‌కిరణాలు వైద్యరంగం లోనె కాక భద్రతా రంగంలో ఉపయోగ పడుతున్నాయి. విల్హెల్మ్ కన్రాడ్ రాంట్జెన్ (మార్చి 27,1845 – 1923 ఫిబ్రవరి 10) జర్మన్ దేశ భౌతిక శాస్త్ర శాస్త్రవేత్త. 1895 నవంబరు 8 న విద్యుదయస్కాంత తరంగాలలో వివిధ తరంగ దైర్ఘ్యులుల అవధులలో గల ఎక్స్– కిరణాలను కనుగొన్నాడు. ఈ పరిశోధన వల్ల 1991 లో భౌతిక శాస్త్రంలో మొదటి సారి నోబెల్ బహుమతి పొందాడు. ఆయన చేసిన కృషికి గాను ఆవర్తన పట్టిక లో 111 పరమాణు సంఖ్య గల మూలకానికి రాంట్ జీనియమ్ అనిపేరు పెట్టి గౌరవించారు. రాంట్జన్ 1845 మార్చి 27 న జర్మనీలోని లెన్నెస్ లో జన్మించాడు. ఈయన తండ్రి ఒక రైతు. తల్లి ఒక డచ్ మహిళ. హాలెండ్ లో విద్యాభ్యాసం జరిగింది. 1865 లో యుట్రెచ్ యూనివర్సిటీలో చేరుటకు ప్రయత్నాలు ప్రారంభించాడు. కాని జూరిచ్ లో గల ఫెడెరల్ పాలిటెక్నిక్ సంస్థ లో చేరి పరీక్షలను ఉత్తీర్ణుడయ్యాడు. అక్కడ మెకానికల్ ఇంజనీరుగా చేరాడు. 1869 లో తత్వ శాస్త్రములో జూరిచ్ విశ్వ విద్యాలయం నుండి పి.హెచ్.డి పట్టాను పొందాడు. ఆ విశ్వ విద్యాలయంలో ప్రముఖ ప్రొపెసర్ అయిన ఆగస్టు కుండ్ట్ కు ప్రియమైన శిష్యుడయ్యాడు. 1874లో స్టాన్‌ఫర్డు విశ్వవిద్యాలయంలో అధ్యాపకునిగా నియమించ బడ్డాడు. 1875 లో హెహెనీం విశ్వ విద్యాలయంలో ప్రొఫెసర్ గా, తర్వాత 1876 లో స్టాన్ ఫర్డు విశ్వ విద్యాలయంలో మరల అధ్యాపకునిగా, 1888 లో గీసన్ విశ్వ విద్యాలయంలో భౌతిక శాస్త్ర ఆచార్యునిగా, తర్వాత వుర్జ్ బర్గ్ విశ్వ విద్యాలయంలో భౌతిక శాస్త్ర విభాగంలో విధులు నిర్వర్తించాడు. 1900 లో ప్రభుత్వ అభ్యర్థనపై మంచ్ యూనివర్సిటీలో చేరాడు. ఆయన కుటుంబం యు.ఎస్.ఎకు వలస వెళ్ళాలని నిర్ణయించు కున్నారు. న్యూయార్క్ లో కొలంబియా యూనివర్సిటీ వారు అవకాశం యిచ్చినప్పటికీ మొదటి ప్రపంచ యుద్ధం కారణంగా తన శేష జీవితాన్ని మునిచ్ నందే గడిపాడు. 1895 వరకు ఉత్సర్గనాళ ప్రయోగాలలో హెర్ట్జ, జాన్ హిటార్ఫ్, విలియం క్రూక్స్, టెస్లా,లీనార్డో లతో పని చేశాడు. ఎక్స్ కిరణాలను రాయింట్ జన్ కిరణాలని అంటారు. కాని రాంట్జెన్ స్వయంగా వాటిని ఎక్స్ కిరణాలని పిలిచాడు. ఈ కిరణాలను కనుగొని లోకానికి పరోపకారం చేసినందుకు కృతజ్ఞతగా ఆయనకు 1901 లో భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతి లభ్యమయింది. ఈ ఎక్స్ రే వెనుక ఎంతో ఆసక్తి కరమైన కథ ఉంది. రాయింట్ జన్ కేథోడ్ రే ట్యూబ్ (శూన్య గాజు నాళం)తో పరిశోధనలు చేసేవాడు. గది అంతా చీకటిగా ఉన్నప్పుడు యీ ట్యూబ్ గుండా కాంతి కిరణాలను పంపడం జరిగింది. పైగా ట్యూబ్ చుట్టూ నల్లని కాగితాన్ని కాంతి కిరణాలు ఏ కొంచెం కూడా వెలువడ కుండా కప్పి ఉంచాడు. ఇలా చేసినప్పటికి కాథోడ్ ట్యూబ్ కు సమీపంలో ఉన్న బేరియం ప్లాటినో సైనైడ్ స్ఫటికం వింత మెరుపులతో ప్రకాశించ సాగింది. నల్లటి కాగితాన్ని కప్పి ఉంచినప్పటికీ కాథోడ్ ట్యూబ్ నుంచి ఏవో అజ్ఞాత కిరణాలు వెలువడి బేరియం ప్లాటినో సైనైడ్ స్ఫటికం మీద పడి అది మెరిసేటట్లు చేసిందని ఆయన ఊహించ గలిగాడు. ఈ కిరణాలను కాగితం గుండా, చెక్క గుండా, లోహపు పలకల గుండా ప్రయాణం చేయగలవని యీయన కనుగొన్నాడు. ఈ కిరణాలు కూడా ఓ రకమైన కాంతి కిరణాలే అని అయితే వీటి తరంగ దైర్ఘ్యం చాలా తక్కువ కావటం వల్ల మనుషుల కళ్ళకు కనిపించవని రాయింట్జన్ వెల్లడించాడు. మామూలు కాంతి కిరణాలే ఫోటోగ్రాఫిక్ ప్లేట్ల మీద ప్రభావం చూపుతూ ఉండగా, యీ కిరణాలు మాత్రం చూపకుండా ఉంటాయా అనే ఆలోచన రాయింట్ జెన్ కి రావటం – శాస్త్ర ప్రపంలో ఒక సరికొత్త అధ్యాయానికే కారణ భూతమైనది. ప్రయోగం చేయటం కోసం రాంట్జెన్ ఫోటో గ్రాఫిక్ ప్లేటు మీద తన భార్య చేతిని ఉంచి యీ కిరణాలను ప్రసారం చేసి ఫోటోను డెవలప్ చేసి చూసి ఆశ్చర్య పోయాడు. చేతి ఎముకలు ఉంగరంతో సహా ఆ ఫోటో లో వచ్చింది. చుట్టూ మాంసం ఉన్నట్లు మసక మసకగా ఉంది. అంటే సజీవంగా ఉన్న మనిషి కంకాళాన్ని ఈ కిరణాల ద్వారా ఫోటో తీయవచ్చని స్పష్టంగా తేలింది. దురదృష్టవశాత్తు రాంట్జెన్, ఆయనతో కలిసి పనిచేసిన మరో ఇద్దరు పరిశోధకులు యీ ఎక్స్ కిరణాల తాకిడికే క్రమ క్రమంగా మరణించాడు. ఈ ఎక్స్–కిరణాల వల్ల ఎంతో ప్రయోజనం కలుగుతున్నప్పటికీ వాటిని మితిమీరి వాడితే మాత్రం ప్రమాదం తప్పదని,యీ కారణంగానే ఎక్స్–కిరణాలను నిరంతరం గురి కాబట్టే రాంట్జెన్ ఆ కిరణాల ప్రభావంగానే చని పోయాడని రుజువైంది. రేడియో ధార్మికత నుండి రక్షించు కొనుటకు సీసపు కవచాలు వాడే కొద్దిమంది మార్గ నిర్దేశకులో ఆయన ఒకరు. ఆయన చేసిన ఆవిష్కరణలకు పేటెంట్ హక్కులు కూడా తీసుకోలేదు. నోబెల్ బహుమతిగా వచ్చిన ధనమును వర్జ్ బర్గ్ విశ్వ విద్యాలయమునకు విరాళంగా యిచ్చాడు. మొదటి ప్రపంచ యుద్ధం వల్ల యేర్పడే ద్రవ్యోల్బణం వల్ల రాంట్జెన్ చాలా పేదరికంలో మగ్గాడు. తన శేష జీవితాన్ని మునిచ్కి సమీపంలో గల విల్ హెల్మ్ లో గల యింటిలో గడిపాడు. ఆయన కోరిక ప్రకారం ఆయన వ్యక్తిగత, శాస్త్రమునకు సంబంధించిన ఉత్తర ప్రత్యుత్తరాలు ఆయన మరణం తర్వాత నాశనం చేయటం జరిగింది. 1901 లో రాంట్జెన్‌కు మొదటి భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతి వచ్చింది. ఈ బహుమతి ఆయన ఎక్స్ కిరణాలు కనుగొని విశేష సేవలందించినందుకు గాను యివ్వ బడింది. కాని రాంట్ జెన్ ఆ బహుమతికి వచ్చిన ఆర్థిక ప్రతిఫలాన్ని తన విశ్వ విద్యాలయమునకు దానమిచ్చాడు. పియరీ క్యూరీ వలే రాంట్జెన్ తన పరిశోధనకు పేటెంట్ హక్కులను తిరస్కరించాడు. మానవాళికి తన పరిశోధన యొక్క ఫలితాలు ఉపయోగకరంగా ఉండాలని, ఈ కిరణాలకు తన పేరు కూడా పెట్టరాదని కోరుకున్నాడు.



# తిరుమల తిరుపతి దేవస్థానం పిలుపు మేరకు తరలి వెళ్లిన భజన బృందం.

శ్రీ భూ నీలా సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో భజన బృందానికి ప్రత్యేక పూజలు.
ఆలయ చైర్మన్ మహాలక్ష్మి వెంకన్ననర్సయ్య.





ఖానాపురం మార్చి26(వుదయం ప్రతినిధి): మండలంలోని బుధరావుపేట గ్రామానికి చెందిన కర్ర పిచ్చిరెడ్డి భజన బృందం తిరుమల తిరుపతి దేవస్థానం పిలుపు మేరకు అఖండ హరినామ సంకీర్తన కార్యక్రమాన్ని తిరుమల తిరుపతిలో నిర్వహించడానికి బయలుదేరి వెళ్లినట్లు శ్రీ భూ నీలా సమేత వెంకటేశ్వరస్వామి ఆలయ చైర్మన్ మహాలక్ష్మి వెంకటనర్సయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ మాట్లాడుతూ ఆలయంలోని భజన బృందానికి ఆలయ అర్చక స్వామి వేణు ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం భజన బృందాన్ని తిరుమల తిరుపతి దేవస్థానానికి బయలుదేరి వెళ్లినట్లు ఆలయ చైర్మన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ సహాయ కార్యదర్శి చెడిపాక ఉపేందర్, భజన బృందం కర్ర పిచ్చి రెడ్డి, కర్ర సుకన్య, పోల్కం ప్రమీల, వాసంశెట్టి విజయలక్ష్మి, కొమ్మిడి సుగుణ, శేరు మల్లయ్య, నందగిరి తారమ్మ, బండారి భారతమ్మ, వేల్పుల వాణి, ఆకుల మంజుల, సోమ రామతార, సింగ్ రామయ్య, కర్ర మంజుల, సింగు సుధాకర్, సింగు సునీత తోపాటు తదితరులు పాల్గొన్నారు.

# శరవేగంగా ఆలయ ఆర్చి నిర్మాణ పనులు.

**ఆలయ ఆర్చి నిర్మాణ ఇన్చార్జి చెడిపాక.**



హైదరాబాద్,మార్చి26వుదయం (ప్రతినిధి): మండలంలోని బుధరావుపేట గ్రామంలోని శ్రీ భూ నీలా సమేత వెంకటేశ్వరస్వామి ఆలయం ఆర్చి (సింహద్వారం) నిర్మాణ పనులు శర వేగంగా జరుగుతున్నట్లు ఆలయ నిర్మాణ ఇన్చార్జ్ ఆలయ సహాయ కార్యదర్శి చెడిపాక ఉపేందర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సొంత ఖర్చులతో ఆలయ ఆర్చి (సింహద్వారా%శీ%) నిర్మిస్తున్నట్లు తెలిపారు.

# పెళ్లిరోజు పుట్టినరోజున శివరామ క్షేత్రంలో దర్శనం చేసుకుంటే అంతా శుభం జరుగుతుంది.

**ఆలయ చైర్మన్ నడికెల్లి రాజేశ్వర్ రావు.**



ఖానాపురం మార్చి26(వుదయం ప్రతినిధి): మండలంలోని ధర్మరావుపేట గ్రామంలోని నూతనంగా నిర్మించిన శివరామ క్షేత్రంలోని పెళ్లి రోజుగాని, పుట్టినరోజుగాని మరే ఇతర నూతన పనిని మొదలుపెట్టినప్పుడు శివరామ క్షేత్రాన్ని దర్శించుకుని పూజలు నిర్వహిస్తే ఆ కుటుంబానికి అంతా శుభం జరుగుతుందని ఆలయ చైర్మన్ నడిపెల్లి రాజేశ్వర్ రావు ప్రజలకు భక్తులకు తెలిపారు. అలాగే బుధవారం పెళ్లిరోజు సందర్భంగా గ్రామానికి చెందిన కన్నెబోయిన మౌనికరమేష్ యాదవ్ దంపతుల పెళ్లిరోజు సందర్భంగా ఆలయంలో ఆలయ అర్చక స్వామి అన్వేష్ శాస్త్రి ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం ఆలయ చైర్మన్ పెళ్లిరోజు జరుపుకుంటున్న దంపతులను ఆలయ ఆవరణలో శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ బాధ్యులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# పెరుమాండ్ల రామకృష్ణకు సముచిత స్థానం కల్పించాలి!

- పేదలకు ఉచిత వైద్యాన్ని అందిస్తున్న పేదల డాక్టర్!
- గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కృషిచేసిన రామకృష్ణ!
- డిబీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేష్!



హనుమకొండ, మార్చి 26(వుదయం జిల్లా ప్రతినిధి) :సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన నిరుపేదలకు ఉచితంగా,పేద వర్గాలకు తక్కువ ఫీజులతో నాణ్యమైన కార్పోరేట్ స్థాయి వైద్యాన్ని అందిస్తూ పేదల డాక్టర్ గా పేరుగాంచిన కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ డిపార్ట్మెంట్ హనుమకొండ జిల్లా చైర్మన్ డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణకు రాష్ట్రస్థాయి నామినేటెడ్ కార్పొరేషన్ పదవిని కానీ ఎమ్మెల్సీగా కానీ నియమించి సముచిత స్థానాన్ని కల్పించాలని కాకతీయ మ్యూచువల్ ఎయిడెడ్ కోఆపరేటివ్ సొసైటీ (కే మ్యాక్స్)వైస్ చైర్మన్,దళిత బహుజన ఫ్రంట్ (డిబీఎఫ్) జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేష్ డిమాండ్ చేశారు.బుధవారం ఆత్మకూరు మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ కే మాక్స్ సహకార సంస్థ ద్వారా పేదలకు విద్య,వైద్యం,ఆర్థిక,ఉపాధి రంగాలలో తోడ్పాటును అందిస్తున్నారని తెలిపారు. గడచిన అసెంబ్లీ,పార్లమెంటు ఎన్నికల్లో వరంగల్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయానికి రామకృష్ణ కృషి చేశారని జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు,ఎంపిలు, ప్రజాప్రతినిధులు ఆయనకు పదవి రావడానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కే మాక్స్ సభ్యులు మాదాసి రాజు,మాదాసి నవీన్,బిరు లక్ష్మణ్, జన్ను శ్రీకాంత్,పోలెపాక అనిల్,మాదాసి సిద్ధార్థ, మాదాసి కౌశిక్ తదితరులు పాల్గొన్నారు.

# మృతుల కుటుంబాలకు పరుపాటి శ్రీనివాస్ రెడ్డి అండగా



రాయపర్తి మార్చి 26( వుదయం ప్రతినిధి ):మండల కేంద్రంలో పాటు జగనాథపల్లి బిఆర్ఎస్ పార్టీ చెందిన కాస్రబోయిన కొమురయ్య , గుండెబోయిన ఎల్లయ్య , కాస్రబోయిన కొమురయ్య , మచ్చ సాయిలుఇటీవల వివిధ కారణాల వల్ల మరణించగా వారి కుటుంబ లను ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బిఆర్ఎస్ జిల్లా నాయకులు పరుపాటి శ్రీనివాస్ రెడ్డి పరామర్శించి, ఫౌండేషన్ ఆధ్వర్యంలో 50 కేజీ ల బియ్యం, ఆయిల్ క్యాన్ ను అందించారు. ఈ కార్యక్రమంలో మాజీఎంపీపీజినుగు అనిమి రెడ్డి, ఫౌండేషన్ అధికార ప్రతినిధి లేతకుల రంగా రెడ్డి, మండల పార్టీ ప్రధాన కార్యదర్శిపూస మధు, బద్దం వేణుగోపాల్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ ఐత రామ్ చందర్, గ్రామ పార్టీ అధ్యక్షులు అనంతుల కృష్ణారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి సంకినేని ఎల్ల స్వామి, పరూపాటి రవీందర్ రెడ్డి ,చందు రామ్,గబ్బేట యాకయ్య, ఎనగందుల యాదగిరి, ఎండీ అక్బర్, ఉబ్బని సింహాద్రి, చందు సతీష్, ఎండీ యూసఫ్, బండి లింగన్న, మైస వెంకటేశం, చందు లక్ష్మణ్, ఉబ్బని మధు, గారే నరేష్, దీకొండ సంతోష్ గబ్బెట ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# పెళ్లిరోజు పుట్టినరోజున శివరామ క్షేత్రంలో దర్శనం చేసుకుంటే అంతా శుభం జరుగుతుంది.

ఆలయ చైర్మన్ నడికెల్లి రాజేశ్వర్ రావు.



ఖానాపురం మార్చి26(వుదయం ప్రతినిధి): మండలంలోని ధర్మరావుపేట గ్రామంలోని నూతనంగా నిర్మించిన శివరామ క్షేత్రంలోని పెళ్లి రోజుగాని, పుట్టినరోజుగాని మరే ఇతర నూతన పనిని మొదలుపెట్టినప్పుడు శివరామ క్షేత్రాన్ని దర్శించుకుని పూజలు నిర్వహిస్తే ఆ కుటుంబానికి అంతా శుభం జరుగుతుందని ఆలయ చైర్మన్ నడిపెల్లి రాజేశ్వర్ రావు ప్రజలకు భక్తులకు తెలిపారు. అలాగే బుధవారం పెళ్లిరోజు సందర్భంగా గ్రామానికి చెందిన కన్నెబోయిన మౌనికరమేష్ యాదవ్ దంపతుల పెళ్లిరోజు సందర్భంగా ఆలయంలో ఆలయ అర్చక స్వామి అన్వేష్ శాస్త్రి ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం ఆలయ చైర్మన్ పెళ్లిరోజు జరుపుకుంటున్న దంపతులను ఆలయ ఆవరణలో శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ బాధ్యులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# రూరల్ రిలేషన్ స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయం

## జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే





జయశంకర్ భూపాలపల్లి మార్చి 26(వుదయం ప్రతినిధి) రూరల్ ఇండియా స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయమని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు.జిల్లాలోని అటవీ గ్రామాలతో పాటు ఎంపిక ప్రాతిపతికన 19 ప్రాథమిక, ఉన్నత పాఠాలల్లో లైబ్రరీలు, స్పోర్ట్స్ కిట్లను, జ్ఞాన్ కి, ఫిట్ కి కార్యక్రమం ద్వారా సంస్థ వ్యవస్థాపకుడు పూణే కు చెందిన ప్రదీప్ లోకండే తన ఆర్గనైజేషన్ ద్వారా బుధవారం అందించడం జరిగిందని అన్నారు, మంచి విలువలకు సంబందించిన పుస్తకాలు, యోగా, ధ్యానం, జాతీయ నాయకుల జీవిత చరిత్రలు, వ్యక్తిత్వ వికాసం, నీతి కథలు, వివిధ రకాల ఉపయోగకరమైన పుస్తకాలు ఉన్నాయని, పిల్లల మనోవికాసానికి, ఆరోగ్యవంత సమాజానికి, లైబ్రరీలు, స్పోర్ట్స్ కిట్లు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ రిలేషన్ సంస్థ ప్రతినిధులు నితీన్ కుమార్ నంద కుమార్, సిసి ఫసియోద్దీన్, పాల్గొన్నారు.

# అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించిన ప్రవీణ్ కుమార్

ఆదిలాబాద్, మార్చి26(వుదయం ప్రతినిధి): బెజ్జూర్ మండలంలోని తలాయి గ్రామంలో బుధవారం బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఆర్. ఎస్. ప్రవీణ్ కుమార్ పర్యటించారు. ఈ సందర్భంగా శిథిలావస్థలో ఉన్న అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం గ్రామస్థులు, రైతులతో సమావేశమై భూసమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో శ్యామరావు, రాజు,

# మృతురాలి ఆచూకీ లభ్యం

బోథ్, మార్చి26(వుదయం ప్రతినిధి): బాసర గోదావరిలో పడి మహిళ మృతి చెందిన విషయం తెలిసిందే. కాగా మృతురాలిని ముథోల్ మండలం ఆష్ట గ్రామానికి చెందిన అనురాధ (35)గా గుర్తించారు. ఆమెకు భర్త, కుమారుడు, కూతురు ఉన్నట్లు వెల్లడించారు. మృతురాలి తల్లి రాజవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

# శ్రీనిధి రుణాలు వసూలు చేయాలి: అదనపు కలెక్టర్

నిర్మల్, మార్చి 26(ఎ.ఎం.ఎస్): శ్రీనిధి రుణ బకాయిల వసూలును త్వరగా పూర్తి చేయాలని బుధవారం నిర్మల్ జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో నిర్ణీత గడువులోగా శ్రీనిధి రుణాల వసూలు ప్రక్రియ పూర్తిచేయాలన్నారు.

మండలాల వారిగా మహిళా సంఘాల సంఖ్య, మంజూరు చేసిన రుణాలు, ఇప్పటివరకు సంఘాలు చెల్లించిన బకాయిలకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.

# ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి చొరవతో నగర ప్రజలకు ఊరట!

– ఆస్తి పన్నుపై వడ్డీ బకాయిలలో 90% రాయివన్ టైమ్ సెటిల్‌మెంట్ మాఫీ చేస్తూ ఉత్తరువులు
– ఎం.ఎల్.ఏ. నాయిని రాజేందర్ రెడ్డి, రాష్ట్ర ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపినిన నగర ప్రజలు



హనుమకొండ, మార్చి 26(వుదయం జిల్లా ప్రతినిధి) : గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పోరేషన్ కు కూడా ఆస్తి పన్నుపై వడ్డీ బకాయిలలో 90% రాయితీ వన్ టైమ్ సెటిల్‌మెంట్ చేయాలంటూ శాసన సభలో లేవనెత్తిన వరంగల్ పశ్చిమ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి..గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పోరేషన్ లాగే గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పోరేషన్ కు ఆస్తి పన్నుపై వడ్డీ బకాయిలలో 90% రాయితీ వన్ టైమ్ సెటిల్‌మెంట్ ఇస్తూ ఉత్తర్వులు ఇవ్వాలని కోరిన నాయిని రాజేందర్ రెడ్డి..ఇప్పటి వరకు ఈ వన్ టైం సెటిల్మెంట్ కేవలం గ్రేటర్ హైదరాబాద్ కు మాత్రమే అందుబాటులో ఉండేది.రాష్ట్రంలోని ఇతర పట్టణ స్థానిక సంస్థలకు %యీూ% పథకానని విస్తరించాలని ప్రభుత్వానికి అభ్యర్థనలు వచ్చాయి.

నాయిని అసెంబ్లీ లో ప్రస్తావించిన తర్వాత సమర్థించిన అందరు శాసన సభ్యులు ఈ అంశంపై సానుకూలంగా స్పందించి రాష్ట్రంలోని అన్ని పట్టణ స్థానిక సంస్థలు ఆస్తిపై 90 % శాతం బకాయి వడ్డీని మాఫీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తరువులు జారి చేసింది.ప్రభుత్వం ఈ విషయాన్ని మరితగా సమీక్షించి రాష్ట్రంలోని అన్ని పట్టణ స్థానిక సంస్థలకు %యీూ% సౌకర్యాన్ని ప్రభుత్వం విస్తరించాలని నిర్ణయించింది. దీని ప్రకారం ఆస్తి పన్నుపై వడ్డీ బకాయిలలో 90% రాయితీ వన్ టైమ్ సెటిల్‌మెంట్ ఇస్తూ ఉత్తర్వులు జారి చేసిన మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ %ఁ% అర్బన్ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్.%+.ూ%.లో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పోరేషన్ (%+ఎవీజ%) లోని వన్ టైం సెటిల్మెంట్ పథకం కింద అన్ని ఆస్తులకు సంబంధించి పన్ను చెల్లింపు దారుడు 2024 %–% 2025 ఆర్థిక సంవత్సరం వరకు ఆస్థి పన్ను బకాయిల సూత్రప్రాయ మొత్తాన్ని మరియు పేరుకుపోయిన బకాయిలపై 10% వడిని ఒకేసారి చెల్లిన్చినట్లయితే ఆస్తి పన్నుపై 90 శాతం పేరుకుపోయిన బకాయి వడ్డీని మాఫీ చేయడానికి ప్రభుత్వం ఉత్తరువులు జారి చేసింది.

# ఎర్రవల్లిలో ఉన్న అయిజ సోషల్ వెల్ఫేర్ బాలుర గురుకుల విద్యాలయాన్ని అయిజకు తరలించండి




అలంపూర్ మార్చి 26 (వుదయం ప్రతినిధి) గత 2015–16 విద్యా సంవత్సరం అయిజకు మంజూరైన సోషల్ వెల్ఫేర్ బాలుర గురుకుల పాటశాల మంజూరు అయింది. ఈ గురుకులం ఐజలో ప్రభుత్వ పాఠశాలలో 8 నెలలు మాత్రమే కొనసాగింది. ఆ తర్వాత వసతులు లేవని ఎర్రవల్లి చౌరస్తాకు 2017లో మార్చబడింది. అట్టి విద్యాలయాన్ని మళ్లీ ఐజలో కొనసాగించుటకు ప్రయత్నం చేయగలరని కలెక్టర్ కు అఖిల పక్షం ప్రత్యేకంగా కోరారు. అయిజ పట్టణంలో కొన్ని విద్యాలయాలు గురుకుల విద్యాలయానికి అనుకూలంగా ఉన్నాయని అఖిలపక్షం దృష్టికి వచ్చినదని, ప్రస్తుతం ఐజలో ఉన్న శ్రీ శివ సాయి డిగ్రీ కాలేజి అందుకు అనుకూలంగా ఉన్నదని భావిస్తున్నామని తెలిపారు. కావున ఎర్రవల్లి చౌరస్తాలో ఉన్నటువంటి గురుకుల విద్యాలయాన్ని ఇక్కడికి మార్చాల్సిందిగా కోరారు. గతంలో ఈ విద్యాలయాన్ని ఐజకు మార్చాలని చాలా ప్రయత్నాలు కొనసాగాయి కానీ ఇక్కడ భవనాలు లేకపోవడం వల్ల ఆ విద్యాలయాన్ని అక్కడే కొనసాగించాల్సిన అవసరం వచ్చింది. కనుక అధికారులు దీనిపై దృష్టి ఉంచి అయిజ గురుకుల విద్యాలయాన్ని అయిజకు తరలించాలని అఖిలపక్షం నాయకులు కోరారు.

# జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే లక్ష్యం!

– టీయూడబ్ల్యూజే (ఐజేయు) జాతీయ నాయకులు దాసరి కృష్ణారెడ్డి
– వరంగల్ ప్రెస్ క్లబ్ లో లాంఛనంగా ఐజేయూ సభ్యత్వం ప్రారంభం
– మండలాల వారిగా సభ్యత్వ నమోదుకు స్పెషల్ డ్రైవ్



హనుమకొండ, మార్చి 26(వుదయం జిల్లా ప్రతినిధి) : జర్నలిస్టుల సమస్యల సాధన కోసం టియుడబ్ల్యూజే (ఐజేయు) పక్షాన పోరాటం కొనసాగిస్తామని ఐజేయు సీనియర్ జాతీయ నాయకులు దాసరి కృష్ణారెడ్డి అన్నారు. బుధవారం గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ లో టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు గడ్డం రాజిరెడ్డి అధ్యక్షతన జిల్లా యూనియన్ నూతన సభ్యత్వాల నమోదు కార్యక్రమం లాంచనంగా ప్రారంభించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన దానరి కృష్ణారెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమానికి ముందుండి పోరాటం సాగిస్తున్న సంఘం టియుడబ్ల్యూజే మాత్రమే నని అన్నారు. ఆరు దశాబ్దాల యూనియన్ చరిత్రలో అక్రిడిటేషన్ లు, హెల్త్ కార్డులు, ఇండ్ల స్థలాలు సాధించి పెట్టడం జరిగిందన్నారు. రానున్న రోజుల్లో వరంగల్ నగరంతో సహా మండల కేంద్రాలలో జర్నలిస్టులందరికీ ఇండ్ల స్థలాలు,ఇండ్లు సాధించేందుకు పోరాడుతామన్నారు. రాష్ట్రంలో వివిధ కారణాలతో మృతి చెందిన జర్నలిస్టుల కుటుంబాలను ఆదుకునేందుకు కృషి చేయడం జరుగుతుందని చెప్పారు. భవిష్యత్తులో కూడా జర్నలిస్టుల సంక్షేమానికి పెద్ద పీట వేస్తూ సమస్యల సాధనకై జర్నలిస్టులకు అండగా టీయూడబ్ల్యూజే నిలుస్తుందని, అర్హులైన జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు, హెల్త్ కార్డుల జారి, ఇతర సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకుపోయి అమలుపరిచేలా చర్యలు తీసుకుంటామన్నారు. టీయూడబ్ల్యూజే ( ఐజేయు) యూనియన్ కు మరే యూనియన్ సాటి రాదని గుర్తుచేసిన ఆయన దశాబ్దాల చరిత్ర ఉన్న యూనియన్ పై జర్నలిస్టులకు ఎంతో విశ్వాసం ఉందని వారి విశ్వాసానికి అనుగుణంగా జర్నలిస్ట బాధ్యులుగా పనిచేస్తామన్నారు.

ఈ సందర్భంగా త్వరితగతిన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హౌసింగ్, వెల్ఫేర్ కన్వీనర్ వల్లాల వెంకటరమణ, టీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షులు గాడిపల్లి మధు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కంకనాల సంతోష్,పెండెం వేణు మాధవరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి తోట సుధాకర్,జిల్లా కోశాధికారి బచ్చు పురుషోత్తం, గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు వేముల నాగరాజు, బొల్లారపు సదయ్య, జాతీయ కౌన్సిల్ సభ్యులు వల్లాల బుచ్చి రెడ్డి, జిల్లా నాయకులు డాక్టర్ పొడిశెట్టి విష్ణు వర్దన్, వరప్రసాద్, ఎంఏ. నయీం, గన్ను సంతోష్, పులికంటి రాజేందర్, ముదిగిరి ఓదెలు, అల్లె రామారావు, ఖాదర్ పాషా, ఎం. రాజేంద్ర ప్రసాద్, రాంమోహన్, బి. శ్రీహరి రాజు, కిరణ్ రెడ్డి, దామోదర్, ఎండి ఉస్మాన్ పాషా, తాండూరి గోపి తదితరులు పాల్గొన్నారు.

# పరీక్షలు ముగిసే వరకు అప్రమత్తంగా ఉండాలి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ





జయశంకర్ భూపాలపల్లి మార్చి 26(వుదయం ప్రతినిధి) పరీక్షలు ముగిసే వరకు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు.బుధవారం గణపురం మండలం చెల్పూర్ జడ్పిఎస్ఎస్, అలాగే మండల కేంద్రంలోని మోడల్ పాఠశాలలో జరుగుతున్న పదవ తరగతి రీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో భాగంగా కలెక్టర్ అన్ని గదులను పరిశీలించారు. విద్యుత్, తాగునీరు, వైద్య తదితర మౌలిక వసతులను క్షుణ్ణంగా పరిశీలించారు. పరీక్షల నిర్వహణ పైన చీఫ్ సూపరింటెడెంట్లకు పలు సూచనలు చేశారు. పరీక్షలకు ఎంతమంది విద్యార్థులు హాజరయ్యారనే వివరాలు, పరీక్షా కేంద్రాలోని ఏర్పాట్లును కలెక్టర్ పరిశీలించారు. పరీక్షల నిర్వహణ పకడ్బందీగా ఉండాలని కలెక్టర్ పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణకు సంబంధించిన రికార్డులను, ప్రశ్న పత్రాలు, పరీక్షల అనంతరం జవాబు పత్రాల తరలింపుకు సంబంధించిన వివరాలను అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ నెల 21వ తేదీ నుండి ప్రారంభమైన 10వ తరగతి పరీక్షలు ఏప్రిల్ 4వ తేదీ వరకు జరుగనున్నాయని తెలిపారు. ఇప్పటి వరకు జరిగిన అన్ని పరీక్షలు చాలా ప్రశాంతంగా జరిగాయని, తదుపరి జరుగనున్న పరీక్షలు కూడా ఇదే స్ఫూర్తితో పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. పరీక్షలు జరుగుతున్న తీరు పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులు, విధులు నిర్వహిస్తున్న సిబ్బంది సెల్ ఫోన్స్, వాచీలు, ఎలక్ట్రానిక్. పరికరాలు పరీక్ష కేంద్రాల్లోకి తీసుకురాకుండా నిశితంగా పరిశీలించాలని అన్నారు. మాస్ కాపీయింగ్ కు ఆస్కారం లేకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని, కాపీయింగ్ కు పాల్పడితే మాల్ ప్రాక్టీస్ కేసులు బుక్ చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పరీక్షలు ముగిసేంత వరకు కూడా ఎంతో అప్రమత్తతతో పకడ్బందీగా విధులు నిర్వర్తించాలని సూచించారు. ప్రశ్నపత్రాలను తప్పనిసరిగా తగిన పటిష్ట పోలీసు బందోబస్తు మధ్య క్లోస్డ్ వాహనంలో తరలించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సత్యనారాయణ స్వామి, చీఫ్ సూపరింటెండెట్స్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి విద్యార్థికి పోషకాహార,నాణ్యమైన భోజనం అందించాలి

**ఖమ్మం జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి, మండల ప్రత్యేక అధికారి ఏ. శ్రీనివాస్**



మధిర మార్చి 26 (వుదయం ప్రతినిది) మధిరమండల పరిధిలోని ఎం. పి. యు .పి. ఎస్ రాయపట్నం పాఠశాలను ఖమ్మం జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి మరియు మండల ప్రత్యేక అధికారి అయిన ఏ శ్రీనివాస్, స్థానిక ఎం పి డి ఓ బి. వెంకటేశ్వర్లుతో కలిసి అకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం వండుతున్నారో లేదో చూశారు. బియ్యం,వంట పాత్రల గదులను పరిశీలించినారు. విద్యార్థులు ప్లేట్లను ఏ వాటర్ తో కడుగుతున్నారు, డ్రింకింగ్ వాటర్ ఏవి తాగుతున్నారు, భోజనం చేసే ముందు చేతులు ప్లేట్లు కడుగుతున్నారో లేదో పరిశీలించినారు. బాలికల, బాలుర టాయిలెట్స్ ను గమనించారు. పాఠశాలలో భోజనం ఉండే గది, బియ్యం వంట పాత్రల గది, విద్యార్థులు భోజనం చేసే ప్రదేశం పరిశుభ్రంగా ఉన్నాయన్నారు. టాయిలెట్స్ ను ప్రతిరోజు శుభ్రం చేస్తున్నారా అని హెచ్ఎం డేవిడ్ రాజుని అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు టాయిలెట్స్ ని శుభ్రం చేయాలని తెలిపారు. మధ్యాహ్న భోజనము ఉండే రమాదేవిని కూరకి ఏ నూనె వాడుతున్నారు, కూరలో వాడే పదార్థాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారానికి ఎన్ని గుడ్లు పెడుతున్నారని అడిగారు. విద్యార్థులతో మరియు ఎం పి డి ఓ హెచ్ఎంతో కలిసి భోజనం చేసినారు. భోజనం చేసిన తర్వాత భోజనం, కూర చాలా రుచిగా బాగున్నాయని వంట ఉండే రమాదేవిని అభినందించారు. పాఠశాల పరిశుభ్రంగా ఉన్నదని టాయిలెట్స్ పరిశుభ్రంగా ఉన్నాయని స్వీపర్ కృష్ణ కుమారిని,సుబ్బారావుని అభినందించారు. పాఠశాల హెచ్ఎం డేవిడ్రాజుతో ప్రతిరోజు మెనూ ప్రకారమే ప్రభుత్వం చెప్పిన విధంగా విద్యార్థులకు నాణ్యమైన పోషకాహారాన్ని అందించాలని, పాఠశాల పరిశుభ్రంగా ఉండాలని, టాయిలెట్స్ ను ప్రతిరోజు బ్లీచింగ్, ఫినాయిల్, వాటర్ తో శుభ్రం చేయాలని, పిల్లలకి డ్రింకింగ్ వాటర్ ను గ్రామ పెద్దల సహాయంతో మినరల్ ప్లాంట్ వచ్చే విద్యా సంవత్సరం నాటికి ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు అజయ్ కుమార్, విజయ మేడం, జనార్దన్ రెడ్డి, విశ్వనాథం ఉన్నారు.

# తెలంగాణ ఓపెన్ స్కూల్ పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు

## జిల్లా కలెక్టర్ శిక్త పట్నాయక్



నారాయణపేట టౌన్ మార్చ్ 26(వుదయం ప్రతినిధి) జిల్లా కేంద్రంలో జరగబోయే సార్వత్రిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు బుధవారం కలెక్టర్ సిక్తా పట్నాయక్ కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి తగు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏప్రిల్ 20వ తేదీ నుండి 26వ తేదీ వరకు జరిగే తెలంగాణ ఓపెన్ స్కూల్ పరీక్షలకు నారాయణపేట జిల్లా కేంద్రంలో ఎనిమిది సెంటర్లను ఏర్పాటు చేయడం జరిగిందని ఎస్ ఎస్ సి కి సంబంధించి మూడు సెంటర్లలో 600 మంది విద్యార్థులు, ఇంటర్మీడియట్ ఐదు సెంటర్లలో 990 విద్యార్థులు పరీక్షలు రాయబోతున్నారని తెలిపారు. ఆయా పరీక్షల పూర్తి ఏర్పాట్లను జిల్లా విద్యాశాఖ అధికారి పర్యవేక్షించాలని ఆమె ఆదేశించారు. అధికారులు అందరూ పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ మాట్లాడుతూ పరీక్షలలో సెంటర్ల దగ్గర పూర్తి స్థాయి బందోబస్తు నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమములో లైన్ డిపార్ట్మెంట్ జిల్లా అధికారులు, డి ఎస్ పి నల్లపు లింగయ్య ,జిల్లా విద్యాశాఖ టాస్ కోఆర్డినేటర్ శ్రీనివాస్ , డి ఏం హెచ్ ఓ సౌభాగ్య లక్ష్మి, డి ఐ ఒ సుదర్శన్ రావు, పోస్ట్ ఆఫీస్ సూపర్ఇండెంట్ , డి పి ఓ అధికారి కృష్ణయ్య పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల కోసం అమరులైన కమ్యూనిస్టులు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటారు.

**సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బెదవాడ రవిబాబు-మందడపు రాణి**



మధిర మార్చి 26 (వుదయం ప్రతినిధి) నిరంతరం ప్రజల మధ్య ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం అజరామరమైన పోరాటాలు సాగించి అమరులైన కమ్యూనిస్టులు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా ఉంటారని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బెజవాడ రవిబాబు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు మందడపు రాణి, సిపిఐ జిల్లా నాయకులు %హీూ% రహీం, అన్నారు. మంగళవారం మండల పరిధి మల్లవరం గ్రామంలో అమరజీవి కామ్రేడ్ మచ్చ హనుమంతరావు 27 వ వర్ధంతి వేడుకలు సిపిఐ మల్లారం గ్రామ శాఖ ఆధ్వర్యంలో మచ్చ హనుమంతరావు స్మారక స్థూపం వద్ద ఘనంగా నిర్వహించారు. ముందుగా మచ్చా హనుమంతరావు చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బెజవాడ రవి బాబు, మందడపు రాణి సిపిఐ జిల్లా నాయకులు రహీం, మాట్లాడుతూ,అమరజీవి కామ్రేడ్ మచ్చా హనుమంతరావు ఈ ప్రాంత ప్రజా సమస్యలపై పోరాడుతూనే పార్టీ ప్రజా సంఘాల బలోపేతం కోసం అనునిత్యం పరితపించేవాడన్నారు. మచ్చ హనుమంతరావు మల్లారం గ్రామ సర్పంచ్ గా గ్రామానికి అనేక సేవలు అందించాలని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మదుపల్లి సిపిఐ మండల సహాయ కార్యదర్శి చావా మురళీకృష్ణ, లక్ష్మణ్, మచ్చ వెంకటేశ్వరరావు,

పద్మ, హనుమంతరావు తల్లి సూరమ్మ, సోదరుడు మచ్చ వెంకట రామారావు, మల్లారం కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు కొంగర వెంకటేశ్వరరావు, కొంగర పుల్లయ్య, మల్లారం సిపిఐ గ్రామ శాఖ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వికాస తరంగిణి ఆధ్వర్యంలో పరకాల్లో పశువైద్య శిబిరం...



పరకాల మార్చి 26 (వుదయం పరకాల):పరకాల పట్టణంలో పశువుల ఆసుపత్రి నందు వికాస తరంగణి హన్మకొండ జిల్లా ఆధ్వర్యంలో పశు వైద్య శిబిరం నిర్వహించబడింది. ఈ సందర్భంగా శ్రీ త్రిదండి చిన్న జీయర్ స్వామి ఆశీస్సులతో గోపూజ నిర్వహించి ప్రారంభించబడినది.

ఈ కార్యక్రమంలో వికాస తరంగణి ఉపాధ్యక్షులు రిటైర్డ్ పశుసంవర్తన శాఖ జాయింట్ డైరెక్టర్ చాడ సుభాష్ రెడ్డి మాట్లాడుతూ వికాస తరంగిణి ఆధ్వర్యంలో పశుసంవర్ధక శాఖ అధికారుల సహకారంతో ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఉచిత వైద్య శిబిరం నిర్వహించి మందులు అందిస్తామని వీటిని రైతులు చక్కగా వినియోగించుకోవాలని తెలిపారు. ఈ పశువుల శుభ్రంగా 60 పశువులకు వైద్యం అందించబడినది.

ఈ కార్యక్రమంలో డాక్టర్ కే. విజయ భాస్కర్, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి హనుమకొండ జిల్లా, డాక్టర్ పి శ్రీనివాస్ సహాయ సంచాలకులు, సిహెచ్ వెంకటేష్ కమిషనర్, డాక్టర్ బి వినయ్, డాక్టర్ శ్రీరామ్ పశు వైద్యాధికారులు, పెద్ది ఆంజనేయులు ఎంపీడీవో, రవీందర్ నాథ్, కల్పన, రాంబాయి లాల్ సింగ్, రమేష్, కుమార్ పశు వైద్య సిబ్బంది,కుమారస్వామి, కిషోర్, కోటి, రవి పశువుల మందుల షాపుల యజమాన్యం సభ్యులు, వికాస తరంగిణి సభ్యులు దయాకర్ రెడ్డి, రామచంద్ర రెడ్డి, పాల్గొన్నారు.

# మినార్ ల ధ్వంసం ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టండి



జయశంకర్ భూపాలపల్లి మార్చి 26(వుదయం ప్రతినిధి) మహాదేవపూర్ మండల కేంద్రంలోని ఖబరస్తాన్ మినార్ ల ధ్వంసం ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టండి అని మహాదేవపూర్ ఎస్సై పవన్ కుమార్ కు వినతి పత్రం అందించినట్లు తెలంగాణ ముస్లిం హక్కుల పోరాట సమితి మండల అధ్యక్షుడు ముజాహిద్ ఖాన్ జిల్లా ఉపాధ్యక్షుడు అమీన్ లు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు ఆదివారం రాత్రి మహాదేవపూర్ ముస్లిం సామాజిక వర్గానికి చెందిన ఖబరస్తాన్ మినార్లను దుండగులు ధ్వంసం చేసిన విషయంపై పోలీసులు చాకచక్యంగా దర్యాప్తు చేపట్టి కొన్ని గంటల వ్యవధిలోనే మినార్ల ధ్వంషానికి పాల్పడ్డ ఇద్దరు నిందితులను అరెస్టు చేశారని పోలీస్ శాఖకు అభినందిస్తున్నామని తెలిపారు మహాదేవపూర్ మండలంలో ఇలాంటి సంఘటనలు ఏనాడూ చోటు చేసుకోలేదని అన్ని మతాలవారు సోదర భావంతో కలిసిమెలిసి ఉంటారని వెల్లడించారు ఇలాంటి సంఘటనలు ఈ ప్రాంతంలో పునరావృతం కాకుండా కబ్రాస్తాన్ మినార్ల ధ్వంసంఘటనపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి ఇంకా ఎవరైనా నిందితులు ఉంటే చర్యలు చేపట్టాలని తెలంగాణ ముస్లిం హక్కుల పోరాట సమితి జిల్లా మండల శాఖ ఆధ్వర్యంలో మహాదేవపూర్ ఎస్సై కి వినతిపత్రంలో కోరినట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో ముస్లిం హక్కుల పోరాట సమితి మండల కోశాధికారి ఖమర్, నాయకులు సలావుద్దీన్, అమద్,మోఖిత్,తోపాటు పలువురు ఉన్నారు.

# మధ్యాహ్న భోజనంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

**రాష్ట్ర ఆహారభద్రత కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి**



కల్వకుర్తి మార్చి 26 (వు దయం ప్రతినిధి ) మూగ రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి గారు సరూర్ నగర్ లోని విక్టోరియా మెమోరియల్ హోమ్ రెసిడెంటీయల్ స్కూల్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారుప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం,విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన,శుభ్రమైన ఆహారం అందించేలా పర్యవేక్షణ చేయాలని సూపరింటెండెంట్ లక్ష్మీపార్వతి కి సూచించారురాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి ,పాఠశాల పర్యటించి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. నాణ్యమైన భోజనం అందించాలని నాణ్యత లేని సరుకులు ఉంటే తిరిగి పంపించాలని సూచించారు. మధ్యాన్నా భోజన అమలులో లోపాలు ఉన్న సంబంధించి ఎటువంటి ఫిర్యాదులు చేయాలన్న జిల్లా %ఐ=ఐూ% కు, ఫుడ్ కమిషన్ కు ఫిర్యాదు చేయవచ్చు అని తెలియచేప్పారుకార్యక్రమంలో సూపరింటెండెంట్ లక్ష్మీపార్వతి గారు,మెస్ ఇంచార్జ్ స్వరూప,శ్రీనివాస్ రెడ్డి, ప్రవీణ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు

## అర్ధరాత్రి దొంగల హల్‌చల్

జనగామ, మార్చి26(వుదయం ప్రతినిధి): జనగామ జిల్లా జాఫర్ ఘడ్ మండలం తమ్ముడపల్లి (ఐ)లో అర్ధరాత్రి దొంగలు హల్ చల్ చేశారు. బాధితురాలు బుల్లె పారిజాతం ఇంట్లో బీరువా తాళం పగులగొట్టి దుండగులు సుమారు 9 తులాల బంగారం, 80 తులాల వెండి, 50 వేల నగదు అపహరించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు విచారణ చేస్తున్నారు.

## ప్రజలు మున్సిపల్ సిబ్బందికి సహకరించాలి

మంథని, మార్చి26(వుదయం ప్రతినిధి): పెద్దపల్లి పట్టణ ప్రజలు మున్సిపల్ సిబ్బందికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్ కోరారు. బుధవారం పెద్దపల్లి పట్టణంలోని వార్డులలో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ లో భాగంగా కమిషనర్ పర్యటించారు. పట్టణ ప్రజలు మున్సిపల్ సిబ్బందికి సహకరించి చెత్త రిక్షాలకు చెత్తను, ప్లాస్టిక్ కవర్లను, సీసాలను వేరుచేసి అందజేయాలన్నారు. అమర్ నగర్ నుండి చేపట్టిన పైప్ లైన్ లీకేజీ పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.

## రోడ్డు పనులు ప్రారంభించిన నేతలు

దేవరకద్ర, మార్చి26(వుదయం ప్రతినిధి): కోయిలకొండ మండలం దామాయపల్లి గ్రామంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విద్యాసాగర్ గౌడ్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే చిట్టెం పర్ణిక రెడ్డి మండలంలో అభివృద్ధి పనులకు 15 కోట్ల రూపాయలు మంజూరు చేశారని చెప్పారు. గ్రామాల అభివృద్ధి కేవలం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు..

## నాగార్జునసాగర్ ప్రాజెక్టు సమాచారం

నాగార్జునసాగర్, మార్చి26(వుదయం ప్రతినిధి): నాగార్జునసాగర్ ప్రాజెక్టు సమాచారాన్ని అధికారులు బుధవారం వెల్లడించారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా, ప్రస్తుతం 521. 10 అడుగులుగా ఉంది. కుడి కాల్వకు 6041 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 7190 క్యూసెక్కులు, ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టుకు 1800 క్యూసెక్కుల నీటిని విడుదల చేశామని అధికారులు పేర్కొన్నారు. ఇన్ ఫ్లో 23859, అవుట్ ఫ్లో 15331 క్యూసెక్కులు ఉందన్నారు.

# ఘనంగా శ్రీమతి కొండా సుస్మితా పటేల్ ( చిట్టక్క) జన్మదిన వేడుకలు...



పరకాల మార్చి 26 (వుదయం ప్రతినిధి: పరకాల నియోజకవర్గం సంగెం మండలం మరియు 17వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు కడిదేల కట్టస్వామి యాదవ్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వరంగల్ జిల్లా మాందాడి లక్ష్మారెడ్డి వరంగల్ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి) శేవ్వా మొగిలి యాదవ్ ( కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు) కడిదెల రామారావు యాదవ్ 17 డివిజన్ కాంటెస్ట్ కార్పొరేటర్ కడారి శ్రీనివాస్ యాదవ్ఏఐసీసీ ఎన్రోలర్ సభ్యుడు ఆధ్వర్యంలో శ్రీమతి శ్రీ కొండా సుష్మిత పటేల్ (చిట్టక్క) జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ అభిమానులు కొండా దంపతుల అభిమానుల సమక్షంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. సంగెం మండల కేంద్రంలో అంబేద్కర్ సెంటర్లో భారీ బాణా సంచాలు కాల్చి పండ్లు స్వీట్లు పంచి సంబరాలు జరుపుకోవడం జరిగింది. ఈ కార్యక్రమానికి మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య నాయకులు మాట్లాడుతూ కొండా దంపతుల గారాల పట్టి శ్రీమతి సుస్మిత పటేల్ ( చిట్టక్క) రాబోవు రోజుల్లో కాబోయే నాయకురాలు తల్లితండ్రుల అడుగుజాడల్లో నడుస్తూ తండ్రి వారసత్వ పౌరుషంతో తల్లి ఆదర్శంతో ముందు తరాలకు నాయకత్వం అందించాలని రాజకీయాల్లో మంచి పదవులు పొందాలని ఆ కోటగండి సాయినాధుని ఆశీస్సులు మీ కుటుంబానికి ఎల్లవేళలా ఉండాలని భగవంతుని వేడుకోవడం జరిగింది.

ఈ కార్యక్రమంలో గుండేటి ఎల్లయ్య (కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు) మెట్టుపల్లి ఏలియా( వరంగల్ జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు) అప్పల కవిత (మహిళా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలు) ఉప్పలయ్య మాజీ సర్పంచ్ బొజ్జ మధు కాగితాల ఓంకార్ చందూలాల్ జన్ను కుమారస్వామి రమేష్ రాజ్ కుమార్ సిహెచ్ కుమారస్వామి ఆకుల నరేందర్ 17 డివిజన్ ఎస్సీ సెల్ నాయకులు రాజకుమార్ మరియు కార్యకర్తలు పాల్గొన్నారు..

## మైనారిటీ గురుకులంలో వసతులను తనిఖీ చేసిన అదనపు కలెక్టర్



హనుమకొండ, మార్చి 26(వుదయం జిల్లా ప్రతినిధి) : కాజీపేట మండలం కడిపికొండ పరిధిలో ఉన్న తెలంగాణ మైనారిటీ బాలుర గురుకుల పాఠశాలలోని వసతులను హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎ.వెంకట్ రెడ్డి బుధవారం తనిఖీ చేశారు. గురుకుల పాఠశాలలో విద్యార్థుల కోసం వండిన భోజన పదార్థాలను అదనపు కలెక్టర్ తనిఖీ చేశారు. అదేవిధంగా స్టోర్ రూమ్ లో భద్రపరిచిన బియ్యం సంచులు, వంట నూనెలు, ఆహార పదార్థాలను పరిశీలించారు. గురుకుల పాఠశాలలో మెనూ ప్రకారం భోజనం , ఇతర ఆహార పదార్థాలను విద్యార్థులకు అందిస్తున్నారా అని అదనపు కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. నాణ్యమైన భోజనం, వసతి సదుపాయాలు ఉండాలని అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి సంబంధిత శాఖ అధికారులు, పాఠశాల ప్రిన్సిపల్ ఉపాధ్యాయులకు సూచించారు.

## ఘనంగా శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి కళ్యాణ మహోత్సవం...



కుత్బుల్లాపూర్, మార్చి 26,(వుదయం ప్రతినిధి ),కాంగ్రెస్ సీనియర్ నాయకులు కోలన్ శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అనుచరుడు మన్నే మహేష్ యాదవ్ శ్రీవీణ దంపతుల స్వగృహంలో శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అమ్మవారి కళ్యాణ మహోత్సవంలో నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ కార్పొరేటర్ కోలన్ తేజ శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కోలన్ శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని కళ్యాణం వీక్షించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో భక్తులు, మహేష్ యాదవ్ కుటుంబ సభ్యులు, బంధువులు, కెసిఆర్ అభిమానులు, సన్నిహితులు, అనుచరులు, కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రగతినగర్ మెయిన్ రోడ్డులో బస్సు షెల్టర్లు ఏర్పాటు చేయాలి...

### : సిపిఎం మేడ్చల్ జిల్లా కమిటీ సభ్యులు



కుత్బుల్లాపూర్, మార్చి 26,(వుదయం ప్రతినిధి ),నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రగతి నగర్ మెయిన్ రోడ్డు పలు చౌరస్తాలలో బస్సు షెల్టర్లు ఏర్పాటు చేయాలని కోరుతూ ఎన్ ఎం సి కమీషనర్ కు సిపిఎం బాచుపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రగతినగర్ కు బస్సుల సంఖ్య, ట్రిప్పుల సంఖ్య, బస్సు ప్రయాణికుల సంఖ్య పెరగడం జరిగినది కానీ బస్సు ప్రయాణికులకు బస్ షెల్లర్లు లేక ప్రయాణికులు చాలా ఇబ్బందులకు గురి అవుతున్నారని అలీప్ చౌరస్తా, కాకతీయ హిల్స్ చౌరస్తా, ఎలిఫెంట్ చౌరస్తా,
మూడు కోతుల బొమ్మల చౌరస్తాలో బస్సు షెల్టర్లును వెంటనే ఏర్పాటు చేయాలని సిపిఎం నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మేడ్చల్ జిల్లా కమిటీ సభ్యులు ఆర్ సంతోష్, బి. వెంకటరామయ్యా బాచుపల్లి మండల నాయకులు బాల వెంకటేశ్వర, ఎన్ బాలపీరు తదితరులు పాల్గొన్నారు.

## పీ సీ ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బియ్యం అందజేత



జన్నారం,మార్చ్ 26(వుదయం విలేకరి) జన్నారం మండల కేంద్రం లోని జువ్విగూడ లో ఈ నెల 27న బంజారీల అరధ్య దైవం సేవాలాల్ మహారాజ్ విగ్రహ ప్రతిష్టపన పురస్కరించుకొని పీ సీ ఆర్ (పూర్ణ చందర్ ) పౌండేషన్ ఆధ్వర్యంలో రెండు బియ్యం బస్తాలను సేవాలాల్ కమిటీ సభ్యుల కు అందజేశారు. ఈ కార్యక్రమం లో పీ సీ ఆర్ పౌండేషన్ వ్యవస్థపకులు ముడుగు ప్రవీణ్ కుమార్, మాజీ జడ్పీటీసీ ఎర్ర చంద్ర శేఖర్, మాజీ కో ఆప్షన్ సభ్యులు మున్వర్ ఆలీ ఖాన్, పౌండేషన్ సభ్యులు మాజీ ఎం పీ టీ సీ రాగుల శంకర్,బినవేణి గంగన్న యాదవ్,ముద్రకొల రవి తదితరులు పాల్గొన్నారు.

# రిటైర్మెంట్ తర్వాత స్థిరమైన ఆదాయం లక్ష్యంగా 'పెన్షన్ ప్లాన్' ఉండాలి

### - పాలసీబజార్ ఇన్వెస్ట్మెంట్ ప్రొడక్ట్ హెడ్ సమీప్ సింగ్

హైదరాబాద్, మార్చి 26, 2025: రిటైర్మెంట్ తర్వాత స్థిరమైన ఆదాయం లక్ష్యంగా 'పెన్షన్ ప్లాన్' ఉండాలని పాలసీ బజార్ ఇన్వెస్ట్మెంట్ ప్రొడక్ట్ హెడ్ సమీప్ సింగ్ తెలిపారు. రిటైర్మెంట్ ప్రణాళికకు ఒక నిర్మాణాత్మక విధానాన్ని అందించాలన్నారు. ఇది వ్యక్తులు కాలక్రమేణా గణనీయమైన మూలధనాన్ని నిర్మించుకోవడానికి వీలు కల్పిస్తుందని పేర్కొన్నారు. మార్కెట్‌కు అనుసంధానమైన పెన్షన్ ప్లాన్లలో 15 శాతం సంవత్సరిక వృద్ధి రేటుతో పెట్టుబడి పెడితే 20 సంవత్సరాల్లో సుమారు రూ. 5.32 కోట్లు సమీకరించుకోవచ్చని తెలిపారు. ఈ ప్లాన్ల ప్రధాన ప్రయోజనం ఏమిటంటే, మొత్తానికి సంబంధం లేకుండా 60 శాతం నిధులను పన్ను మినహాయింపుతో ఉపసంహరించుకోవచ్చని పేర్కొన్నారు. మిగతా మొత్తాన్ని తప్పనిసరిగా అన్యూటీగా పెట్టుబడి పెట్టాలన్నారు. తద్వారా రిటైర్మెంట్ తర్వాత స్థిరమైన ఆదాయం పొందవచ్చన్నారు. మార్కెట్‌కు అనుసంధానమైన పెన్షన్ ప్లాన్లు ఆర్థిక భవిష్యత్తు నిర్మించడానికి సమర్థవంతమైన మార్గాన్ని అందిస్తాయన్నారు. క్రమంగా పెట్టుబడి పెడితే కంపౌండింగ్ ప్రయోజనాన్ని అందిపుచ్చుకొని గొప్ప సంపదను సృష్టించుకోవచ్చని తెలిపారు. పెన్షన్ ప్లాన్‌లో నిర్దిష్ట కాలం పాటు నిధులు పెట్టాలన్నారు. ఈ పెట్టుబడులు ఈక్విటీ ఆధారిత పెట్టుబడుల ద్వారా వృద్ధి చెంది, కంపౌండింగ్ ప్రయోజనం పొందుతాయన్నారు. గడువు ముగిసిన తర్వాత పెట్టుబడిదారుడు నిధిలో ఒక భాగాన్ని పన్ను మినహాయింపుతో ఉపసంహరించుకోవచ్చని తెలిపారు. మిగతా మొత్తం అన్యూటీగా మార్చడం తప్పనిసరి అన్నారు. పాలసీబజార్ లెక్కల ప్రకారం 15 శాతం చక్రవడ్డీ వార్షిక వృద్ధి రేటు (సీఏజీఆర్) ఉంటే.. రూ.10,000 నెలసరి పెట్టుబడి 20 సంవత్సరాల్లో రూ.1.06 కోట్లు వరకు పెరుగుతుందని తెలిపారు. ఇందులో రూ.63.6 లక్షలు పన్ను మినహాయింపుతో ఉపసంహరించుకోవచ్చని పేర్కొన్నారు. రూ.50,000 నెలసరి పెట్టుబడి రూ.5.32 కోట్లు వరకు పెరిగి రూ.3.19 కోట్లు పన్ను మినహాయింపుతో ఉపసంహరించుకోవచ్చని తెలిపారు. ప్రారంభం నుంచే స్థిరంగా పెట్టుబడి పెట్టడం ఎంతో ముఖ్యమన్నారు. పెట్టుబడిదారులు 60 శాతం మొత్తం పన్ను రహితంగా ఉపసంహరించుకోగలరని తెలిపారు. మిగిలిన 40 శాతం అన్యూయిటీలో పెట్టుబడి పెట్టడం ద్వారా రిటైర్మెంట్ తర్వాత జీవితాంతం స్థిరమైన ఆదాయం పొందవచ్చన్నారు. పెన్షన్ ప్లాన్ల రాబడులు మార్కెట్ పని తీరుపై ఆధారపడి ఉంటాయన్నారు. అందువల్ల అవి అనిశ్చితంగా ఉంటాయని తెలిపారు. 15 శాతం సీఏజీఆర్ కేవలం అంచనా మాత్రమేనని, కానీ నిజమైన రాబడులు తక్కువగా ఉండే అవకాశం ఉందని పేర్కొన్నారు. నిధులు పాలసీ కాలపరిమితి వరకు లాక్ అయి ఉంటాయన్నారు. అందువల్ల అత్యవసర పరిస్థితుల్లో మూలధనాన్ని ఉపసంహరించుకోవడం కష్టం అన్నారు. 60 శాతం మొత్తం పన్ను మినహాయింపు కలిగినప్పటికి, మిగిలిన 40 శాతం అన్యూయిటీ ద్వారా వచ్చే ఆదాయంపై పెట్టుబడిదారుని ఆదాయపు పన్ను స్లాబ్‌కు అనుగుణంగా పన్ను వర్తిస్తుందన్నారు. పెన్షన్ ప్లాన్లు రిటైర్మెంట్ కోసం క్రమశిక్షణతో పొదుపు చేయడానికి మార్గాన్ని అందిస్తాయన్నారు. జీవన వ్యయాలు పెరుగుతున్న నేపథ్యంలో ఆర్థిక నిపుణులు కంపౌండింగ్ ప్రయోజనాన్ని పూర్తిగా పొందేందుకు ఎంత త్వరగా ప్రారంభిస్తే అంత మంచిదన్నారు.

# కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమం.

### బిజెపి దుర్మార్గపు పాలన నుండి భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందాం...

### పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొయ్యడ శ్రీనివాస్.

పరకాల మార్చి 26 (వుదయం ప్రతినిధి): ఏఐసీసీ, టీపీసీసీ రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన జై బాపు,జై భీం,జై సంవిధన్ అనే కార్యక్రమంని పరకాల శాసనసభ్యులు రేవురి ప్రకాష్ రెడ్డి ఆదేశానుసారం బుధవారం రోజున పరకాల ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో
పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొయ్యడ శ్రీనివాస్ మాట్లాడుతూ ఇటీవల సమాజంలో కొన్ని శక్తులు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరిస్తు, ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తున్నాయని అన్నారు. శాంతి అహింసలను బోధించిన మహాత్ముని స్ఫూర్తితో, అందరికీ సమాన హక్కులు కల్పించిన రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా భారత రాజ్యాంగాన్ని రక్షించుకోవాలని కేంద్ర మంత్రి అమిత్ షా అంబేద్కర్ ని కించపరిచే విధంగా పార్లమెంట్లో మాట్లాడడం బాధాకరం భారత రాజ్యాంగం ప్రమాదంలో ఉందని రాహుల్ గాంధీ భారతీయుడు యాత్రతో దేశాన్ని రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని వారు ముందు చూపుతో ప్రజలకు వివరించడం జరిగింది. పాదయాత్ర క్రమంలో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి ఆదేశాల మేరకు పరకాల పట్టణంలో వాడవాడల పాదయాత్రతో ప్రజల్లోకి పోయి భారత రాజ్యాంగాన్ని కాపాడాలని బిజెపి నిరంకుశ పాలన ఎండ కట్టడానికి వారి దుర్మార్గపు చర్యలను ప్రజలకు



వివరిస్తామని ఈ పాదయాత్ర ద్వారా ప్రజలకు బిజెపి నిరంకుశ పాలన వివరిస్తాము అని కొయ్యడ శ్రీనివాస్ అన్నారు. ఈ కార్యక్రమంలో పరకాల ఏఎంసి చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి,సమన్వయకమిటి సభ్యులు సోదా రామకృష్ణ ,చిన్నల గొనాద్,మాజీ ఎంపీపీ ఒంటెరు రామూర్తి, బుర్ర రాజమౌళి,ఎండీ రంజాన్ అలీ,పోరండ్ల వేణుగోపాల్,పసుల రమేష్,పోరండ్ల సంతోష్,మార్క రఘుపతి,మడికొండ శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఈర్ల చిన్ని,పబ్బ శ్రీనివాస్,దుబాసి వెంకటస్వామి,ఒంటెరు శ్రవణ్,నల్లెళ్ల అనిల్ , మంద బొమ్మ కంతి చంద్రమౌళి నాగరాజు దార్న వేణుగోపాల్, దుప్పటి సాంబశివుడు బండారి కృష్ణ,ఎల్దండి సురేష్,గద్దం శివ,ఆలేటి రాజు, కుమరమ్మ లలిత మరియు 22 వార్డులలో ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అమ్మ ఒడి పథకం క్రింద 2లక్షలతో పనులు ప్రారంభించని కాంట్రాక్టర్

- నిర్లక్ష్యం వహిస్తున్న కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలి.!
- చోద్యం చూస్తున్న అధికారులు
- దళిత కాలనీలో ఉన్న ప్రభుత్వ పాఠశాలపై కాంట్రాక్టర్ నిర్లక్ష్యం
- జిల్లా ఉన్నతాధికారులు పట్టించుకోవాలని వినతి
- పరకాల స్వేరో నాయకులు బొచ్చు చిన్ని కృష్ణ స్వేరో

పరకాల, మార్చి 26(వుదయం జిల్లా ప్రతినిధి) : పరకాల మున్సిపల్ రెండో వార్డ్ దళిత కాలనీలో ఉన్న ప్రభుత్వ పాఠశాలకు అమ్మ ఒడి పథకం కింద రెండు లక్షల రూపాయలు మంజూరు అయినప్పటికీ పనులు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్న ఎంపీడీవో, కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలని పరకాల స్వేరో నాయకులు బొచ్చు చిన్ని కృష్ణ స్వేరో కలెక్టర్, డిఇఓ లను కోరారు. ఈ సందర్భంగా బొచ్చు చిన్ని కృష్ణ స్వేరో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడం కోసం అమ్మ ఒడి పథకం కింద ప్రతి పాఠశాలకు రాష్ట్ర ప్రభుత్వం రెండు లక్షల నిధులు మంజూరు చేసింది పరకాల మున్సిపల్ పరిధిలో దళిత కాలనీలో ఉన్న ప్రభుత్వ పాఠశాలకు అమ్మ ఒడి పథకం కింద రెండు లక్షల రూపాయలు పరకాల ఎంపీడీవో, కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ పాఠశాలలో అభివృద్ధి పనులు చేయడం లేదు.వీరి పైన



విచారణ జరిపి చట్టరీత్యా చర్యలు తీసుకొని పాఠశాల అభివృద్ధి పనులు చేసి పేద విద్యార్థులకు చదువుకునే అవకాశాలు కల్పించాలని పరకాల దళిత కాలనీ ప్రజల పక్షాన కలెక్టర్, డీఈఓలకు మనవి చేస్తున్న అన్నారు.

## వడ దెబ్బ పై ప్రతి ఒక్కరూ అవగాహన కల్గి ఉండాలి

### ఓ ఆర్ యస్ పాకిట్లు ఉపయోగించండి: డాక్టర్ పృథ్వీరాజ్ నాయక్

మధిర మార్చి 26 (వుదయం ప్రతినిధి) మధిర మండలం పీహెచ్ సి దెందుకూ రు వైద్య లు డాక్టర్ పృథ్వి రాజ్ నాయక్ ఆధ్వర్యంలో లో ఈ రోజు పలు గ్రామ ల్లో పారా మెడికల్ సిబ్బంది వడ దెబ్బ పై ప్రజలు కూ వారి



పీహెచ్సి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వీ వెంకటేశ్వర్లు, హెల్త్ సూపర్ వైజర్ లంకా కొండయ్య బృందం ఖమ్మం పా %శ్రీ%డు హెల్త్ సబ్ సెంటర్ నందు ప్రజలకు సంపూర్ణము గా అవగాహన పరచి ఓఆర్ఎస్ ఫీల్డ్ డ్యూటీ లో ఆరోగ్య సిబ్బంది సన్ స్ట్రోక్ మీద ప్రజలు కూ గుంపు గా వున్నా కాడ వడ దెబ్బ పై సంపూర్ణ ము గా అవగాహన పరిచారు. పాకిట్స్ పంపిణి చేసి ప్యాకెట్ ఎలా కలిపి త్రాగాలో ప్రాక్టీకల్ తయారు చేసి చూపించినారు. ఈ కార్యక్రమం లో ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు

## ఆలయ వార్షికోత్సవ వేడుకలకు ఆహ్వానం...



కుత్బుల్లాపూర్, మార్చి 26,(వుదయం ప్రతినిధి ),నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ 17వ డివిజన్ మాజీ కార్పొరేటర్, ఆలయ ధర్మకర్త ఆగం రాజు ముదిరాజ్ మాజీ ఎమ్మెల్సీ, బాచుపల్లి గ్రామ పెద్దలు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ ను వారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలసి శ్రీ వెంకట శివ రామాలయం ప్రథమ వార్షికోత్సవ మహోత్సవం, శ్రీరామ నవమి వేడుకలకు ముఖ్య అతిథిగా రావాలని ఆహ్వానించారు.

## కష్టపడి చదవండి ఉన్నతి స్థానాలకు చేరుకోండి... ఎండిఓ వై ప్రభాకర్



మధిర,మార్చి26(వుదయం ప్రతినిధి) ప్రాథమికోన్నత పాఠశాల నాగవరప్పాడు నందు 7వ తరగతి విద్యార్థుల వీడ్కోలు వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు పురం. సంగారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్యఅతిథిగా హాజరైన మండల విద్యాశాఖ అధికారి వై ప్రభాకర్ మాట్లాడుతూ ఏడవ తరగతి స్థాయిలో ఫేర్వెల్ డే వేడుకలను ఇంత ఘనంగా నిర్వహించడం అభినందించదగిన విషయమని, విద్యార్థులు క్రమశిక్షణతో పట్టుదలతో విద్యనభ్యసించి ఉన్నతి స్థానాలకు చేరుకొని తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మాటూరు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శ్రీహరి మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తులో చెడు అలవాట్లకు బానిసలు కాకుండా తల్లిదండ్రులను గురువులను గౌరవిస్తూ చక్కగా చదువుకొని మంచి స్థాయిలో ఉండాలని ఆకాంక్షించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు పురం సంగారావు మాట్లాడుతూ ఏడు తరగతులు ఇదే పాఠశాలలో చదువుకొని బయటకు వెళ్తున్న విద్యార్థులు చదువు మానకుండా ఉన్నతి చదువులు చదువుకొని మన పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుల తోకా. కృష్ణయ్య, రవికుమార్ లింగయ్య ,విద్యార్థిని విద్యార్థులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## మరిగూడలో కళ్యాణ లక్ష్మీ చెక్కుల పంపిణీ

మునుగోడు, మార్చి26(వుదయం ప్రతినిధి): మర్రిగూడ మండల కేంద్రంలోని తాసిల్దార్ కార్యాలయంలో ఎమ్మార్వో బక్క శ్రీనివాస్ ఆధ్వర్యంలో కల్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు బుధవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు రాందాస్ శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు వినమనేని రవీందర్రావు, మాల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నక్క శ్రీను, మాల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ జమ్మల వెంకటేష్, మాజీ ఎంపీటీసీ బాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

## చిట్యాలలో ఘనంగా ధర్మబిక్షం వర్ధంతి

నకిరేకల్, మార్చి26(వుదయం ప్రతినిధి):చిట్యాల మున్సిపాలిటీ కేంద్రంలో మాజీ ఎంపీ బొమ్మగాని ధర్మభిక్షం గౌడ్ 14వ వర్ధంతిని చిట్యాల కల్లుగీత కార్మికుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గీతా కార్మికులు మాట్లాడుతూ ధర్మబిక్షం ఆశయాలను నెరవేర్చడానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గీతా కార్మికులు శంకర్, యాదగిరి, సత్తయ్య, బాలరాజు, పాపయ్య, షఫీ, అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

## చలివేంద్రం ప్రారంభించిన జీపీపీ బస్ డిపో మేనేజర్

సిద్దిపేట, మార్చి26(వుదయం ప్రతినిధి): సిద్దిపేట జిల్లా ప్రజ్ఞాపూర్ బస్ స్టాప్ వద్ద బుధవారం వాసవి క్లబ్ గజ్వేల్ ప్రజ్ఞాపూర్, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బస్ డిపో మేనేజర్ పవన్ ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ సేవకు ప్రతిరూపం ఆర్యవైశ్యులు అని, ప్రజల దాహార్తి తీర్చడంలో చలివేంద్రాలు ఉపయోగపడతాయని, ప్రజ్ఞాపూర్ బస్ డిపో వద్ద చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని వాసవి క్లబ్ సభ్యులు, ఆర్యవైశ్య సభ్యులకు అభినందనలు తెలిపారు.

## ఏపూరులో బడిబాట కార్యక్రమం

మిర్యాలగూడ,మార్చి26(వుదయం ప్రతినిధి): చిట్యాల మండలం ఏపూర్ గ్రామంలోని జడ్పిహెచ్ఎస్ పాఠశాల ఆధ్వర్యంలో బుధవారం బడిబాట కార్యక్రమాన్ని ఆ పాఠశాల ఉపాధ్యాయులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పాఠశాల ఉపాధ్యాయులంతా గ్రామంలోని బడిఈడు వయస్సు గల బాలబాలికలను వచ్చే విద్యా సంవత్సరం 2025-26 పాఠశాలలో చేర్పించుటకు గాను ఇల్లు ఇల్లు తిరిగి తల్లితండ్రులను కలిసి బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆ స్కూల్ హెచ్ఎం సబిహ, తదితరులు పాల్గొన్నారు..

## ధర్మ బిక్షం గౌడ్ కు ఘన నివాళులు

దేవరకొండ, మార్చి26(వుదయం ప్రతినిధి): తెలంగాణ సాయుధ, రైతాంగ పోరాట యోధులు బొమ్మగాని ధర్మబిక్షం గౌడ్ వర్ధంతిని బుధవారం చిట్యాలలో సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బొమ్మగాని ధర్మభిక్షం గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి ఎండి అక్బర్, గీత పనివార్ల సంఘం నాయకులు దేశగొని బాలరాజు, పట్టణ కార్యదర్శి ఎస్కే షరీఫ్, గుండా సత్తయ్య, కునూరు పాపయ్య, కునూరు శంకర్, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ గుంజేడు ముసలమ్మ ఆలయ హుండీ లెక్కింపు





కొత్తగూడ మార్చి 26 (వుదయం ప్రతినిధి ):శ్రీ గుంజేడు ముసలమ్మ హుండీ లెక్కింపు ను శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర సేవా ట్రస్ట్ సేవకులు మహబూబాబాద్ వారిచే ప్రారంభించారు. బుధవారం మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలంలోని గుంజేడు గ్రామంలోని ముసలమ్మ ఆలయంలో దేవాలయ శాఖ అధికారి శేషగిరి ఆధ్వర్యంలో హుండీ లెక్కించారు. ఈ సందర్భంగా ఈవో శేషగిరి మాట్లాడుతూ భక్తులు అమ్మవారికి సమర్పించిన కానుకలు లెక్కించగా 2025 సంవత్సరం గాను రూ.3,22,716/- వచ్చాయని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో పూజారులు తోలేం వెంకటేశ్వర్లు, చిన్న నర్సయ్య, వెంకన్న బట్టు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## భద్రాచలం ఘటనపై మంత్రి తుమ్మల దిగ్భ్రాంతి



మార్చి 26 దమ్మపేట, (వుదయం ప్రతినిధి):భద్రాచలం ఘటనపై మంత్రి తుమ్మల దిగ్భ్రాంతి చేపడుతున్న సహాయ చర్యలపై మంత్రి తుమ్మల ఆరా

భద్రాచలం పట్టణములో నిర్మాణంలో ఉన్న భవనం కూలి ఆరుగురు మృతి పట్ల రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు తీవ్ర దిగ్బ్రంతుని వ్యక్తం చేశారు మంత్రి తుమ్మల భద్రాచలం లో జరిగిన ఘటనపై భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధికారులతో ఫోన్లో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు శిధిలాలు కింద చిక్కుకున్న కార్మికులను వెంటనే ఆసుపత్రికి చేర్పించి మెరుగైన వైద్య సహాయం అందించాలని మంత్రి తుమ్మల అధికారులు ఆదేశించారు దక్షిణ అయోధ్యగా పేరు కావున భద్రాచలంలో ఇలాంటి ఘటనలు జరగటం దురదృష్టకరమని చనిపోయిన కుటుంబాలకు మంత్రి తన తీవ్ర ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు పరిస్థితి పూర్తిగా పర్యవేక్షించాలని మంత్రి తుమ్మల అధికారులు ఆదేశించారు భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా అధికారులు పగడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు

## కలమడుగు పాఠశాలలో విద్యార్థులకు కంటి పరీక్షలు



జన్నారం,మార్చ్ 26(వుదయం విలేకరి) కంటి సమస్య ఉన్న విద్యార్థులు కంటి అద్దాలను తప్పకుండా వాడాలని ఆర్.బీ.ఎస్.కే జిల్లా సహాయ అధికారి గౌరీ శంకర్ సూచించారు. బుధవారం జన్నారం మండలంలోని కలమడుగు గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు రాష్ట్రీయ బాలికా సురక్షిత కార్యక్రమం ద్వారా కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేశారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కట్ట రాజమౌళి మాట్లాడుతూ విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి అద్దాలను అందజేయడం సంతోషంగా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ పోచయ్య, ఉపాధ్యాయులు మురిమడుగుల రమేష్, రాజేందర్, కవిత, సాగర్, ఎం.తిరుపతి, విద్యార్థులు పాల్గొన్నారు.

## సెలూన్ షాపులు బందు పెట్టి నిరసన



జయశంకర్ భూపాలపల్లి మార్చి 26(వుదయం ప్రతినిధి) కార్పొరేట్ సెలూన్ షాప్ ఏర్పాటు పై నిరసనగా మహాదేవపూర్ మండలంలో నాయి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో సెలూన్ షాపులు బంద్ చేసి నిరసన వ్యక్తం చేసినట్లు నాయి బ్రాహ్మణ సంఘం మహాదేవపూర్ మండల అధ్యక్షుడు సంతోష్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని మంజూరు నగర్ లో బ్యూటీ పార్లర్ కార్పొరేట్ సెలూన్ షాపు ప్రారంభోత్సవానికి సిద్ధమవుతుందని దానికి నిరసనగా భూపాలపల్లి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో గత నాలుగు రోజులుగా సెలూన్ షాపులు బందు చేసి నిరసన తెలపడం జరుగుతుందని అన్నారు భూపాలపల్లి నాయి బ్రాహ్మణ వారికి మద్దతుగా మహాదేవపూర్ మండలంలో మండల నాయి బ్రాహ్మణ కమిటీ ఆధ్వర్యంలో సెలూన్ షాపులను బందు చేయించడం జరిగిందని తెలిపారు ఈ ప్రాంతంలోని నాయి బ్రాహ్మణ బీద ప్రజల జీవనశైలి స్థితిగతులను దృష్టిలో ఉంచుకొని కార్పొరేట్ బ్యూటీ పార్లర్ సెలూన్ షాప్ లను ప్రారంభోత్సవానికి అనుమతులు ఇవ్వొద్దని నాయి బ్రాహ్మణ సంఘం తరపున వేడుకుంటున్నామని అన్నారు ఈ కార్యక్రమంలో మురహరి రాజేందర్, కిష్టయ్య, మల్లేష్, వెంకటయ్య, రవి, వెంకటేష్, రాజేందర్, సంతోష్, అజయ్, శ్రావణ్, మారుతి, వంశీ, రామకృష్ణ, రామయ్య, రామకృష్ణ, గణేష్ కుమార్, కృష్ణమోహన్, పాల్గొన్నారు.

## డివిజన్ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షునిగా బీచని బాలకృష్ణ...



కల్వకుర్తి న్యూస్26 వుదయం ప్రతినిధిపట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో బుధవారం కల్వకుర్తి రెవెన్యూ డివిజన్ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుని ఎన్నిక నిర్వహించారు. ఎన్నికల్లో బీచని బాల కృష్ణ తన ప్రత్యర్థి పాపిశెట్టి శ్రీనివాస్ పై ఐదు ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. గత పది రోజులుగా మిల్లర్స్ ఎన్నికల కోసం విస్తృత ప్రచారం నిర్వహించారు. పోటీదారులు తమ విజయం కోసం ఓటర్లను కలిసి తాము విజయం సాధిస్తే ఏం చేస్తాం అని చెప్పి ఓట్లు అడిగారు. ఎన్నికల్లో మొత్తం 58 ఓట్లకు గాను 57 ఓట్లు పోలయ్యాయి. బాలకృష్ణకు 31 ఓట్లు రాగ పాపిశెట్టి శ్రీనివాస్ కు 26 ఓట్లు రావడంతో 5 ఓట్ల మెజారిటీతో బాలకృష్ణ గెలపొందినట్లు ఎన్నికల అధికారులుగా వివరించిన విజయభాస్కర్, వెంకట్ రెడ్డి లు ప్రకటించారు. విజయం సాధించిన బాలకృష్ణను నాగర్కర్నూల్ జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్, కల్వకుర్తి రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించి, మిఠాయిలు తినిపించారు. తన విజయం కోసం కృషి చేసిన వారితోపాటు ప్రతి ఒక్కరికి బాలకృష్ణ కృతజ్ఞతలు చెప్పారు. పెద్దల సహకారంతో మిల్లర్ల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

## పలు కుటుంబాలను పరామర్శించిన లింగాల కమల్ రాజు





మధిర,మార్చి26(వుదయం ప్రతినిధి) అనిగళ్ళపాడు గ్రామంలో బిఆర్ఎస్ నాయకుడు ఆళ్ల నాగబాబు పెద్దమ్మ ఆళ్ల సరస్వతి పెద్దకర్మ, ఆత్కూరు మాజీ సర్పంచ్ అంకె అప్పారావు తల్లి, మధిర పట్టణంలో కృష్ణ సూరి అత్త మరణించడం తో వారి భౌతిక కాయానికి నివాళులు అర్పించి వారి కుటుంబలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేసిన ఖమ్మం జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ మధిర నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ లింగాల కమల్ రాజు. ఈ కార్యక్రమంలో చిత్తారు నాగేశ్వరరావు, కర్నాటి శ్రీనివాసరావు, యన్నం శెట్టి వెంకట అప్పారావు, చావా వేణు, వంకాయలపాటి నాగేశ్వరరావు, ఐలూరి ఉమామహేశ్వర్ రెడ్డి, కటికల సత్యనారాయణ రెడ్డి, కోన నరేందర్ రెడ్డి, పల్లపాటి కోటేశ్వరరావు, వీరంశెట్టి సీతారామయ్య, నాగులవంచ రామారావు, చీదిరాల రాంబాబు, పరిస శ్రీనివాసరావు, కోల కొండ, అబ్దుల్ కురేషు షేక్ మౌలాలి సంపసాల కొండ, ఆరుద్ర కొండ తదితరులు నాయకులు పాల్గొని వారికి ఘనంగా నివాళులు అర్పించారు.

# బయ్యారం మెయిన్ రోడ్డు ట్రాఫిక్ సమస్య పై అధికారుల నిర్లక్ష్యం.

-షాపు యజమానులే.. ఫుట్ పాత్ ఆక్రమణ.

-పార్కింగ్ స్థలాలు లేక వాహనదారుల ఇక్కట్లు..

-ప్రమాదం జరిగితేనే.. ట్రాఫిక్ సమస్యలు పరిష్కరిస్తారా...?





బయ్యారం(వుదయం ప్రతినిధి) మార్చ్ 26.బయ్యారం మండల కేంద్రంలో ఇటీవల కాలంలో ట్రాఫిక్ సమస్య పద్మవ్యూహాన్ని తలపిస్తోందని వాహనదారులకు తీవ్ర ఇబ్బందికరంగా మారిందని వాహనదారులు ఆరోపిస్తున్నారు. ప్రధాన రహదారికి ఆనుకొని డ్రైనేజీ ఉన్న డ్రైనేజీలు దాటుకొని ప్రధాన రహదారికి పక్కనే టోకు వ్యాపారులు ఫుట్ పాత్ వ్యాపారులు నిత్యం వ్యాపారం చేస్తూ జీవనం వెళ్లదీస్తున్నారు.రోడ్డుకు ఇరువైపులా ఉన్న షాపు యజమానులు..వారి ముందర స్తలంలో ఫుట్ పాత్ వ్యాపారం చేసే వారికి రోజు వారి కిరాయిలకు ఇస్తు రోడ్డు మరింత ఇరుకుగా మారడం జరుగుతుంది.ఇల్లందు - మహబూబాబాద్ ప్రధాన రహదారి నేషనల్ హైవే గా ప్రకటించినా..వాహనదారులకు ట్రాఫిక్ ఇబ్బందులు తప్పడం లేదని వాపోతున్నారు.బస్టాండ్ సెంటర్ వాహనం తీసుకవచ్చి పార్కింగ్ చేద్దామన్నా..షాపుల, ఫుట్ పాత్ వ్యాపారాలు చేసే నిర్వాహకులు, వాహనదారులను ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు సమాచారం.బయ్యారం,జగ్గుతండ పంచాయతీ అధికారులు ట్రాఫిక్ సమస్యపై దృష్టి సారించడం లేదనే పలువురు ఆరోపణలు చేస్తున్నాయి.రామాలయం సెంటర్ నుంచి జగ్గుతండ సంత రోడ్డు వరకు రోడ్డుకు ఇరువైపులా అడ్డంగా పెట్టె ద్విచక్ర వాహనాలు,తోపుడుబండ్లు, కూరగాయలు వ్యాపారాలు చేసుకునే వారు, ఫ్రూట్స్ షాప్ వారు రోడ్డు పైనే తమ వ్యాపారాలు కొనసాగిస్తూ ట్రాఫిక్ కు తీవ్ర అంతరాయం కలిగిస్తున్నారు.అధికారులు స్పందించి మెయిన్ రోడ్డు వ్యాపారాలు చేసే వారికీ వేరే దగ్గర స్థలం చూపించి బయ్యారం హైవే రోడ్డు పై ట్రాఫిక్ అంతరాయం లేకుండా చూడాలని అధికారులను స్థానిక ప్రజలు కోరుతున్నారు. ముఖ్యంగా యూనియన్ బ్యాంక్ సమీపంలో ద్విచక్ర వాహనాలు ఎక్కువగా ఉంచడంతో ట్రాఫిక్ సమస్య అధికమవుతోందని రోడ్డుకు అడ్డంగా పెట్టిన పలు ద్విచక్ర వాహనాల వల్ల వాహనదారులు,పాదాచరులకు ఇబ్బందిగా మారింది. ట్రాఫిక్ అంతరాయం కలగకుండా చూడాలని ప్రజలు కోరుకుంటున్నారు. మెయిన్ రోడ్డు పై దుకాణాల ముందర తోపుడు బండ్లు పెట్టించి వారి దగ్గర నెలకు 3 నుంచి 4 వేలు కిరాయి వసూల్ చేస్తూ షట్టర్ యజమానులు ఎక్కువగా ట్రాఫిక్ అంతరాయానికి కారణం అవుతున్నారు.షట్టర్ ముందు మెయిన్ రోడ్డు పై తోపుడు బండ్లు పెట్టె వారి దగ్గర కిరాయి వసూల్ చేసి ట్రాఫిక్ కు ఇబ్బంది గురి చేస్తున్నారని సమాచారం. దుకాణదారులపై కేసును నమోదు చెయ్యాలని ప్రజలు కోరుకుంటున్నారు.మెయిన్ రోడ్డు కు ఇరువైపులా డ్రైనేజి దాటకుండా దుకాణ వ్యాపారాలు నిర్వహించవలసి ఉండగా అవేమి పట్టవు అన్నట్లుగా రోడ్డే మాది అనే తంతుగా పలువురు వ్యవహరిస్తున్నారు. ఏదైనా రోడ్డు పై వెళ్లే వాహనం అదుపుతప్పి ప్రమాదంనకు గురి కాక ముందే అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్తానిక జనం కోరుతున్నారు.ఆర్ అండ్ బీ,అధికారులు,పంజాయితీరాజ్, పోలీస్ అధికారులు దృష్టి సారించి మండల కేంద్రంలో బస్టాండ్ సెంటర్ ట్రాఫిక్ సమస్యలు లేకుండా చూడాలని పలువురు వేడుకుంటున్నారు.

## దమ్మపేట జూనియర్ సివిల్ జడ్జి కోర్టు నందు చలివేంద్రం ఏర్పాటు



మార్చి 26 దమ్మపేట, (వుదయం ప్రతినిధి):భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం మండలందమ్మపేట జూనియర్ సివిల్ జడ్జి కోర్ట్ నందు చలివేంద్రం ఏర్పాటు చేయటమైనది. ఈ కార్యక్రమనికీ ముఖ్య అతిధిగా దమ్మపేట జూనియర్ సివిల్ జడ్జి అయిన బి,భవాని చలివేంద్రాన్ని ప్రారంభించినారు. ఇట్టి కార్యక్రమం లో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మారం సతీష్,సీనియర్ అడ్వకేట్ ఉడతానేని శ్రీనివాసరావు, అడ్వకేట్స్ గొంది మురళమోహన్, శ్యాంసుధాకర్,

కాలం సంధ్యా రాణి,సంజయ్, అరుణకుమారి, బాలరాజు, తదితరులు పాల్గొన్నారు

## రాజపేట తహసిల్దార్ గా అనిత బాధ్యతల స్వీకరణ.



యాదాద్రి భువనగిరి/ రాజపేట, మార్చి 26 వుదయం ప్రతినిధి: రాజపేట మండల తహసిల్దార్ గా సీసీఎల్ నుండి బదిలీపై వచ్చిన అనిత బుధవారం బాధ్యతల స్వీకరించారు. గత నెల 15వ, తేదీన విధులు నిర్వర్తిస్తున్న దామోదర్ నకిలీ ఏసీబీ వారు బెదిరించగా వారికి 2,80,000 రూపాయలు ఆన్లైన్లో దామోదర్ కుమారుని ద్వారా పంపి బంగపడి, ఆరోపణలు ఎదుర్కోగా 18వ, తేదీ సీసీఎల్ కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీంతో ఫిబ్రవరి 19వ, తేదీ నుండి రాజపేట తహసిల్దార్ ఫుల్ అడిషనల్ చార్జిగా నాయబ్ తహసిల్దార్ వెంకటేశ్వర్లు రెడ్డి వ్యవహరిస్తున్నారు. సీసీఎల్ నుండి బదిలీపై వచ్చిన అనిత బుధవారం రాజపేట తహసిల్దారుగా బాధ్యతలు స్వీకరించారు.

## ఎస్ఎస్సి పరీక్షా కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించిన డీఈవో కందుల సత్యనారాయణ.

### గణిత పరీక్షకు 8620 మంది హాజరైనట్లు చెప్పిన డీఈవో.




యాదాద్రి భువనగిరి/రాజాపేట, మార్చి 26 వుదయం ప్రతినిధి: రాజపేట మండలంలోని మూడు ఎస్ఎస్సి పరీక్షా కేంద్రాలను బుధవారం జిల్లా విద్యాధికారి కందుల సత్యనారాయణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రాజపేటలోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల, రఘునాథపురంలోని పరీక్షా కేంద్రాలను ఆయన సందర్శించి పరిసరాల పరిస్థితులను పరీక్షల నిర్వహణ పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఎంఈఓ చందా రమేష్ ద్వారా హాజరు వివరాలను, కేంద్రాలలో విద్యార్థుల సంఖ్యను పరిస్థితులను అడిగి తెలుసుకుని అభినందించారు. ప్రశాంత వాతావరణంలో సజావుగా రాజపేట మండలంలోని మూడు కేంద్రాలలో పరీక్షలు కొనసాగడం పట్ల ఆయా పాఠశాలల పరీక్షల చీఫ్ సూపర్డెంట్, డిపార్ట్మెంట్ ఆఫీసర్లను అభినందించారు. డిఇఓ వెంట ఎంఈఓ చందా రమేష్ ఉన్నారు. ఆయా పరీక్షా కేంద్రాలలో రాజపేట బాలుర ఉన్నత పాఠశాలలో పరీక్షల చీఫ్ సూపర్డెంట్ ఎం. శశికుమార్, డిపార్ట్మెంటల్ ఆఫీసర్ ఎస్. విజయలక్ష్మి, బాలికల ఉన్నత పాఠశాలలో పరీక్షల చీఫ్ సూపర్డెంట్ కే. మనోజ్ కుమార్, డిపార్ట్మెంటల్ ఆఫీసర్ బి. వసంత, రఘునాథపురం ఉన్నత పాఠశాలలోని పరీక్షా కేంద్రంలో పరీక్షల చీఫ్ సూపర్డెంట్ జి. కోటిరెడ్డి, డిపార్ట్మెంటల్ ఆఫీసర్ జె.ప్రభాకర్ లు వున్నారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాధికారి కందుల సత్యనారాయణ మాట్లాడుతూ యాదాద్రి భువనగిరి జిల్లాలో నాల్గవ రోజు గణిత పరీక్ష ప్రశాంత వాతావరణంలో జరిగిందని, తాను ఆలేరు, రాజపేట మండలాలలోని ఆరు పరీక్షా కేంద్రాలను సందర్శించగా జిల్లాలోని 20 పరీక్ష కేంద్రాలను ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందం సందర్శించినట్లు చెప్పారు. మొత్తం 8632 మంది విద్యార్థులకు గాను 8620 మంది విద్యార్థులు గణిత పరీక్ష రాసినట్లు చెప్పారు. ఎలాంటి అవకతవకలు లేకుండా అన్ని పరీక్షా కేంద్రాలలో పరీక్షలు కొనసాగినట్లు చెప్పారు.

## స్వరాజ్యం రాజ్యాంగ పరిరక్షణ కొరకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి

### ఏఐసిసి కార్యదర్శి డాక్టర్ ఎస్ ఏ సంపత్ కుమార్





ఆలంపూర్ మార్చి 26 (వుదయం ప్రతినిధి)ఏఐసీసీ ఆదేశాల మేరకు ఎర్రవల్లి మండల కేంద్రంలో బీచుపల్లి సాగర్ ఫంక్షన్ హాల్ నందు ఏర్పాటు చేసిన జై బాపు జై భీమ్ జై సంవిధాన్,జిల్లా స్థాయి సదస్సు లో ముఖ్య అతిథిగా అలంపూర్ మాజీ ఎమ్మెల్యే ఏఐసీసీ కార్యదర్శి ఏఐసిసి కార్యదర్శి డాక్టర్ ఎస్ ఏ సంపతా కుమార్ పాల్గొన్నారు. జై బాపు జై భీమ్ జై సంవిధాన్ రాష్ట్ర సమన్వయకర్త డాక్టర్.ఎస్.ఏ. సంపత్ కుమార్, తెలంగాణ సాంస్కృతిక శాఖ ఛైర్మెన్ వెన్నెల, రాష్ట్ర జోగులాంబ గద్వాల జిల్లా సమన్వయకర్త క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ దీవక్ జాన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సంపత్ కుమార్ మాట్లాడుతూ గాంధీజీ, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కలలుగన్న గ్రామ స్వరాజ్యం రాజ్యాంగ పరిరక్షణ కొరకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు. మహాత్మ గాంధి చూపిన మార్గంలో నడుస్తూ అంబేద్కర్ రాజ్యాంగాన్ని కాపాడుతూ దేశ ప్రజలను మభ్య పెడుతూ మనువాద సిద్ధాంతాన్ని ప్రజల పైన రుద్దుతున్న భారతీయ జనతా పార్టీని ఎండగడుతూ రాజ్యాంగ పరిరక్షణ పైన అవగాహన కల్పించే దిశగా గ్రామ గ్రామాన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. బీజేపీ ప్రభుత్వం హిందీని జాతీయ భాష చేయాలని కుట్ర పన్నుతున్నారు. తెలుగు ప్రాంత ప్రజలకు అన్యాయం చేసే ఈ చర్యను అడుగడుగునా అడ్డుకోవాలని అన్నారు. రాజ్యాంగం యిచ్చిన హక్కుల ద్వారానే మనం ప్రశ్నించ గలుగుతున్నాం, మన హక్కులను సాధించ గలుగుతున్నం, కనుక రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడు పైన ఉంది అన్నారు. ఈ కార్యక్రమంలో వీరితో పాటు జోగులాంబ గద్వాల జిల్లా మాజీ జడ్పీ చైర్ పర్సన్ జిల్లా ఇంచార్జి సరిత తిరుపతయ్య, జిల్లా గ్రంథాలయ చైర్మన్ నీలి శ్రీనివాసులు, మార్కెట్ కమిటీ చైర్మన్ దొడ్డప్ప, వైస్ చైర్మన్ కుమార్, గద్వాల జిల్లా లోని అన్ని మండలాల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# పదవ తరగతి పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

పరీక్షలలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సవ్యంగా నిర్వహించేలా చూడాలి
జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



నల్గొండ మార్చి 26(వుదయం ప్రతినిధి): పదో తరగతి పరీక్షలలో భాగంగా బుధవారం జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి నల్గొండ జిల్లా, కొండమల్లెపల్లి కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో ఏర్పాటు చేసిన పదవ తరగతి పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రంలో పోలీస్ భద్రత, బుధవారం పరీక్షకు హాజరైన విద్యార్థులు, పరీక్ష కేంద్రం చుట్టుపక్కల 144 సెక్షన్, జిరాక్స్ కేంద్రాల మూసివేత, పరీక్ష కేంద్రంలో తాగునీరు, ఓ ఆర్ ఎస్ పాకెట్లు, ప్రథమ చికిత్స ఏర్పాట్లు, తదితర అన్ని వివరాలను పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటిండెంట్ ద్వారా జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. పరీక్షలలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సవ్యంగా నిర్వహించేలా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ ఎస్పీ మౌనిక ,ఆర్డిఓ రమణారెడ్డి తదితరులు జిల్లా కలెక్టర్ వెంట ఉన్నారు.

# ఢిల్లీలో డాక్టర్ బూర.., బిజీ బిజీ.



న్యూఢిల్లీ: భువనగిరి మాజీ పార్లమెంట్ సభ్యులు, బిజెపి జాతీయ కౌన్సిల్ సభ్యులు, డాక్టర్ బుర నర్సయ్య గౌడ్ గారు ఢిల్లీలో పర్యటనలో భాగంగా బిజెపి జాతీయ అధ్యక్షులు కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా తోపాటు పలువురు బిజెపి జాతీయ నాయకులను వరుసగా కలుస్తూ గత రెండు మూడు రోజులుగా బిజీబిజీగా ఉన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ బూర నర్సయ్య గౌడ్ మాట్లాడుతూ కేంద్ర హోంమంత్రి అమిత్ షా మరియు కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జెపి నడ్డా ను కలిసిన సందర్భాల్లో భువనగిరి పార్లమెంట్ పరిధిలోని పలు అంశాలను వారి దృష్టికి తీసుకురావడం జరిగిందని, కేంద్ర కు సంబంధించిన ప్రాజెక్టులలో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలను కల్పించాలని కోరినట్లు, అలాగే ఆయుష్మాన్ భారత్ పథకం అమలు కాకపోవడం వల్ల తెలంగాణ ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఈ విషయంలో కూడా చొరవ చూపి పరిష్కారాన్ని చూపించాలని వారిని కోరినట్లుగా ఆయన తెలిపారు. తెలంగాణలోనీ తాజా పరిస్థితులపై కూడా వారితో చర్చించినట్లు డాక్టర్ సాబ్ తెలిపారు.

# జ్యూస్ పాయింట్ తొలగించాలంటూ కమిషనర్ కువినతిపత్రం.



పరకాల మార్చి 26 (వుదయం ప్రతినిధి): పరకాల పట్టణంలో అనుమతి లేకుండా రోడ్డుపై నిర్వహిస్తున్న జ్యూస్ పాయింట్ ను తక్షణమే తొలగించాలని డిమాండ్ చేస్తూ ఏకుశంకర్ మాదిగ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి మున్సిపల్ కమిషనర్ కు వినతి పత్రం అందజేశారు. హుజురాబాద్ రోడ్లో ప్రధాన రహదారి పై ఆనుకొని ఉన్న జ్యూస్ పాయింట్ యజమాని పలు మల్టీ వ్యాపారాలు నిర్వహిస్తుండడంతో ఆ మార్గంలో ప్రయాణించే వాహనదారులకు ఇతర షాపు యజమానులకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్టు అంతేకాకుండా వర్క్ బోర్డ్ షాప్ లీజ్ వేరే పై ఉండగా సబ్లీస్ తీసుకొని వాక్ఫోర్డ్ సంస్థకు రెంట్ కట్టడం వర్ఫోర్డు కమిటీని సైతం లెక్కచేయకుండా అక్రమంగా నిబంధనలకు విరుద్ధంగా రోడ్డు పై రేకుల షెడ్డు నిర్మించి జ్యూస్ పాయింట్ పెట్టి రోడ్డును కూడా ఆక్రమించుకొని మరొకరికి అద్దెకు టిఫిన్ సెంటర్ కి ఇచ్చి రోడ్డు మొత్తం బ్లాక్ చేస్తూ గత 30 ఏళ్లుగా ఆస్థానంలో పలు గ్రామాలకు ఆటో స్టాండ్ సెంటర్ గా ప్రయాణికుల అడ్డాగా పిలవబడుతూ జీవిస్తున్నటువంటి ఆటో కార్మికులను పలు రకాలుగా ఇబ్బందులకు గురిచేస్తూ అడిగిన వారిని నీకు దిక్కున చోటు చెప్పుకోపో అంటూ నాన్న రకాలుగా వేధిస్తున్న జ్యూస్ పాయింట్ యజమాని పై ఆటో కార్మికుల సైతం పోలీస్స్టేషన్లో ఫిర్యాదు చేసిన దేనిని లెక్కచేయకుండా నడిరోడ్డు పై దర్జాగా మల్టీ వ్యాపారాన్ని కొనసాగిస్తున్న యజమాని అల్లావుద్దీన్ పై చట్టపరమైన చర్యలు తీసుకొని జ్యూస్ పాయింట్ తొలగించాలని కమిషనర్ ను కోరారు.

### నేడు గ్రామపంచాయతీ షాపింగ్ కాంప్లెక్స్ తై బజార్ వేలంపాట

జయశంకర్ భూపాలపల్లి మార్చి 26(వుదయం ప్రతినిధి) నేడు మహాదేవపూర్ గ్రామపంచాయతీ షాపింగ్ కాంప్లెక్స్ తై బజార్ వారాంతపు సంత వేలంపాట నిర్వహిస్తున్నట్లు గ్రామపంచాయతీ కార్యదర్శి కమల బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు నేడు మహాదేవపూర్ గ్రామపంచాయతీ ఆవరణలో ఉదయం 10 గంటలకు ప్రత్యేక అధికారి డి ఎల్ పి ఓ,వీరభద్ర ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ షాపింగ్ కాంప్లెక్స్ తై బజార్ వారాంతపు సంత వేలంపాట కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు వేలంపాటలో పాల్గొనేవారు షాపింగ్ కాంప్లెక్స్ కోసం పదివేల రూపాయలు తై బజార్ వారాంతపు సంత వేలంపాట కోసం 30 వేల రూపాయలు గ్రామపంచాయతీలో డిపాజిట్ చేసి వేలం పాటలో పాల్గొనాలని తెలిపారు వేలం పాటలో పాల్గొనేవారు గ్రామపంచాయతీకి ఎలాంటి బకాయి ఉండకూడదని తెలిపారు.

# ధర్మబిక్షం ఆశయ సాధనలో భాగస్వామ్యులు కావాలి.



యాదాద్రి భువనగిరి/రాజాపేట, మార్చి 26 వుదయం ప్రతినిధి: రాజపేట మండలం లో బేగంపేట గ్రామంలో గౌడ సంఘ ఆధ్వర్యంలో మాజీ ఎంపీ, సిపిఐ నేత బొమ్మగాని ధర్మం బిక్షం 14వ, వర్ధంతి సందర్భంగా గీతా పని వారి సంఘం అధ్యక్షులు బావుపేట వెంకటయ్య ఆధ్వర్యంలో బుధవారం జరిగింది. బొమ్మగాని ధర్మం బిక్షం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ తెలంగాణ రైతాంగానికి గీత కార్మికులకు ఎనలేని సేవలందించారని గుర్తు చేశారు. వారి నిజమైన హక్కుల కోసం ధర్మ బిక్షం నిరంతరం శ్రమించి సఫలీకృతులయ్యారని తెలిపారు. గీతా పని వారి సంఘం వ్యవస్థాపకులు నాయకులు, గీత కార్మికులు పలువురు నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొనగా పాసిపిఐ పార్టీ మండల కార్యదర్శి చిగుర్ల లింగం మాట్లాడారు. ఉపాధ్యక్షులు జల్ల బిక్షపతి, డైరెక్టర్ జిల్లా బాల్నగర్, జల్ల వెంకటయ్య, బొమ్మగాని బాల నర్సు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బొమ్మగాని ధర్మం బిక్షం చిత్రపటానికి పూలమాలలు వేసే నివాళులు అర్పించారు.

# ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురి కాకుండా పకడ్బందీగా చర్యలు తీసుకుంటాం...

## జిల్లా కలెక్టర్ బి సత్య ప్రసాద్





జగిత్యాల మార్చి 26 (వుదయం ప్రతినిధి) జగిత్యాల రూరల్ మండలం నర్సింగాపూర్ గ్రామంలో బుధవారం అక్రమనకు గురైన 90 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని సంబంధిత అధికారులతో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ ప్రభుత్వ స్థలాన్ని సందర్శించి సర్వే నెంబర్లు వ్యూ పాయింట్స్ చెక్ చేశారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ మాట్లాడుతూ జగిత్యాల జిల్లా రూరల్ మండలం నర్సింగాపూర్ గ్రామంలో సర్వే నెంబర్ 251, 437,సర్వే నెంబర్ కు సంబంధించి 90 ఎకరాల్లో ప్రభుత్వ అసైన్ ల్యాండ్ కు సంబంధించిన సర్వే చేపట్టడం జరిగింది సర్వే తర్వాత ఏవైతే పట్ట అయినా భూములు ఉన్నాయో అవి అన్నీ కూడా పిఓటి యాక్ట్ క్రింద క్యాన్సల్ చేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు ఏవైతే సెల్ అయి రిజిస్ట్రేషన్ అయినవి ఉన్నాయో అవన్నీ కూడా క్యాన్సిల్ చేయడం జరిగిందన్నారు కావున 90 ఎకరాల్లో ప్రభుత్వ స్థలంలోని సర్వే నెంబర్ 437,251, లో ఆన్ రికార్డు పరంగా గవర్నమెంట్ రికవరీ చేసుకుంది ప్రభుత్వం పరంగా గవర్నమెంట్ ల్యాండ్ జాబితాలో ఉందన్నారు ఇతరులు రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి వారికి రిజిస్ట్రేషన్ అనేది కాదని తెలిపారు అంతా కూడా ప్రభుత్వ రికార్డ్ జాబితాలో ఉందన్నారు గ్రౌండ్ లెవెల్లో మొత్తం అంత పరిశీలించడం జరిగింది ముందుగా ఎవరైతే స్థలం కొన్నవారు ఇతరులకు అమ్ముకోవడం అనేది జరిగింది వాళ్లు ఇక్కడ ఇటుక బట్టి వ్యాపారం చేయడం అంతా కూడా ప్రత్యక్షంగా చూడడం జరిగింది వాళ్లకి ప్రభుత్వం పరంగా వాళ్లందరికీ ఇదివరకే వార్నింగ్ ఇవ్వడం అనేది జరిగింది కావున చివరి సారీ గా వార్నింగ్ ఇచ్చి వారందరికీ 48 గంటల లోపు ప్రభుత్వ స్థలంలో ఉన్న అంతా కూడా క్లియర్ చేయమని ఆదేశాలు జారీ చేశారు లేని యెడల ప్రభుత్వ పిఓటి యాక్ట్ ప్రకారం ప్రభుత్వ స్థలంలో వారు వ్యాపారాలు చేసుకున్నందుకు గాను వారి పైన క్రిమినల్ కేసులు నమోదు చేస్తం లేదంటే అంతా కూడని జప్తు చేసుకొని సీజు చేసి ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని తెలిపారు 48 గంటల లోపు వారికి డెడ్ లైన్ ఇస్తున్నామని కలెక్టర్ హెచ్చరించారు ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ తో పాటు ఇన్చార్జి ఆర్డీవో శ్రీనివాస్ ఎమ్మార్వో శ్రీనివాస్ రూరల్ మండల డిఐఓ ల్యాండ్ సర్వేయర్ విఠల్ మండల సర్వేయర్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు

# పర్యావరణ సమతుల్యతను పెంపొందించాలి!

## కలెక్టర్ ప్రావీణ్య!




హనుమకొండ, మార్చి 26(వుదయం జిల్లా ప్రతినిధి) : పింగిళి ప్రభుత్వ మహిళా కళాశాల (స్వయం ప్రతిపత్తి) హనుమకొండలో బుధవారం రోజున "ఇంటర్ డిసిప్లినరీ మెటీరియల్స్ సైన్స్ ఫర్ సస్టేనబుల్ ఎనర్జీ అండ్ ఎన్విరాన్మెంట్ (ఎన్ సి ఐ ఎం ఎస్ ఎస్ ఈ ఈ -2025)" అనే అంశంపై రెండు రోజుల నేషనల్ కాన్ఫరెన్స్ ప్రారంభమైంది.కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ లెఫ్టినెంట్ డా. బి.చంద్రమౌళి అధ్యక్షత వహించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య సదస్సులో ప్రసంగిస్తూ ఆధునిక ప్రపంచంలో సుస్థిరాభివృద్ధి సాధించుటకు వివిధ రకాల శక్తి వనరులను సంరక్షించుకోవడానికి,మరియు పర్యావరణ సమతుల్యతను పెంపొందించాలని,దాని కోసంమెటీరియల్ సైన్స్ దోహద పడుతుందని అన్నారు. నూతన ఆవిష్కరణలు సృజనాత్మక ఆలోచనావిధానాలతో సుస్థిరాభివృద్ధిలో భాగం కావాలని,వివిధ రకాల నైపుణ్యాలను వినియోగించుకొని లెర్న్ ఇట్ బై డూ ఇట్ అనే భౌతిక శాస్త్ర భావన ద్వార అవకాశాలను అందిపుచ్చుకొని విద్యార్థులు ప్రగతి పథంలో ముందుకు వెళ్లాలని కలెక్టర్ సూచించారు.కలెక్టర్ గారు కళాశాలను సందర్శించి కళాశాల గురించి ప్రస్తావిస్తూనాక్ ఏ ప్లస్ ప్లస్ లేదా ఎక్సలెన్స్ గ్రేడ్ రావడానికి కావలసిన అన్నిరకాల వసతుల కల్పన,ముఖ్యంగా కళాశాల అదనపు తరగతి గదులు,కళాశాలకు కావలసిన పోటీ పరీక్షల పుస్తకాల ఏర్పాటు,కళాశాలలో బొటానికల్ గార్డెన్ నిర్మాణం , విద్యార్థులకు వైద్య వసతి,సోలార్ ఎనర్జీ కల్పన,మంచినీటి సౌకర్యం,ఇంకుడు గుంతల ఏర్పాటు, అడ్వాన్స్ కంప్యూటర్ లాబ్ ఏర్పాటుకు తోడ్పాటు అందిస్తామనీ అట్లాగేకళాశాలవసతి గృహం పై అదనపు అంతస్తు నిర్మాణం కోసం సంబంధిత అధికారులు మరియు ప్రభుత్వంతో మాట్లాడి సహాయం చేస్తామని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూమెటీరియల్ సైన్స్ లో నూతన ఆవిష్కరణల ద్వార వివిధ శక్తి వనరులను,పర్యావరణమును పరి రక్షించుకోవాలని అన్నారు.వరంగల్ ఎన్ ఐ టీ ఫిజిక్స్ ప్రొఫెసర్ డి.హరినాథ్ కాన్ఫరెన్స్ లో కీలకోపన్యాసం చేస్తూ మెటీరియల్ సైన్స్ ను వినియోగించుకొని వివిధ రకాల ప్రాణుల ఆకారాల మాదిరితో బుల్లెట్ ట్రెయిన్,అత్యాధునిక వాహనాలను తయారుచేయడం జరిగిందన్నారు. సదస్సు కన్వీనర్ %డ% అర్గనైజింగ్ సెక్రటరీ డా. పి.అరుణ జాతీయ కాన్ఫరెన్స్ యొక్క ప్రాధాన్యతను తెలియస్తూ పర్యావరణ స్పృహ సుస్థిరాభివృద్ధిలో నూతన సాంకేతికతలో ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ ఉపయోగపడుతున్నాయని అన్నారు.కార్యక్రమానికి గౌరవ అతిథిగా విచ్చేసిన వరంగల్ ఎన్ వై కె డిప్యూటీ డైరెక్టర్ సి హెచ్ అన్వేష్ మాట్లాడుతూ వివిధ రకాల స్కిల్స్ పెంపొందించుకోవడం ద్వారా విద్యార్థులు శాస్త్ర విజ్ఞాన రంగంలో అగ్రగామిగా నిలవాలనీ,ఎలాన్ మస్క్ లాంటి ప్రపంచ దిగ్గజాల ఆలోచనా ధోరణిని అలవర్చుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా అతిథులు ఫిజిక్స్ జాతీయ సదస్సు నిర్వాహకులను అభినందించారు.ఈ సదస్సులో 120 మంది రాసిన పరిశోధక పత్ర వ్యాసాలను ఐ ఎస్ బి ఎన్ తో సావనేర్ ను కలెక్టర్ అతిథుల చేతుల మీదుగా ఆవిష్కరించారు.తదనంతరం అతిథులను పుష్పగుచ్చం,శాలువా,జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు.వివిధ కళాశాలల నుండి వచ్చిన ఉపన్యాసకులు,పరిశోధకులు,ఔత్సాహికులు టెక్నికల్ సేషన్ లో తమ పరిశోధన పత్రాలను సమర్పించారు. ప్రత్యేకమైన ప్రదర్శనను ఏర్పాటు చేయగా ఇది అందరినీ అలరించింది.

కార్యక్రమంలోవైస్ ప్రిన్సిపాల్ సుహాసిని, కో కన్వీనర్ శ్రీమతి ఈ. కవిత,ఐ క్యూ ఏ సీ కోఆర్డినేటర్ డా .సురేష్ బాబు,అకడమిక్ కో ఆర్డినేటర్ డా. ఎం.అరుణ,అధ్యాపకులు హెప్సిబా,ప్రవీణ్ కుమార్ ,పద్మ,సుజాత,మధు,సారంగపాణి,రత్నమాల,సునీత,శ్రీలత,ఉదయశ్రీ,ప్రశాంతి,లక్ష్మీకాంతం,,యుగంధర్,రాజు, రమేశ్ కుమార్ ,రాజిరెడ్డి,రాజేశ్వరి,మమత,బాలరాజు,లకన్ సింగ్,సుభాషిణి,సుమలత,సమత,సురేష్, రాజ్ కుమార్,భారతి,కృష్ణ మరియు భోధన బోధనేతర సిబ్బంది,ఇతర కళాశాలల అధ్యాపకులు,పరిశోధకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

### సర్దార్ సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం మహిళా విభాగం మోటకొండూరు

### మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గా బొడిగే శాంతమ్మ పులి అలివేల



యాదాద్రి భువనగిరి / మోటకొండూరు : మార్చి వుదయం ప్రతినిధి : సర్దార్ సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం మహిళా విభాగం మోటకొండూరు మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గా మండలంలోని ముత్తిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన బొడిగే శాంతమ్మ, పులి అలివేల నియామకం అయ్యారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షురాలు పంజాల విజయ గౌడ్,జిల్లా ప్రధాన కార్యదర్శి పచ్చిమట్ల మాధవి గౌడ్ వారికి నియామకం పత్రం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సంధర్భంగా సర్దార్ సర్వాయి పాపన్న గీతా కార్మిక సంఘం మహిళా విభాగం మోటకొండూరు మండల అధ్యక్షురాలు బోడిగే శాంతమ్మ,మండల ప్రధాన కార్యదర్శి పులి అలివేల మాట్లాడుతూ ఎన్నికకు సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని గౌడ మహిళల అభివృద్ధి కోసం పాటు పడుతూ వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తే వారిని చైతన్య పరుస్తామని తెలిపారు. ఎన్నికైన వారికి గ్రామస్తులు, మహిళలు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

# ప్రమాదం జరిగితే బాధ్యులు ఎవరు

కామారెడ్డి, మార్చి26(వుదయం ప్రతినిధి): కామారెడ్డి జిల్లా గాంధారి మండలంలోని ముదెల్లి చౌరస్తాలో కరెంట్ మీటర్ స్తంభానికి ప్రమాదకర స్థితిలో వేలాడుతుంటే పట్టించుకునే వారే లేరా అని స్థానికులు అంటున్నారు. ఎపుడు రద్దీగా ఉండే ఈ ప్రదేశంలో ఎవరికైనా తీగలు తగిలితే ప్రమాదం జరిగితే దానికి బాధ్యత ఎవరు వహిస్తారు అని ప్రజలు ప్రశ్నించుకుంటున్నారు. గత నాలుగు ఐదు నెలల నుండి స్తంభానికి ఇదే మాదిరిగా వేలాడుతూ ఉన్న సరి చేసే నాధుడే కరువయ్యారు అంటున్నారు.

## అత్యవసర రక్తదానం చేసి మహిళ ప్రాణాన్ని కాపాడిన రాజశేఖర్

ఎల్లారెడ్డి,మార్చి26(వుదయం ప్రతినిధి): కామారెడ్డిలో ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ప్రమీలకు "బి"పాజిటివ్ గ్రూపు గల రక్తం బుధవారం ఆపరేషన్ నిమిత్తమై అవసరమైంది. ఒక్క ఫోన్ కాల్ తో కామారెడ్డి పట్టణానికి చెందిన రాజశేఖర్ హుటాహుటిన వచ్చి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా అత్యవసరంగా రక్తదానం చేసిన రక్తదాతను కామారెడ్డి జిల్లా రక్తదాతల సేవా సమితి నిర్వాహకులు బోనగిరి శివకుమార్ అభినందించారు.

## పంటలు నష్టపోయిన రైతులకు తక్షణ సహాయం అందించాలి

మహేశ్వరం, మార్చి26(వుదయం ప్రతినిధి):మాడుగుల మండలంలో ఇటీవల ఈదురు గాలులతో కురిసిన వర్షానికి పంటలు నష్టపోయిన రైతులకు తక్షణ సహాయం అందించి ఆదుకోవాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కోరారు. బుధవారం అసెంబ్లీలో మాట్లాడుతూ అకాల వర్షానికి మండలంలో 4 వేల ఎకరాలలో మొక్కజొన్న పంటకు నష్టం వాటిల్లినట్లు అధికారులు అంచనా వేశారని చెప్పారు. ఈదురు గాలులతో కరెంటు స్తంభాలు విరిగిపోయాయని, వాటి స్థానంలో నూతన స్తంభాలను బిగించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# షేక్ పల్లిలో ఉచిత కంటి పరీక్షలు

వికారాబాద్, మార్చి26(వుదయం ప్రతినిధి): మహమ్మదాబాద్ మండల పరిధిలోని షేక్ పల్లి గ్రామపంచాయతీలో కమల హాస్పిటల్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. షేక్ పల్లి గ్రామం తో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తరలివచ్చారు. కార్యక్రమంలో Dr . రాజు, మాజీ ఎంపీపీ శాంతి రంగ్యా ,
గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రవళిక, మాజీ పిఏసిఎస్ చైర్మన్ మోసిన్అలీ, రాజేందర్, యుసుఫ్, ఈదిరీష్, రవి నాయక్ భీమమ్మ, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు

# వీఆర్ఏ జేఏసీ ఆధ్వర్యంలో మహా ధర్నా

ముషీరాబాద్, మార్చి26(వుదయం ప్రతినిధి): నూతనంగా తీసుకువచ్చే జిపిఓ ఉద్యోగాల్లో వీఆర్ఏ వారసులకు ప్రాధాన్యత ఇవ్వాలని, జీవో నెంబర్ 81, 85 ప్రకారం మిగిలిన 3797 మంది వీఆర్ఏ వారసులకు ఉద్యోగాలు కల్పించాలని ఇంద్ర పార్క్, ధర్నా చౌక్ లో వీఆర్ఏ జేఏసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కొత్తగా తీసుకో వస్తున్న గ్రామ పరిపాలన అధికారి (జిపిఓ)పోస్టుల్లో వీఆర్ఏ వారసులకు ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# నవోదయ ఫలితాలలో స్లేట్ పాఠశాలల విజయదుందిబి











జన్నారం,మార్చి 26(వుదయం విలేఖరి) నవోదయ ప్రవేశ పరీక్ష ఫలితాలలో స్లేట్ పాఠశాల నుండి ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల చైర్మన్ డాక్టర్.ఏనుగు శ్రీకాంత్ రెడ్డి తెలిపారు.ఎం.అయాన్,బి.చిన్న,ఎస్. అఖిలేశ్ యాదవ్ ముగ్గురు విద్యార్థులు ఆరవ తరగతి నవోదయ ప్రవేశ పరీక్షలో సీట్లు సాధించడంతో పాటు స్లేట్ ఎక్సెన్స్ పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు విశ్వసాయి, అభిరామ్, భరద్వాజ్ లు తొమ్మిదో తరగతిలో ప్రవేశానికి సీటు సాధించారు. 2009 నుండి ఇప్పటివరకు తమ పాఠశాల నుండి 50 మంది విద్యార్థుల వరకు నవోదయలో సీటు సాధించడం ఎంతో గర్వకారణంగా ఉందని పాఠశాల చైర్మన్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఈ ఘన విజయాన్ని వ్యక్తిగతంగా టీచర్ల బృందంతో కలిసి హృదయపూర్వకంగా అభినందించారు.ఈ విజయం మాకు గర్వకారణమే కాదు, బాధ్యతను కూడా గుర్తు చేస్తోందని మరెంతో మంది విద్యార్థులు ఇటువంటి అవకాశాలను పొందేలా చేస్తూ, గ్రామీణ విద్యారంగంలో మార్పుకు మార్గదర్శకులమవాలనే సంకల్పాన్ని మరింత బలపరిచిందన్నారు.ఈ కార్యక్రమంలో స్లేట్ ప్రిన్సిపల్ శిరీన్ ఖాన్, ఉపాధ్యాయులు రంజిత్, రమ్య, రిజ్వన్ పాల్గొన్నారు.

# నవోదయ కు ఎంపికైన విద్యార్థి తల్లిదండ్రులకు సన్మానం



జయశంకర్ భూపాలపల్లి 26(వుదయం ప్రతినిధి) నవోదయ కు ఎంపికైన విద్యార్థితో పాటు తల్లిదండ్రులను పాఠశాల యజమాన్యం బుధవారం సన్మానించారు మహాదేవపూర్ మండల కేంద్రంలోని గ్రీన్ వుడ్ కాన్సెప్ట్ హై స్కూల్ కు చెందిన విద్యార్థి కొక్కు సనిత్ కుమార్ 2025 26 విద్యా సంవత్సరంకు సంబంధించి ప్రవేశ పరీక్ష ఫలితాలలో అత్యుత్తమ మార్కులతో 6వ తరగతికి ప్రవేశం పొంది జవహర్ నవోదయ పాఠశాలకు ఎంపిక కావడంతో పాఠశాల యజమాన్యం విద్యార్థి కొక్కు సనిత్ కుమార్ తోపాటు తల్లిదండ్రులను సాల్వలతో సన్మానించారు అలాగే ఈ విజయానికి కృషిచేసిన ఉపాధ్యాయులను పాఠశాల యాజమాన్యం జ్ఞాపికతో అభినందించారు ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ చీర్ల శ్రీనివాస్ రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు, శ్రీనివాస్ రెడ్డి, పాఠశాల డైరెక్టర్ ఆకుతోట రాజ్ కుమార్, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులతోపాటు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.





# బిజినెస్





## ద్వితీయార్థంలో అమెరికాలో మాంద్యం..!

ప్రస్తుత ఏడాది ద్వితీయార్థంలో అమెరికాలో ఆర్థిక మాంద్యం ప్రభావాలు పెరగొచ్చని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. వాణిజ్య టారీఫ్‌ల ఉద్రిక్తతలు, ద్రవ్య సర్దుబాట్ల పర్యవసానాలతో ఇన్వెస్టర్లు, విధాన నిర్ణేతలు సతమతమవుతున్నారని బ్లూమ్‌బర్గ్ ఓ రిపోర్ట్‌లో పేర్కొంది. ఈ నేపథ్యంలో యుఎస్ మార్కెట్‌లో రానున్న రోజుల్లో ఒడిదుడుకులు ఎదురవుతాయని మెజారిటీ ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. మాంద్యాన్ని ఎదుర్కోవడానికి ప్రభుత్వ వ్యూహాత్మక ఆర్థిక జోక్యాలు అవసరమని సూచిస్తున్నారు. ఆర్థిక కార్యకలాపాలు మందగించడంతో 2025 మార్చి త్రైమాసికంలో జిడిపి వృద్ధి తగ్గొచ్చని హెచ్చరిస్తున్నారు.

మార్చి త్రైమాసికంలో త్రైమాసికంలో యుఎస్ జిడిపి వృద్ధి 1.4 శాతానికి పరిమితమయ్యింది. 2024 చివరి మూడు నెలల్లోని 2.3 శాతం వృద్ధితో పోల్చితే చాలా మందగించింది. వాణిజ్య లోటు పెరగడం, వినియోగదారుల వ్యయం మందగించడం, శీతాకాల కార్యకలాపాలు ఆర్థిక వ్యవస్థకు ప్రతికూలంగా మారాయని నిపుణులు పేర్కొంటున్నారు. దిగుమతులు పెరగడం, ఎగుమతులు



స్తంభించడంతో వాణిజ్య లోటు రికార్డు స్థాయికి చేరుకుంది. ఒక్క జనవరి 2025లోనే వస్తు, సేవల వాణిజ్య లోటు 131.4 బిలియన్ డాలర్లుగా నమోదయ్యింది. మందగమనం భయాలతో అమెరికా పౌరులు విచక్షణ, అచీతూచి కొనుగోళ్లు చేస్తున్నారు. చాలా కుటుంబాలు అత్యవసరం కాని కొనుగోళ్ల కంటే అవసరాలకు ప్రాధాన్యత ఇస్తున్న విషయాన్ని నిపుణులు గుర్తు చేస్తున్నారు.

## భారత జిడిపి అంచనాలకు కోత

భారత జిడిపి అంచనాలకు ఎస్అండ్‌పి గ్లోబల్ రేటింగ్స్ కోత పెట్టింది. వచ్చే ఆర్థిక సంవత్సరం (2025-26)లో భారత వృద్ధి రేటు 6.5 శాతానికే పరిమితం కావొచ్చని అంచనా వేసింది. అమెరికా టారీఫ్ విధానాలు వర్ధమాన దేశాలపై ప్రతికూల ప్రభావం చూపనుందని విశ్లేషించింది. ఈ నేపథ్యంలోనే భారత వినిమయ డిమాండ్‌ను దెబ్బతీయనుందని పేర్కొంది. ”2026 మార్చి 31తో ముగియనున్న ఆర్థిక సంవత్సరంలో భారత జిడిపి 6.5 శాతానికి పరిమితం కావొచ్చు. ఇంతక్రితం ఈ అంచనా 6.7 శాతంగా ఉంది. వచ్చే వర్షాకాలం సీజన్ సాధారణంగా ఉండొచ్చు. అదే విధంగా కమోడిటీ, చమురు ధరలు సానుకూలంగా నమోదు కావొచ్చు.'' అని ఎస్అండ్‌పి పేర్కొంది. ”ఆసియా, ఫసిఫిక్ రీజియన్‌లోని సెంట్రల్ బ్యాంక్ వడ్డీ రేట్లను తగ్గించొచ్చని అంచనా. రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా మరో 75-100 బేసిస్ పాయింట్ల మేర వడ్డీ రేట్లను కోత పెట్టొచ్చు. అహార ధరలు తగ్గొచ్చు. వచ్చే 2025-26లో రిటైల్ ద్రవ్యోల్బణం 4 శాతంగా ఉండొచ్చు.'' అని ఎస్అండ్‌పి తెలిపింది. ఆర్‌బిఐ ఇటీవల విధాన సమీక్షలో రెపోరేటును 25 బేసిస్ పాయింట్లు తగ్గించి 6.50 శాతం నుంచి 6.25 శాతానికి కోత పెట్టింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో భారత జిడిపి 6.4 శాతానికి పరిమితం కావొచ్చని ఇటీవల నేషనల్ గణంకాల శాఖ (ఎన్ఎస్ఒ) అంచనా వేసింది. ఇది నాలుగేళ్లలోనే అత్యంత కనిష్ట స్థాయి కావడం ఆందోళనకరం. ఇంతక్రితం 2023-24లో జిడిపి 8.2 శాతం పెరిగింది. 2024-25లో 6.6 శాతం వృద్ధి ఉండొచ్చని ఆర్‌బిఐ ఇటీవల అంచనా వేసింది. వీటితో ఎస్అండ్‌పి అంచనాలు పోల్చితే ప్రస్తుత, వచ్చే ఆర్థిక సంవత్సరంలో గొప్ప ఆశజనక వృద్ధి రేటు కానరాకపోవడం ఆందోళనకరం.

## ఏఐ ఆధారిత టీవీలపై

### అద్భుతమైన ఆఫర్‌లు

గృహ వినోదాన్ని తదుపరి స్థాయికి తీసుకువెళ్తూ , సామ్‌సంగ్ యొక్క ప్రీమియం శ్రేణి టీవీలు ఏఐ -ఆధారిత చిత్ర నాణ్యత, లీనమయ్యే ధ్వని మరియు సొగసైన డిజైన్‌లను అందిస్తాయి. వినియోగదారులు ఎంపిక చేసిన కొనుగోళ్లపై రూ. 2,04,990 వరకు విలువైన ఉచిత టీవీని లేదా రూ. 90,990 వరకు




విలువైన ఉచిత సౌండ్‌బార్‌ను కూడా పొందవచ్చు. ఈ ఆవిష్కరణలను మరింత అందుబాటులోకి తీసుకురావడానికి, సామ్‌సంగ్ 20% వరకు క్యాష్‌బ్యాక్, జీరో డౌన్ పేమెంట్ మరియు 30 నెలల వరకు కేవలం రూ. 2990 నుండి ప్రారంభమయ్యే సులభమైన ఈఎంఐ అవకాశాలను అందిస్తోంది. అదనంగా, వారు ఏదైనా సామ్‌సంగ్ టీవీ కొనుగోలుతో సామ్‌సంగ్ సౌండ్‌బార్‌లపై 45% వరకు తగ్గింపును పొందవచ్చు, ఇది సినిమాటిక్ వీక్షణ అనుభవానికి అప్‌గ్రేడ్ చేయడానికి సరైన అవకాశంగా మారుతుంది.

ఈ ఆఫర్‌లు ఋఎంబఅస్త్ర.ఔశీఎ, ప్రముఖ ఆన్‌లైన్ పోర్టల్‌లు మరియు భారతదేశం అంతటా ఎంపిక చేసిన సామ్‌సంగ్ రిటైల్ అవుట్‌లెట్‌లలో అందుబాటులో ఉంటాయి. “సామ్‌సంగ్ వద్ద, మేము అత్యాధునిక సాంకేతికతను ఆకర్షణీయమైన డీల్‌లతో కలిపి అందించడం ద్వారా, అత్యుత్తమ సాంకేతికతను వారి ఇళ్లలోకి తీసుకు వచ్చి వినియోగదారుల వీక్షణ అనుభవాన్ని మెరుగుపరచడానికి నిరంతరం కృషి చేస్తుంటాము. మా ప్రీమియం ఏఐ -శక్తితో కూడిన టీవీలు వినోదాన్ని పునర్నిర్వచించాయి. అసమానమైన చిత్ర నాణ్యత, లీనమయ్యే శబ్దం మరియు సజావుగా కనెక్టివిటీని అందిస్తున్నాయి. మేము ఆసమ్ ఇండియాతో పండుగల మాసాన్ని జరుపుకుంటున్నప్పుడు. సామ్‌సంగ్ యొక్క ఏఐ -శక్తితో కూడిన టీవీల శ్రేణిపై ప్రత్యేకమైన డీల్‌లను అందించడానికి మేము సంతోషిస్తున్నాము. ఈ ఉత్తేజకరమైన పండుగ ఆఫర్‌ల ద్వారా, వినియోగదారులు తమ వీక్షణ అనుభవాన్ని మెరుగుపరచుకోవడానికి, తమ ప్రియమైనవారితో సాధ్యమైనంత లీనమయ్యే విధంగా వేడుక జరుపుకోవడానికి వీలు కల్పించడం ద్వారా ప్రీమియం హోమ్ ఎంటర్‌టైన్‌మెంట్‌ను మరింత అందుబాటులోకి తీసుకురావాలని మేము లక్ష్యంగా పెట్టుకున్నాము,” అని సామ్‌సంగ్ ఇండియా విజువల్ డిస్‌ప్లే బిజినెస్ సీనియర్ డైరెక్టర్ విప్లవేష్ డాంగ్ అన్నారు. మార్చి నెల మొత్తం అందుబాటులో ఉన్న సామ్‌సంగ్ యొక్క తాజా పండుగ ఆఫర్‌లు, ఏఐ -శక్తితో కూడిన గృహ వినోదం ను మరింత అందుబాటులోకి తీసుకురావడానికి రూపొందించబడ్డాయి. ప్రీమియం టీవీ శ్రేణి వినియోగదారులు అధునాతన ఏఐ అప్‌స్కేలింగ్, జీవితపు తరహా కలర్ ఖచ్చితత్వం మరియు ఉన్నతమైన ధ్వని నాణ్యతతో లీనమయ్యే విజువల్స్‌ను ఆస్వాదించేలా చేస్తుంది.

## కేంద్ర పథకాలతో మరింత

### పుంజుకున్న పునరుత్పాదక ఇంధన రంగం..



జాబ్ మార్కెట్లో పునరుత్పాదక ఇంధన రంగం హవా కొనసాగుతూనే ఉంది. 2025 ఏడాదికి కూడా అధిక సంఖ్యలో ఉద్యోగాలను సృష్టిస్తుందని టీమ్‌లీజ్ సర్వీసెస్ తాజా నివేదిక వెల్లడించింది. 2025లో ఈ రంగంలో ఏకంగా 18.9 శాతం నియామకాలు పెరుగుతాయని అంచనా వేసింది. పునరుత్పాదక ఇంధన రంగంలో నియామకాల జోరు 2024లో 23.7 శాతం ఉండగా.. 2023లో 8.5%, 2022లో 10.4%గా ఉంది. 2030 నాటికి 500 గిగావాట్స్ శిలాజేతర ఇంధన సామర్థ్యం పెంచేందుకు లక్ష్యంగా పెట్టుకుంది. దీంతో మునుముందు ఈ రంగంలో ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగ అవకాశాలు గణనీయంగా పెరగనున్నాయి. ముఖ్యంగా పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలి యోజన, నేషనల్ గ్రీన్ హైడ్రోజన్ మిషన్,ాావీ ఖఖూఖవీ, సోలార్‌ాం మాడ్యూల్‌ూా× వంటి కేంద్ర ప్రభుత్వ పథకాలు పునరుత్పాదక ఇంధన రంగంలో వృద్ధిని సాధించడంలో కీలక పాత్ర పోషించాయి. ఈ విధానాలు శ్రామిక శక్తి విస్తరణ, నైపుణ్య అభివృద్ధికి గణనీయంగా దోహదపడుతున్నట్లు నివేదిక పేర్కొంది. కంపెనీలు సామర్థ్యాన్ని పెంచడానికి డిజిటల్ ఆవిష్కరణలను ఎక్కువగా అవలంబిస్తున్నందున సౌర, పవన, హైబ్రిడ్ ఇంధన వ్యవస్థలలో సాంకేతికత ఆధారిత రోల్స్‌కు డిమాండ్ పెరుగుతున్నట్లు నివేదిక వెల్లడించింది. ముఖ్యంగా సోలార్ ప్యానెల్ ఇన్‌స్టాలర్లు, ఎనర్జీ ఆడిటర్లు, ఆపరేషనల్ సపోర్ట్ నిపుణులతో పాటు, సోలార్ ాం టెక్నీషియన్లు, రూఫర్లు, ప్రొడక్షన్ ఆపరేటర్లు, స్టోరేజ్ ఆపరేటర్లు, వేస్ట్ మేనేజ్‌మెంట్ స్పెషలిస్టుల అవసరం పెరుగుతున్నట్లు నివేదిక తెలిపింది. దేశంలో సౌరశక్తి ఉత్పత్తిలో అగ్రగామిగా ఉన్న రాజస్థాన్, గుజరాత్, కర్ణాటక,యు తమిళనాడు వంటి రాష్ట్రాలు ఈ రంగంలో ఉపాధి కల్పనలో ముందంజలో ఉన్నాయి. ఆయా రాష్ట్రాల్ల సౌరశక్తి ప్లాంట్లు అత్యధికంగా ఉన్నాయి. అంతేకాకుండా ఈ రంగంలో కాంట్రాక్టు ఉద్యోగుల్లో 44.1% మంది ఐటీఐ లేదా డిప్లొమా, 28.9% గ్రాడ్యుయేట్లు, 14.6% 12వ తరగతి ఉత్తీర్ణత, 4.1% పోస్ట్ గ్రాడ్యుయేట్లు ఉన్నట్లు నివేదిక వెల్లడించింది.

అధిక యువత ఈ రంగంలో పని చేస్తున్నారు. దాదాపు 54.8% మంది ఉద్యోగులు 26 నుంచి 35 ఏళ్ల వయస్సు గలవారే కావడం విశేషం.

## ఇంధన స్టోరేజీ ఉత్పత్తుల్లోకి ప్యూర్




ప్రముఖ ద్విచక్ర విద్యుత్ వాహనాల తయారీ సంస్థ ప్యూర్ కొత్తగా ఇంధన స్టోరేజీ ఉత్పత్తుల్లోకి ప్రవేశించింది. ఇప్పటి వరకు ఇవి రంగంలో ఉన్న ఈ కంపెనీ మంగళవారం హైదరాబాద్‌లో ప్యూర్‌పవర్ ఎనర్జీ స్టోరేజీ ఉత్పత్తులను విడుదల చేసింది. వీటిని నీతి అయోగ్ సభ్యుడు, డిఆర్‌డిఒ మాజీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ వికె సారస్వత్ లాంఛనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్యూర్ ఫౌండర్, ఎండి నిషాంత్ డొంగరి మీడియాతో మాట్లాడుతూ.. తాము కొత్తగా ప్యూర్‌పవర్ హోమ్, ప్యూర్ పవర్ కమర్షియల్ ఉత్పత్తులను అందుబాటులోకి తెచ్చామని.. త్వరలోనే ప్యూర్‌పవర్ గ్రిడ్ ఉత్పత్తులను విడుదల చేయనున్నామని చెప్పారు. వీటితో విద్యుత్తును నిల్వ చేసుకుని అవసరానికి తగ్గట్టుగా వాడుకునేందుకు వీలుందన్నారు. ఇవి సాధారణ యుపిఎస్‌లలో మాదిరిగా వీటిల్లో లెడ్ ఆక్సైడ్ బ్యాటరీలు కాకుండా.. అత్యాధునిక లిథియం-అయాన్ బ్యాటరీలను ఉపయోగించామన్నారు. సౌర విద్యుత్తు లాంటి సంప్రదాయేతర ఇంధన వనరులతో ఉత్పత్తి అయ్యే విద్యుత్తును కూడా ఎటువంటి అదనపు పరికరాల అవసరం లేకుండా నిల్వ చేసుకోవచ్చన్నారు. ఇంటిపై ఏర్పాటు చేసుకున్న సోలార్ ప్యానెల్స్‌తో వచ్చే విద్యుత్‌ను ఇంటికి వాడుకోవడంతో పాటుగా.. మిగిలిన విద్యుత్‌ను ప్రభుత్వ గ్రిడ్‌కు విక్రయించుకోవచ్చన్నారు. ప్యూర్‌పవర్ హోమ్ ధర రూ.74,999గా ప్రారంభమవుతుందన్నారు. ఇవి 3కెవిఎ, 5కెవిఎ, 15కెవిఎ సామర్థ్యాల్లో లభిస్తాయన్నారు. వచ్చే 18 నెలల్లో 300 మంది డీలర్ల ద్వారా ఈ ఉత్పత్తులను మార్కెట్ చేయనున్నామన్నారు. గ్రిడ్ స్థాయిలో విద్యుత్తును నిల్వ చేసే 'ప్యూర్ పవర్: గ్రిడ్'ను వచ్చే ఏడాది అందుబాటులోకి తేనున్నామన్నారు.

## సామ్‌సంగ్ రూ.5,150 కోట్ల పన్ను ఎగవేత..?

ప్రముఖ ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల కంపెనీ సామ్‌సంగ్‌కు భారత ఆదాయపు పన్ను శాఖ భారీ షాక్ ఇచ్చింది. ఆ కంపెనీతో పాటు ఎగ్జిక్యూటివ్‌లకు 601 మిలియన్ డాలర్ల (దాదాపు రూ.5,150 కోట్లు) పన్ను డిమాండ్ నోటీసులు జారీ చేసింది. కీలకమైన టెలికాం పరికరాల దిగుమతులపై సుంకాలను ఎగవేసిన ఆరోపణలపై పన్నులు, జరిమానా కలిపి చెల్లించాలని ఐటి శాఖ నోటీసుల్లో స్పష్టం చేసింది. గతేడాది కంపెనీ సాధించిన రూ.8,180 కోట్ల) నికర లాభాల్లో ఇది సగానికి పైగా ఉండటం విశేషం. కంపెనీ టెలికాం పరికరాలను దిగుమతి చేసుకునే క్రమంలో 2023 ఏడాది మొబైల్ టవర్‌లలో ఉపయోగించే కీలకమైన ట్రాన్స్‌మిషన్ పరికరాలపై 10-20 శాతం సుంకాలను చెల్లించలేదని ఐటి అధికారులు గుర్తించారు. ఈ పరికరాలను ముకేష్ అంబానీకి చెందిన టెలికాం దిగ్గజం రిలయన్స్ జియో కోసం దిగుమతి చేసి




విక్రయించింది. సామ్‌సంగ్ భారతీయ చట్టాలను ఉల్లంఘించిందని, ఉద్దేశపూర్వకంగా క్లియరెన్స్ కోసం కస్టమ్స్ అథారిటీకి తప్పుడు పత్రాలను సమర్పించిందని అని కస్టమ్స్ కమిషనర్ సోనాల్ బజాజ్ నోటీసుల్లో తెలిపారు. లాభాలను పెంచుకోవాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వాన్ని మోసం చేసినట్లు అధికారులు భావిస్తున్నారు. ఈ ఉల్లంఘనలపై పన్ను బకాయిలు, 100 శాతం పెనాల్టీతో కలిపి సామ్‌సంగ్ 520 మిలియన్లు చెల్లించాలని కస్టమ్స్ విభాగం ఆదేశాలు జారీ చేసింది. అదే విధంగా ఏడుగురు సామ్‌సంగ్ ఇండియా ఎగ్జిక్యూటివ్‌లకు 81 మిలియన్ డాలర్ల జరిమానా కూడా విధించింది. దీంతో సామ్‌సంగ్ మొత్తంగా 601 మిలియన్ డాలర్లు చెల్లించాల్సి వస్తుంది. ఇది ఇటీవలి కాలంలో అతిపెద్ద పన్ను డిమాండ్లలో ఒకటి కావడం గమనార్హం. ఈవిషయంపై 2023 లోనే సామ్‌సంగ్‌ను భారత్ హెచ్చరించింది. 2021 నుంచే విచారణ జరుపుతోంది. కాగా.. తాము బాధ్యతాయుతంగా కార్యకలాపాలను నిర్వహిస్తున్నామని సామ్‌సంగ్ పేర్కొంది. దేశంలోని చట్టాలకు పూర్తిగా కట్టుబడి ఉన్నామని.. దీనిపై చట్టపరంగా ముందుకెళ్తామని పేర్కొంది.

# జాతీయం - అంతర్జాతీయం

## కొత్త ఇన్‌కమ్ ట్యాక్స్ బిల్లుపై వచ్చే సెషన్‌లో చర్చ:

కొత్త ఆదాయపు పన్ను (ఐటి) బిల్లును పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో చర్చకు చేపట్టనున్నట్లు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం ప్రకటించారు. లోక్‌సభలో ఆర్థిక బిల్లు 2025పై చర్చలకు నిర్మలా సీతారామన్ సమాధానంఇస్తూ, ఫిబ్రవరి 13న సభలో ప్రవేశపెట్టిన కొత్త ఆదాయపు పన్ను బిల్లును ప్రస్తుతం సెలెక్ట్ కమిటీ పరిశీలిస్తోందని తెలియజేశారు. సెలెక్ట్ కమిటీ తన నివేదికను పార్లమెంట్ తదుపరి సమావేశాల మొదటి రోజు సమర్పించవలసి ఉంది. 'మేము దానిని (కొత్త ఆదాయపు పన్ను బిల్లును) వర్షాకాల సమావేశాల్లో చేపడతాం' అని మంత్రి తెలిపారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు సాధారణంగా జూలైలో మొదలై ఆగస్టు వరకు సాగుతుంటాయి. కొత్త ఆదాయపు పన్ను బిల్లు ఆమోదం పొందిన తరువాత డిజిటల్ రికార్డును కూడా మదింపునకు పరిగణనలోకి తీసుకోనున్నట్లు సీతారామన్ చెప్పారు. 1961 ఆదాయపు పన్ను చట్టం ఆదాయ వ్యయాన్ని సూచించే అకౌంట్ పుస్తకాలను, భౌతికంగా ఉంచిన లేదా ప్రతి మాన్యువల్ రికార్డును పరిశీలించేందుకు అనుమతిస్తున్నది. అయితే, 1961 చట్టంలో డిజిటల్ ప్రస్తావన లేనందున అది తరచు వివాదాస్పదం అవుతోందని, జనం కోర్టును ఆశ్రయించి, పాస్‌కోడ్‌ను పంచుకోకుండా రక్షణ కోరుతున్నారని ఆమె తెలిపాను.



'అందువల్ల డిజిటల్ ఒక వివాదంగా మారుతోంది. ఇప్పుడు ఉన్న ఆ లోటును కొత్త ఆదాయపు పన్ను బిల్లులో భర్తీ చేస్తున్నాం. బిల్లు సెలెక్ట్ కమిటీ ముందు ఉంది' అని ఆమె చెప్పారు. తనిఖీ, స్వాధీనం కేసుల్లో ఆన్‌లైన్ ట్రేడింగ్, పెట్టుబడి ఖతాలు సహా వర్చువల్ డిజిటల్ స్పేస్, కంప్యూటర్ సిస్టమ్‌ల అందుబాటు కోడ్‌ను అధిగమించే అధికారాలను పన్ను అధికారులకు కొత్త బిల్లు దత్తం చేస్తుంది. 1961 ఆదాయపు పన్ను చట్టం పరిమాణంలో సగం ఉన్న సరళీకృత ఆదాయపు పన్ను బిల్లు దావా అవకాశాన్ని, కొత్త అన్వయాన్ని కనిష్ఠ స్థాయికి చేర్చడం ద్వారా పన్నును కచ్చితత్వం చేస్తుందని ఆదాయపు పన్ను శాఖ ఇంతకు ముందు తెలియజేసింది.

## వెనిజులాపై ట్రంప్ కన్నెర్ర

### భారత్‌పై ప్రభావం పడుతుందంటున్న నిపుణులు

వాషింగ్టన్ : వెనిజులాపై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ కన్నెర్ర చేశారు. ఆ దేశం నుంచి చమురు, గ్యాస్ దిగుమతి చేసుకునే ఏ దేశం పైన అయినా సరే ఇరవై ఐదు శాతం సుంకం విధిస్తానని ప్రకటించారు. అమెరికా శత్రు దేశాలతో పాటు మిత్ర దేశాలపై కూడా ట్రంప్ వాణిజ్య యుద్ధాన్ని ముమ్మరం చేసిన విషయం తెలిసిందే. 'అమెరికా పట్ల వెనిజులా చాలా శతృత్వ ధోరణితో వ్యవహరిస్తోంది. కాబట్టి ఆ దేశం నుండి చమురు లేదా గ్యాస్ కొనుగోలు చేసే ఏ దేశమైనా అమెరికాతో వాణిజ్యం నెరిపితే ఇరవై ఐదు శాతం సుంకం చెల్లించాల్సిందే' అని ట్రూత్ సోషల్ నెట్‌వర్క్‌లో ట్రంప్ స్పష్టం చేశారు. ట్రంప్ హెచ్చరికలు భారత్‌పై ప్రభావం చూపుతాయని మార్కెట్ నిపుణులు అభిప్రాయపడ్డారు.

2023 డిసెంబరులోనూ, 2024 జనవరిలోనూ వెనిజులా నుండి ముడి చమురు కొనుగోలు చేసిన దేశాలలో భారత్‌దే మొదటి స్థానం. ఆ దేశం నుండి భారత్ 22 మిలియన్ బ్యారల్స్ చమురును దిగుమతి చేసుకుంది. మన దేశం కొనుగోలు చేస్తున్న మొత్తం ముడి చమురులో



ఇది ఒకటిన్నర శాతం. 2023 డిసెంబరులో భారత్ రోజుకు సుమారు 1,91,600 బ్యారల్స్ చమురును దిగుమతి చేసుకుంది. రిలయన్స్ ఇండస్ట్రీస్ రోజుకు 1,27,000 బ్యారల్స్, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ) 37,000 బ్యారల్స్, హెచ్‌పీసీఎల్-మిట్టల్ ఎనర్జీ 28,000 బ్యారల్స్ దిగుమతి చేసుకున్నాయి. గత సంవత్సరం జనవరిలో భారత్ దిగుమతులు రోజుకు 2,54,000 బ్యారల్స్‌కు పెరిగాయి. వెనిజులా చేసిన మొత్తం ఎగుమతులలో ఇది దాదాపు సగం. ట్రూత్ సోషల్ వేదికలో ట్రంప్ నూతన టారిఫ్‌ను ప్రకటిస్తూ 'అధ్యక్షుడు డొనాల్డ్ జే ట్రంప్ ఈ రోజు ఓ ప్రకటన చేస్తున్నారు. వెనిజులాపై అమెరికా రెండో దఫా టారిఫ్‌ను విధిస్తోంది. ఇందుకు అనేక కారణాలు ఉన్నాయి. వెనిజులా ఉద్దేశపూర్వకంగా, మోసపూరితంగా వేలాది మంది నేరస్థులను రహస్యంగా అమెరికాకు పంపుతోంది. వీరిలో చాలా మంది హంతకులు. వారు హింసాత్మక స్వభావం కలిగిన వారు. అమెరికాకు వెనిజులా పంపుతున్న ముఠాలలో ట్రెన్ డీ అరాగువా ఒకటి. అది ఓ విదేశీ ఉగ్రవాద సంస్థ. వారిని వెనిజులాకు తిప్పి పంపే ప్రయత్నంలో ఉన్నాం. అది చాలా పెద్ద పని. పైగా అమెరికా విషయంలో వెనిజులా శత్రుభావంతో వ్యవహరిస్తోంది' అని ఆరోపించారు. కాబట్టి వెనిజులా నుండి చమురు లేదా గ్యాస్ కొనుగోలు చేసే ఏ దేశమైనా అమెరికాతో వాణిజ్యం కొనసాగించాలంటే ఇరవై ఐదు శాతం సుంకాన్ని విధిగా చెల్లించాల్సిందేనని స్పష్టం చేశారు. డాక్యుమెంటేషన్ ప్రక్రియను పూర్తి చేసి వచ్చే నెల 2వ తేదీ నుండి సుంకాలు విధిస్తామని పునరుద్ఘాటించారు. ఆ రోజు అమెరికాలో విముక్తి దినోత్సవాన్ని జరుపుకుంటామని ట్రంప్ చెప్పుకొచ్చారు.


## ఢిల్లీ విమానాశ్రయంలో 75 స్మార్ట్‌ఫోన్ల చోరీ



లక్షలాది రూపాయలు విలువచేసే హైఎండ్ స్మార్ట్‌ఫోన్లను దొంగిలించినందుకు గ్రౌండ్ హ్యాండ్లింగ్ ఉద్యోగిని ఢిల్లీ పోలీసులు అరెస్టు చేశారని ఓ అధికారి మంగళవారం తెలిపారు. నిందితుడిని మోను అలియాస్ నిఖిల్ కుమార్(28)గా గుర్తించారు. దొంగిలించిన మొత్తం 75 స్మార్ట్‌ఫోన్లలో 36 ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కార్గో సర్వీసెస్ వద్ద సేల్స్ అండ్ మార్కెటింగ్ హెడ్‌గా పనిచేస్తున్న సంజయ్ యాదవ్ ఫిర్యాదు చేశాక విషయం వెలుగు చూసింది. ఫిర్యాదు ప్రకారం కంపెనీ 280 బ్రాండెడ్ స్మార్ట్‌ఫోన్లు ఉన్న పివిసి బాక్సులను నోయిడా ఫేస్ రెండు గోడౌన్ నుంచి ఇండోర్ స్టోర్‌కు జనవరి 27న డిస్పాచ్ చేసింది. అయితే విమానం ఆగమనం(అరైవల్) తర్వాత 75 ఫోన్లు ఉన్న బాక్స్ మిస్సయింది. సిసిటివి ఫుటేజ్ చూసినా అంతుచిక్కలేదు. దాంతో పరిశోధకులు టెక్నికల్ నిఘాతో దొంగిలించిన పరికరాలను గుర్తించారు. 'ఓ కొనుగోలు దారు తూర్పు పటేల్ నగర్‌లోని మొబైల్ డీలర్ సుమన్ కుమార్ నుంచి కొనుగోలు చేయడంతో కేసులో పరోగతి లభించింది. అతడిని ప్రశ్నించాక సుమన్ తాను 27 ఫోన్లను మరో డీలర్ అరుణ్ శర్మ నుంచి రూ. 26 లక్షలకు కొనుగోలు చేసినట్లు తెలిపాడు. ఇన్వాయిస్‌లు లేకుండా ఫోన్లు అమ్మినందుకు కస్టమర్లు వాటిని సుమన్‌కు వాపస్ చేశారు. అతడు అరుణ్ శర్మకు వాపస్ చేశాడు' అని అదనపు పోలీస్ కమిషనర్(ఐజిఐ) ఉషా రంగ్నాని తన ప్రకటనలో పేర్కొన్నారు. పోలీసులు తమ పద్ధతిలో ప్రశ్నించాక నిఖిల్ కుమార్ నేరాన్ని అంగీకరించాడు. అతడు గ్రౌండ్ హ్యాండ్లింగ్ ఏజెన్సీలో గత రెండేళ్లుగా లోడర్‌గా పనిచేస్తున్నాడు.

## గాజాలో కొనసాగుతున్న మారణ హోమం

గాజా : వరుసగా 8వ రోజు కూడా గాజాపై ఇజ్రాయిల్ బలగాలు బాంబు దాడులకు తెగబడుతున్నాయి. మంగళవారం నాటి దాడుల్లో 23మంది మరణించగా, వీరిలో ఏడుగురు చిన్నారులు వున్నారు. గాజాపై ఇజ్రాయిల్ సాగిస్తున్న ఈ మారణహోమంలో ప్రస్తుత కాలం చిన్నారులకు ప్రాణసంకటంగా మారింది. గత వారం రోజుల్లో జరిపిన దాడుల్లో 270మందికి పైగా చిన్నారులు మరణించారని సేవ్ ది చిల్డ్రన్ సంస్థ వెల్లడించింది. ఉత్తర గాజాలోని సరిహద్దు ప్రాంత పట్టణాల్లో నివసిస్తున్న వేలాదిమంది పాలస్తీనియన్లందరినీ కూడా అక్కడ నుండి ఖాళీ చేయాల్సిందిగా ఇజ్రాయిల్ మిలటరీ ఆదేశించింది. ఆ ప్రాంతం నుండే పాలస్తీనా రాకెట్లు ప్రయోగిస్తున్నారని విమర్శించింది. మరోవైపు ఇజ్రాయిల్ సాగిస్తున్న దారుణమైన ఊచకోతలను హమాస్ తీవ్రంగా ఖండించింది. తక్షణమే ఇజ్రాయిల్‌కు పగ్గాలు వేయాల్సిందిగా అంతర్జాతీయ సమాజాన్ని కోరింది. వరుసగా మూడో రోజూ పాలస్తీనా రెడ్ క్రీసెంట్ సొసైటీకి చెందిన 9మంది గల్లంతయ్యారు. రఫా నగరంలో సహాయ కార్యకలాపాలకు వెళ్ళినవీరు వెనక్కి తిరిగి రాలేదు. సెటిలర్లపై దాడులు జరిగిన నేపథ్యంలో ఇజ్రాయిల్ ఆర్మీ ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లో ఆస్కార్ అవార్డు గ్రహీత నిర్మాత, కో డైరెక్టర్ అయిన హమ్‌దాన్ బల్లాల్‌ను ఇజ్రాయిల్ అదుపులోకి తీసుకుంది. సుశియా గ్రామంలో యూదు సెటిలర్లు ఆయనపై దాడి చేశారు. వెంటనే సైనికులు ఆయనను



అదుపులోకి తీసుకున్నారు. నో అదర్ ల్యాండ్ పేరుతో ఆయన తీసిన డాక్యుమెంటరీ అస్కార్ పురస్కారాన్ని గెలుచుకుంది.

ఆయన అరెస్టు వార్తపై ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. అయితే బల్లాల్‌ను ఆయనతో పాటు అదుపులోకి తీసుకున్న మరో ఇద్దరు పాలస్తీనియన్లను వుంచిన కిర్యాత్ అర్బా సెటిల్‌మెంట్ ఏరియాలో పోలీసు స్టేషన్ నుండి వారు బయటకు వస్తూ కనిపించారని మీడియా వార్తలు తెలిపాయి. బల్లాల్ ముఖంపై గాయాలున్నాయని, ఆయన దుస్తులపై రక్తం మరకలు వున్నాయని ఎపి వార్తా సంస్థ వెల్లడించింది.



## ఒడిషాలో రెండో రోజు కాంగ్రెస్ ఎమ్మెల్యేల నిరసన

ఒడిషా అసెంబ్లీలో సస్పెండైన 12 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేల నిరసన రెండో రోజు కొనసాగుతుంది. భువనేశ్వర్‌లోని కాంగ్రెస్ పార్టీ ఆఫీస్ ఎదుట బైటాయించి నిరసన తెలిపారు. రాష్ట్రంలో మహిళలకు భద్రతలేదని, దీనిపై సభలో హౌస్ కమిటీ వేర్పాటు చేయాలని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీలో డిమాండ్ చేశారు. స్పీకర్ పోడియం వద్ద వెళ్లి ఆ రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో సభాపతి..12మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై వేటు వేశారు. స్పీకర్ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ..అసెంబ్లీ ప్రాంగణంలో ధర్నాకు దిగారు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు. అప్రమత్తమైన పోలీసులు వారిని అక్కడినుంచి బయటకు పంపించారు. పోలీసుల తీరు పట్ల కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అసహనం వ్యక్తం చేశారు. పలువురు అధికారులు తమపై దాడి చేశారని, ఇలాంటి పరిస్థితి తన జీవితంలో ఎన్నడూ చూడలేదని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఆరోపించారు. హౌస్ కమిటీ వేయకుండా..అధికార పార్టీ రాజకీయం చేస్తోందని, కమిటీ వేస్తే నిజాలుబయటకు వస్తాయని ప్రభుత్వం భయపడుతుందని ప్రతిపక్ష ఎమ్మెల్యేలు విమర్శించారు.

## నూరేళ్ల బాయిలర్ల చట్టాన్ని మార్చే బిల్లుకు లోక్‌సభ ఆమోదం

బాయిలర్ల క్రమబద్ధీకరణకు, స్టీమ్‌బాయిలర్ల పేలుడు ప్రమాదాల నుంచి వ్యక్తుల ప్రాణ, ఆస్తి రక్షణకు, రిజిస్ట్రేషన్‌లో ఒకే రీతికి ఉద్దేశించిన ఒక బిల్లును లోక్‌సభ మంగళవారం ఆమోదించింది. బాయిలర్ల బిల్లు 2024ను నూరు సంవత్సరాల నాటి బాయిలర్ల చట్టం 1923 స్థానంలో తీసుకురావడమైంది. ఆ బిల్లును నిరుడు డిసెంబర్‌లో రాజ్యసభ ఆమోదించింది.

ఏడు నేరాల తీవ్రతను తగ్గించి, వ్యాపార సౌలభ్యాన్ని ప్రోత్సహించడం లక్ష్యంగా ఉన్న బిల్లును ఎగువ సభ మూజువాణి వోటుతో ఆమోదించింది. బాయిలర్ల లోపల పని చేసే వ్యక్తులకు భద్రత ఉండేలా నిబంధనలు కూడా



బిల్లులో ఉన్నాయి. బాయిలర్ల మరమ్మతును అర్హులైన. సమర్థ వ్యక్తులు చేపట్టాలని కూడా బిల్లు నిర్దేశిస్తోంది. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ బిల్లును ప్రవేశపెడుతూ, వలలవాద శకపు పునరావృత, కాలం చెల్లిన నిబంధనలను తొలగించినట్లు బిల్లు వలసవాద మనస్తత్వానికి స్వస్తి పలుకుతున్నట్లు తెలియజేశారు. 'మేము బిల్లును తేలికగా, పఠనయోగ్యంగా చేశాం' అని మంత్రి చెప్పారు. కొంత మంది సభ్యుల ఆందోళనలను గోయల్ పరిహరిస్తూ, ఈ చట్టం రాష్ట్ర ప్రభుత్వాల అధికారాలను కైవసం చేసుకోదని స్పష్టం చేశారు. రాష్ట్రాల హక్కులు వేటినీ ఈ చట్టంతో కైవసం చేసుకోలేదని మంత్రి సభ్యులకు హామీ ఇచ్చారు. ఈ చట్టాన్ని పూర్వపు కాంగ్రెస్ ప్రభుత్వం జాప్యం చేసిందని విమర్శించినప్పుడు గోయల్ సమాధానం సమయంలో ప్రతిపక్ష సభ్యులు వాకౌట్ చేశారు.

## నల్ల సముద్ర జలాలపై రెండు ఉక్రెయిన్ డ్రోన్‌ల కూల్చివేత

మాస్కో : రక్షణ దళాలు నల్ల సముద్ర జలాలు సహా వివిధ ప్రాంతాలపై ప్రయోగించిన తొమ్మిది ఉక్రెయిన్ డ్రోన్‌లను కూల్చివేసినట్లు రష్యా రక్షణ శాఖ బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. మంగళవారం రాత్రి కూల్చివేసిన డ్రోన్‌లలో రెండు నల్ల సముద్రం జలాలపై ఉన్నాయని పేర్కొంది. రష్యా సరిహద్దు ప్రాంతమైన బెల్గోరోడ్‌లోని ఒక అపార్ట్‌మెంట్ భవనంపై జరిగిన డ్రోన్ దాడిలో ఒక పౌరుడు గాయపడ్డారని బెల్గరోడ్ ప్రాంత గవర్నర్ వ్యాచెస్లావ్ గ్లాడ్కోవ్ తెలిపారు. ఆ వ్యక్తి తలకు గాయమైందని, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని అన్నారు. దాడిలో భవనానికి కూడా స్వల్ప నష్టం వాటిల్లినట్లు గ్లాడ్కోవ్ టెలిగ్రామ్‌లో పేర్కొన్నారు. అయితే ఈ డ్రోన్లు నల్లసముద్రాన్ని లక్ష్యంగా చేసుకున్నాయా లేదా జలాలపై ఎగురుతున్నాయా అనే అంశంపై స్పష్టత లేదు. ఎన్ని డ్రోన్లను కూల్చివేశాయి అని మాత్రమే రక్షణ శాఖ నివేదించింది. నల్లసముద్రంపై, ఇంధన లక్ష్యాలపై దాడులను నిలిపివేయడానికి రష్యా, ఉక్రెయిన్‌లతో అమెరికా మంగళవారం వేర్వేరు ఒప్పందాలను కుదుర్చుకున్న సంగతి తెలిసిందే. మాస్కోపై కొన్ని ఆంక్షలను ఎత్తివేయడానికి కూడా అంగీకరించింది.

నల్లసముద్రంపై ఒప్పందాలు ఎప్పుడు, ఏవిధంగా అమల్లోకి వస్తాయనే అంశంపై స్పష్టత లేదు.

## ట్రంప్ మరో సంచలన నిర్ణయం..

### ఎన్నికల్లో పౌరసత్వ రుజువుకు పెద్దపీట

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో సంచలన నిర్ణయం తీసుకున్నారు. అమెరికా ఎన్నికల ప్రక్రియలో భారీ మార్పులు చేస్తూ ఒక కార్యనిర్వాహక ఉత్తర్వుపై సంతకం చేశారు. దీనిలో ఓటరు నమోదు కోసం పౌరసత్వానికి సంబంధించిన ధ్రువపత్రాన్ని తప్పనిసరి చేశారు. ఇటువంటి మార్పులు చేర్పుల కారణంగా చట్టపరమైన సవాళ్లు ఎదురుకానున్నాయి. ట్రంప్ సంతకం చేసిన ఉత్తర్వులోని వివరాల ప్రకారం ఇంతవరకూ అమెరికాలో జరుగుతున్న ఎన్నికల ప్రక్రియలో అత్యవసమైన ఎన్నికల నిబంధనలను అమలు చేయడంలో విఫలమయ్యారని ఆరోపించారు. అలాగే ఓటరు జాబితాలను వెలువరించడంలో, ఎన్నికల సంబంధిత నేరాలను విచారించడానికి అందరూ సమాఖ్య సంస్థలకు సహకరించాలని ఆ ఉత్తర్వులో కోరారు. ఎన్నికల నిబంధనలను పాటించని రాష్ట్రాలు సమాఖ్య నిధులలో కోతలను ఎదుర్కోవలసి ఉంటుందని ఆ ఉత్తర్వులో హెచ్చరించారని ఎన్‌డీటీవీ తన కథనంలో పేర్కొంది. సమాఖ్య ఎన్నికలలో ఓటు వేసేందుకు పాస్‌పోర్ట్ వంటి పౌరసత్వ రుజువును తప్పనిసరి చేశారు. ఎన్నికల రోజు తర్వాత అందుకున్న మెయిల్-ఇన్ బ్యాలెట్‌లను రాష్ట్రాలు ఇకపై అంగీకరించకూడదని దీనిలో స్పష్టం చేశారు. ట్రంప్ ప్రభుత్వం తాము తీసుకున్న ఈ నిర్ణయం ఎన్నికల్లో అక్రమాలు, మోసాలను అరికట్టేందుకేనని పేర్కొంది. ముఖ్యంగా మెయిల్-ఇన్ ఓటింగ్ సందర్భంలో డాక్యుమెంట్ మోసాలు జరుగుతున్నాయని ట్రంప్ పేర్కొన్నారు. ఈ ఆర్డర్‌పై సంతకం చేస్తున్నప్పుడు ట్రంప్ అమెరికా ఎన్నికల్లో జరుగుతున్న అవకతవకలను ప్రస్తావించారు. ఈ తాజా ఉత్తర్వు ఇటువంటి అవకతవకలను అంతం చేస్తుందని పేర్కొన్నారు.

## బ్రిటన్ వీసా ఛార్జీల పెంపు




పర్యాటకులతోపాటు ఉన్నత చదువుల కోసం బ్రిటన్‌కు వెళ్లే విద్యార్థులపై మరింత ఆర్థికభారం పడనుంది. స్టూడెంట్, విజిటర్ సహా అన్ని కేటగిరీల వీసా ఫీజులను పెంచుతున్నట్లు బ్రిటన్ ప్రభుత్వం ప్రకటించింది. కొత్త ఛార్జీలు ఏప్రిల్ 9 నుంచి అమల్లోకి రానున్నాయి. ప్రస్తుతం ఆర్నెల్ల బ్రిటన్ వీసా ఫీజు 115 పౌండ్లు (రూ.12,770) ఉండగా.. పది శాతం పెరిగి 127 పౌండ్ల (రూ.14,103)కు చేరనుంది. రెండేళ్ల కాలపరిమితి వీసా రుసుము కూడా పెరిగింది. విద్యార్థి వీసాలపైనా ఈ పెరుగుదల ప్రభావం కనిపించనుంది. ప్రధాన దరఖాస్తుదారు సహా వారి డిపెండెంట్లు ప్రస్తుతం 490 (రూ.54,430) పౌండ్లు చెల్లించాల్సి ఉండగా.. త్వరలో అది 524 (రూ.58,192) పౌండ్లకు చేరనుంది. ఛైల్డ్ స్టూడెంట్ వీసాలకూ ఇదే పెంపు వర్తిస్తుంది. ఆరు నెలల నుంచి 11 నెలల స్వల్ప కాలపరిమితి ఇంగ్లిష్ కోర్సు చదివే విద్యార్థుల ఫీజు కూడా 14 పౌండ్లు పెరగనుంది.

# చక్కని ఆరోగ్యం

## పెదవులు ఎందుకు పగులుతాయి?



మామూలుగా శీతాకాలంలో చాలామందికి పెదవులు పగలడం మనం చూసే ఉంటాం. ఎక్కువ శాతం మందికి శీతాకాలంలోనే పెదవులు పగులుతూ ఉంటాయి. కానీ కొంతమందికి మాత్రం సీజన్ తో సంబంధం లేకుండా అన్ని రకాల సీజన్ లలో పెదవులు పగిలి ఒక్కోసారి రక్తం వచ్చి తీవ్ర ఇబ్బంది పెడుతూ ఉంటాయి. అయితే ఇలా పెదవులు పగిలినప్పుడు చాలామంది అనేక రకాల క్రీమ్లు జెల్ లు అప్లై చేస్తూ ఉంటారు. అవి కొద్దిసేపు మాత్రమే ఉండి ఆ తర్వాత మళ్లీ పెదవులు డ్రై గా మారుతూ ఉంటాయి. ఇలా పెదవులు డ్రైగా మారినప్పుడు కొంతమంది నాలుకతో తడి చేస్తూ ఉంటారు. అయితే ఇలా అస్సలు చేయకూడదని చెబుతున్నారు. శరీరంలో పోషకాలను లోపించినప్పుడు పెదవులు పగిలే అవకాశం ఉంటుందట. శరీరంలో ఎటువంటి పోషకాలు లోపించినప్పుడు పెదవులు పగులుతాయో ఇప్పుడు మనం తెలుసుకుందాం.. పెదవులపై చర్మం చాలా సున్నితంగా ఉంటుంది. అందుకే గాలి ఎక్కువగా వీచినా చలి పెట్టిన సూర్యరష్మి ఎక్కువగా ఉన్నా కూడా వెంటనే పెదవులు పగులుతూ ఉంటాయి. అంతర్గత పరిస్థితులు కూడా ఒక్కోసారి పెదవులపై ప్రభావాన్ని చూపిస్తూ ఉంటాయి. డిహైడ్రేషన్ కారణంగా కూడా పెదవులు ఇలా పగులుతూ ఉంటాయి. విటమిన్ బి లోపం వల్ల కూడా మన పెదవులు పగులుతుంటాయట. నవ్వుతున్నప్పుడు నోటి మూలల్లో పగుళ్లు కనిపిస్తే మాత్రం మీకు ఖచ్చితంగా విటమిన్ బి లోపం ఉన్నట్టే అంటున్నారు. విటమిన్ బి అనేది నీటిలో కరిగే విటమిన్ల సమూహం అని చెబుతున్నారు. ఇవి శరీరంలోని వివిధ కార్యకలాపాలకు చాలా అవసరం అని చెబుతున్నారు. మీ శరీరంలో ఈ, బి విటమిన్లు లేకపోతే మీ పెదవులు పొడిబారుతాయట. అలాగే విటమిన్ బి12 లోపం వల్ల కూడా పెదవుల పగుళ్లు, బొబ్బలు ఏర్పడతాయని చెబుతున్నారు. మాంసాహారులతో పోల్చుకుంటే శాఖాహారులకు విటమిన్ బీ 12 లోపం ఎక్కువగా ఉంటుందట. ఎందుకంటే విటమిన్ బి 12 ప్రధానంగా మాంసం లోనే కనిపిస్తుందని చెబుతున్నారు. పాల ఉత్పత్తులు గింజలు ఆకుకూరల్లో కూడా ఈ విటమిన్ బి12 ఉంటుంది. అదేవిధంగా విటమిన్ సి లోపం వల్ల కూడా జుట్టుకు, చర్మానికి సంబంధించిన సమస్యలు వస్తాయట. విటమిన్ సి కూడా మన పెదవులకు ఎంతో అవసరమైన పోషకం. అందుకే మీ శరీరంలో విటమిన్ సి లోపం ఉంటే పెదవులు పొడిబారుతాయట. అలాగే పగుళ్లు కూడా వస్తాయట. నారింజ, టాన్జేరిన్లు, నిమ్మకాయలు, ద్రాక్ష, టమోటాలు, బంగాళాదుంపలు, బ్రోకలీ, స్ట్రాబెర్రీ, క్యాప్సికమ్ వంటి సిట్రస్ పండ్లను తింటే విటమిన్ సి అందుతుందని చెబుతున్నారు. మన శరీరానికి అవసరమైన ముఖ్యమైన ఖనిజాల్లో జింక్ కూడా ఒకటి. ఇది మన పెదవులను ఆరోగ్యంగా, ఆకర్షణీయంగా ఉంచడంలో ఎంతగానో సహాయపడుతుందట. ఆరోగ్యకరమైన రోగనిరోధక వ్యవస్థకు జింక్ కూడా చాలా ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని, శరీరంలోని మిగిలిన భాగాలతో పాటుగా పెదవులు ఆరోగ్యంగా ఉండటానికి జింక్ సరఫరా అవసరం అని చెబుతున్నారు. అలాగే శరీరంలో ఐరన్ లోపించినప్పుడు కూడా పెదవులు పొడిబారుతాయట. కాబట్టి మీకు కూడా ఇలా పెదవులు పగులుతుంటే ఆయా విటమిన్లు కలిగిన ఆహార పదార్థాలు చేర్చుకోవడం వల్ల ఈ పెదవులు పొడిబారే సమస్య నుంచి ఈజీగా బయటపడవచ్చని చెబుతున్నారు.

## చేప కాదిది పోషకాల పుట్ట..!



పోనో చేపలోని ప్రోటీన్ కండరాల పెరుగుదలకు సహాయపడుతుంది. ఆకలిని నియంత్రిస్తుంది. ఎక్కువసేపు కడుపు నిండిన అనుభూతిని కలిగిస్తుంది. పిల్లల పెరుగుదల, ఆరోగ్యంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. ఆరోగ్యకరమైన గుండెకు ఒమేగా 3 కొవ్వు ఆమ్లాలు చాలా అవసరం. మన శరీరాలు ఒమేగా 3 కొవ్వు ఆమ్లాలను ఉత్పత్తి చేయవు. కాబట్టి, వాటిని సమతుల్య ఆహారం నుండి పొందేలా చూసుకోవడం చాలా ముఖ్యం. ఆరోగ్యం విషయానికి వస్తే వైద్యుల నుండి పోషకాహార నిపుణుల వరకు అందరూ ముందుగా కూరగాయలు, పండ్లు తినాలని సిఫార్సు చేస్తారు. కానీ, వీటిలో చికెన్, మటన్, చేపలు, రొయ్యలు వంటి సముద్ర ఆహారం కూడా మనకు కావాల్సిన పోషక వనరులు కలిగి ఉంటుంది. అయితే, మటన్ ఎక్కువగా తినడం వల్ల శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయిలు పెరుగుతాయి. అందుకే చాలా మంది చికెన్ ఎక్కువగా తినడానికి ఇష్టపడతారు. వివిధ పోషకాలతో సమృద్ధిగా ఉండే చేపలు, ఇతర సముద్ర ఆహారాలు కూడా మాంసాహార జాబితాలోకి చేరుస్తారు. ప్రతిరోజూ చేపలు తినడం వల్ల మొత్తం శారీరక పనితీరు మెరుగుపడుతుంది. వివిధ ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. ఇక్కడ మనం పోషకాలకు నిలయంగా పిలిచే ఒక చేప గురించి తెలుసుకోబోతున్నాము. పోనో చేప.. ఇది మనకు కావాల్సిన పోషకాల నిధిగా పిలుస్తారు. దీంతో మనిషి శరీరం, ఆరోగ్యానికి అవసరమైన విటమిన్లు, ఖనిజాలు, రోగనిరోధక శక్తి, చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరిచే లక్షణాలు సమృద్ధిగా నిండివుంటాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. పోనో చేపలో కాల్షియం, భాస్వరం పుష్కలంగా ఉంటాయి. ఇది ఎముకలు, దంతాలకు మంచిది. పోనో చేపలో ప్రోటీన్, విటమిన్ ఎ, విటమిన్ డి, కాల్షియం, భాస్వరం, అయోడిన్, మెగ్నీషియం, సెలీనియం కూడా పుష్కలంగా ఉన్నాయి. పోనో చేపలో ఉండే విటమిన్ ఎ, దృష్టిని పదునుపెడుతుంది. కంటి ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. అదనంగా, ఇది కంటి రెటీనా, బయటి పొరను ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది. అంతేకాదు..పోనో చేపలో విటమిన్ ఇ పుష్కలంగా ఉండటం వల్ల ఇది చర్మ ఆరోగ్యాన్ని కాపాడుతుంది. వృద్ధాప్య సంకేతాలను దూరం చేస్తుంది. అదనంగా రోగనిరోధక శక్తిని మెరుగుపరచడానికి విటమిన్ జు కూడా అవసరం. పోనో చేపలోని ప్రోటీన్ కండరాల పెరుగుదలకు సహాయపడుతుంది. ఆకలిని నియంత్రిస్తుంది. ఎక్కువసేపు కడుపు నిండిన అనుభూతిని కలిగిస్తుంది. పిల్లల పెరుగుదల, ఆరోగ్యంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. ఆరోగ్యకరమైన గుండెకు ఒమేగా 3 కొవ్వు ఆమ్లాలు చాలా అవసరం. మన శరీరాలు ఒమేగా 3 కొవ్వు ఆమ్లాలను ఉత్పత్తి చేయవు. కాబట్టి, వాటిని సమతుల్య ఆహారం నుండి పొందేలా చూసుకోవడం చాలా ముఖ్యం. ఇది మెదడు పనితీరు, జ్ఞానాన్ని మెరుగుపరచడంలో సహాయపడుతుంది. దాదాపు 100 గ్రాముల పోనో చేప 106 కేలరీలను అందిస్తుందని చెబుతారు. అందువల్ల ఇది పిల్లల నుండి పెద్దల వరకు అందరికీ మంచి పోషకాహార వనరుగా పరిగణించబడుతుంది.



## అలోవెరా జెల్ కొంటున్నారా..?

మీరు అలోవెరా జెల్‌ను ఎంచుకుంటే అది ఎలాంటి సువాసనను కలిగి ఉండదని గుర్తుంచుకోండి. ఎందుకంటే నిజమైన అలోవెరా జెల్‌కు ఎటువంటి సువాసన లేదా వాసన ఉండదు. ప్రజలు తమ చర్మ సంరక్షణ దినచర్యలో అనేక విషయాలను చేర్చుకుంటారు. అందులో ఒకటి అలోవెరా జెల్. ఇది మీ చర్మాన్ని సహజంగా ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది. చర్మంపై తేమను ఎక్కువ కాలం ఉంచుతుంది. అంతేకాకుండా ఇది మీ చర్మం ఛాయను కూడా మెరుగుపరుస్తుంది. ఇది కాకుండా అలోవెరా జెల్.. చికాకు లేదా వడదెబ్బకు కూడా చికిత్స చేస్తుంది. మార్కెట్లో అనేక రకాల అలోవెరా జెల్స్ అందుబాటులో ఉన్నాయి. వాటిలో కొన్ని నకిలీవి. ఇవి మీ చర్మానికి హాని కలిగిస్తాయి. ఇటువంటి పరిస్థితిలో సరైన అలోవెరా జెల్‌ను ఎంచుకోవడం చాలా ముఖ్యం. మీరు అలోవెరా జెల్‌ను ఎంచుకుంటే అది ఎలాంటి సువాసనను కలిగి ఉండదని గుర్తుంచుకోండి. ఎందుకంటే నిజమైన అలోవెరా జెల్‌కు ఎటువంటి సువాసన లేదా వాసన ఉండదు. దుకాణంలో కొనుగోలు చేసిన అలోవెరా జెల్‌లో పూల, తీపి లేదా ఔషధ సువాసన ఉంట, అది కలబంద గుజ్జు కాదని, సింథటిక్ సువాసనలు, సంకలనాలు జోడించారని అర్థం చేసుకోవాలి. అలోవెరా జెల్‌కి జోడించిన సింథటిక్ సువాసన కూడా చర్మం చికాకును కలిగిస్తుంది. కొన్నిసార్లు అలోవెరా జెల్‌లో ప్రిజర్వేటివ్స్ జోడిస్తారు. కాబట్టి అవి చాలా కాలం పాటు సురక్షితంగా ఉంటాయి. అలోవెరా జెల్‌లో ఉపయోగించే ప్రిజర్వేటివ్‌లు సహజంగా ఉంటే దాని గరిష్ట షెల్ఫ్ జీవితం 12 నెలలు ఉంటుంది. కాబట్టి ఉపయోగించిన సంరక్షణకారుల రకం కోసం లేబుల్‌ను తనిఖీ చేయండి. మార్కెట్‌లో లభించే అనేక అలోవెరా జెల్స్ ఆకుపచ్చ లేదా పసుపు రంగులో ఉంటాయి. ఇవి నిజమైన రంగులు కావు.

ఉత్పత్తులను ఆకర్షణీయంగా మార్చడానికి కృత్రిమ రంగులు యాడ్ చేస్తారు. ఆకుల నుండి లభించే స్వచ్ఛమైన కలబంద సారం రంగులేనిది. కాబట్టి మీరు దుకాణం నుండి కొనుగోలు చేసే జెల్‌లో ఎలాంటి రంగులు లేవని నిర్ధారించుకున్న తర్వాతే కొనుగోలు చేయాలి.

## పెరుగు తినేటప్పుడు ఈ తప్పులు చేస్తే ఆరోగ్యానికి ముప్పు..!

పెరుగు ఆరోగ్యానికి మేలు చేసే ఆహారం. ఇది జీర్ణక్రియను మెరుగుపరిచే ప్రోబయోటిక్స్‌ను కలిగి ఉంది. కానీ పెరుగును తినేటప్పుడు కొన్ని తప్పులు చేస్తే ఆరోగ్య సమస్యలు ఎదురవచ్చు అంటున్నారు వైద్య నిపుణులు. సరైన విధంగా పెరుగును తీసుకోవడం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. పెరుగు అనేది ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే ఆహారం. ఇది శరీరాన్ని చల్లబరిచే గుణాలు కలిగి ఉండటంతో వేసవిలో చాలామంది దీనిని అధికంగా తింటారు. అంతేకాదు ప్రొబయోటిక్ లక్షణాలతో జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. అయితే పెరుగును తినేటప్పుడు కొన్ని ముఖ్యమైన జాగ్రత్తలు తీసుకోకపోతే కొన్ని ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయి. ఉదయాన్నే నేరుగా పెరుగును తీసుకోవడం కొందరికి అలవాటు. అయితే ఇది ఆరోగ్యానికి మంచిది కాదు. ఎందుకంటే ఖాళీ కడుపుతో పెరుగును తీసుకోవడం వల్ల పేగుల్లో అనవసరమైన బ్యాక్టీరియాలు పెరిగే అవకాశం ఉంది. ఇది జీర్ణ సమస్యలకు దారి తీస్తుంది. కాబట్టి పెరుగును మధ్యాహ్నం లేదా భోజనంతో పాటు తీసుకోవడం ఉత్తమం. చాలా మంది పెరుగును పాలతో కలిపి తింటుంటారు. కానీ ఇది జీర్ణ వ్యవస్థకు భారమయ్యే అవకాశం ఉంది. పెరుగులో మంచి బ్యాక్టీరియాలు ఉన్నప్పటికీ పాలతో కలిపి తీసుకోవడం వల్ల బ్లోటింగ్, ఎసిడిటీ సమస్యలు రావచ్చు. కాబట్టి పెరుగును నీటితో కలిపి మజ్జిగగా తాగడం ఉత్తమం. చాలా మంది పెరుగును తినేటప్పుడు ఉప్పు లేదా చక్కెర కలుపుతారు. కానీ ఇది ఆరోగ్యానికి మంచిది కాదు. ఉప్పు కలిపితే పెరుగులోని ప్రొబయోటిక్ లక్షణాలు తగ్గిపోతాయి. అదే విధంగా చక్కెర కలిపితే డైజెషన్ సమస్యలు ఏర్పడే అవకాశం ఉంటుంది. తీపి కావాలనుకుంటే ప్రాసెస్డ్ షుగర్ కంటే బెల్లం లేదా తేనె కలిపి తినడం ఉత్తమం. కొంతమంది పెరుగులో అరటిపండు, మామిడిపండు, స్ట్రాబెర్రీ వంటి పండ్లు కలిపి తింటారు.



అయితే ఇది శరీరానికి అంత మంచిది కాదు. పెరుగులో చల్లని లక్షణాలు ఉంటాయి, కానీ మామిడిపండు వేడిగా పనిచేస్తుంది. ఈ రెండింటిని కలిపితే జీర్ణకోశంలో అసమతుల్యత ఏర్పడే అవకాశం ఉంది.

అలాగే ఉల్లిపాయ లేదా దోసకాయతో కలిపి తింటే జీర్ణ సమస్యలు తలెత్తే అవకాశముంది. కాబట్టి పెరుగును ఇతర పదార్థాలతో కలపకుండా ప్రత్యేకంగా తినడం ఉత్తమం. కొందరికి రాత్రిపూట పెరుగును తినే అలవాటు ఉంటుంది. అయితే పెరుగులో చల్లబరిచే గుణాలు ఉండటంతో ఇది శరీరంలోని కఫాన్ని పెంచుతుంది. దీని వల్ల శ్వాసకోశ సమస్యలు, దగ్గు, జలుబు సమస్యలు అధికంగా వచ్చే అవకాశం ఉంది. రాత్రిపూట పెరుగును మజ్జిగగా మార్చి తాగితే మాత్రం హానికరం కాదు. కొంతమంది వంటలలో పెరుగును వేడి చేస్తారు. కానీ పెరుగును వేడిచేస్తే అందులోని ప్రొబయోటిక్స్ నాశనమైపోతాయి. ఇది జీర్ణ సమస్యలకు కారణమవుతుంది. కాబట్టి పెరుగును ఎప్పుడూ సహజస్థితిలోనే తినడం ఉత్తమం.

## శనగలు, బెల్లం కలిపి తింటే

### శరీరంలో ఏం జరుగుతుందంటే..

[illegible] దాగివున్నాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. వేయించిన శనగలు, బెల్లం కలిపి తినటం వల్ల శరీరానికి కావాల్సిన పోషక విలువ ఎన్ని ఉన్నాయో తెలిస్తే నిజంగా ఆశ్చర్యపోతారు. ప్రతి ఇంట్లోనూ బెల్లం, శనగలు తప్పనిసరిగా ఉండే ఆహార పదార్థాలు. బెల్లం, శనగలను కలిపినపుడు అది విటమిన్లు, ఖనిజాలతో నిండిన మంచి పౌష్టికాహారం అవుతుంది. వేయించిన శనగల్లో ప్రోటీన్స్ పుష్కలంగా ఉంటాయి. బెల్లం యాంటీ యాక్సిడెంట్లతో నిండి ఉంటుంది. బెల్లంలో జింక్, సెలీనియంలు ఎక్కువగా ఉంటాయి. వేయించిన శనగలు విటమిన్ బి6, విటమిన్ సి, ఫోలేట్, నియాసిన్, థియామిన్,



రిబోఫ్లేవిన్, మాంగనీస్, ఐరన్ ఇలా ఎన్నో విటమిన్స్ ఉంటాయి. రక్తహీనత లేదా కడుపు సంబంధిత సమస్యలతో బాధపడుతున్న వారిని శనగలు, బెల్లం కలిపి తినాలని నిపుణులు చెబుతున్నారు. పప్పులో ఫైబర్ పుష్కలంగా ఉన్నప్పటికీ, ఇందులో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. రెండింటినీ కలిపి తినడం మంచిది. ఇది శరీరంలోని ప్రతి బలహీనతను తొలగిస్తుంది. జీవక్రియను మెరుగుపరుస్తుంది. బెల్లం, వేయించిన శనగలు రెండూ జింక్‌తో నిండి ఉంటాయి, ఇది శరీరంలో 300 ఎంజైమ్‌లను యాక్టివేట్ చేస్తుంది. ఇది రోగనిరోధక శక్తిని పెంచుతుంది. శ్వాస సంబంధిత సమస్యలతో బాధపడేవారికి ఈ రెండు కలిపి తింటే మంచిది. వారు పడుకునే ముందు రాత్రి కొంచెం వేపిన శనగలు, బెల్లంలను పాలతో కలిపి తీసుకోవాలి. ఇది మీ ఊపిరితిత్తులను శుభ్రం చేయడానికి మరియు కాలుష్య సంబంధిత వ్యాధుల నుండి త్వరగా కోలుకోవడానికి సహాయపడుతుంది. బెల్లంలోని ఐరన్, శనగల్లోని ప్రోటీన్, రుతుస్రావం సమయంలో స్త్రీ రక్తం కోల్పోడానికి, తమను తాము తిరిగి శక్తివంతం చేసుకోవడానికి ఈ పోషకాలు రెండూ ముఖ్యమైనవి. దీనిలో ఉన్న పొటాషియం వాళ్ళ స్ట్రోక్, గుండెపోటు వంటి కార్డియాక్ సిస్టమ్ కు సంబంధించిన సమస్యలు రాకుండా సాయపడుతుంది. బరువు తగ్గాలనుకునే వారికి ఈ ఫుడ్ బెస్ట్ ఆప్షన్. బెల్లం,శనగలు కలిపి తినడం వల్ల మీ జీవక్రియను పెంచుతుంది. ఉబకాయంతో బాధపడేవారిలో బరువు తగ్గడానికి సాయపడుతుంది.

## ఆహారం తిన్న వెంటనే గ్యాస్ సమస్య వస్తుందా?

చాలా మంది తిన్న వెంటనే కడుపులో తీవ్రమైన గ్యాస్ ఏర్పడే సమస్యతో బాధపడుతుంటారు. ఇది ఎవరికైనా వచ్చే సమస్య. దీని వెనుక అనేక కారణాలు ఉండవచ్చు. ఇటువంటి పరిస్థితిలో ఆయుర్వేదంలో కొన్ని సుగంధ ద్రవ్యాలు ఉన్నాయి. చాలా మంది తిన్న వెంటనే కడుపులో తీవ్రమైన గ్యాస్ ఏర్పడే సమస్యతో బాధపడుతుంటారు. ఇది ఎవరికైనా వచ్చే సమస్య. దీని వెనుక అనేక కారణాలు ఉండవచ్చు. ఇటువంటి పరిస్థితిలో ఆయుర్వేదంలో కొన్ని సుగంధ ద్రవ్యాలు ఉన్నాయి. వీటిని వాడటం వల్ల ఈ సమస్య నుండి తక్షణ ఉపశమనం లభిస్తుంది. జీర్ణక్రియను మెరుగుపరచడంలో సెలెరీ సహాయపడుతుంది. ఇది గ్యాస్, ఉబ్బరం సమస్యను తగ్గించడంలో కూడా సహాయపడుతుంది. కడుపు మంటను తగ్గించే యాంటీ ఇన్ఫ్లమేటరీ, యాంటీ–స్పాస్మోడిక్ లక్షణాలు సెలెరీలో కనిపిస్తాయి. సోంపులో అనెథోల్ అనే మూలకం ఉంటుంది. ఇది జీర్ణవ్యవస్థను శాంతపరచడంలో సహాయపడుతుంది. సోంపు పేగు కండరాలను కూడా సడలిస్తుంది. తద్వారా పేగులను బలోపేతం చేస్తుంది. సోంపు తీసుకోవడం వల్ల గ్యాస్, ఉబ్బరం సమస్య నుండి ఉపశమనం లభిస్తుంది. గ్యాస్, అపానవాయువు సమస్యను తగ్గించడంలో జీలకర్ర కూడా చాలా సహాయపడుతుంది. జీలకర్ర తీసుకోవడం వల్ల మలబద్ధకం నుండి ఉపశమనం లభిస్తుంది. జీలకర్రలో అపానవాయువు నిరోధక లక్షణాలు ఉన్నాయి. ఇవి అపానవాయువు నుండి ఉపశమనం కలిగిస్తాయి. అల్లంలో జింజెరాల్ అనే మూలకం ఉంటుంది.

ఇది జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. ఇది గ్యాస్, ఉబ్బరాన్ని తగ్గించడంలో కూడా చాలా ప్రభావవంతంగా ఉంటుంది. ఇంగువలో యాంటిస్పాస్మోడిక్ లక్షణాలు ఉన్నాయి. ఇది కడుపు కండరాలను సడలించడంలో సహాయపడుతుంది. ఇది గ్యాస్, ఉబ్బరం తగ్గించడంలో కూడా సహాయపడుతుంది.

# సినిమా

## ‘ఓ భామ అయ్యో రామ’ టీజర్ విడుదల

సుహాస్, మాళవిక మనోజ్ జంటగా రామ్ గోదల తెరకెక్కిస్తున్న చిత్రం ‘ఓ భామ అయ్యో రామ’. హరీశ్ నల్ల నిర్మాత. తాజాగా ఈ సినిమా టీజర్ లాంచ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్రబృందం సినిమా విశేషాలు ముచ్చటించింది. సుహాస్ మాట్లాడుతూ, ‘దీని స్టోరీ చాలా బాగుంటుంది. సెకండ్ హాఫ్‌లో ట్విస్ట్ అందరినీ ఆకట్టుకుంటుంది. భావోద్వేగాలు ఉన్నాయి. ఈ స్టోరీని అందరూ ఎంజాయ్ చేస్తారు’ అన్నారు. దర్శకుడు రామ్ మాట్లాడుతూ ‘ఇందులో హీరో పేరు రామ్.. హీరోయిన్ పేరు సత్య. నా రియల్ లైఫ్‌లో జరిగిన కొన్ని సంఘటనలు ఇందులో కొన్ని ఉన్నాయి. కథ రాసుకునేటప్పుడే సుహాస్ హీరో అయితే బాగుండని అనుకున్నాను. ఈ పాత్రకు ఆయన సరిపోతారు. కథ బాగుంటే తెలుగు ఆడియన్స్ ఎప్పుడూ ఆదరిస్తారు. ఈ సినిమాను కూడా ఆదరిస్తారు’ అన్నారు. నిర్మాత హరీశ్ మాట్లాడుతూ ‘ఒక సినిమా తెరకెక్కిస్తున్నప్పుడే అది హిట్ అవుతుందా లేదా అని అర్థమవుతుంది. ఇది అలాంటి సినిమానే. అందుకే దీని కోసం ఎక్కడా రాజీ పడకుండా ఖర్చుపెట్టాం’ అన్నారు. హీరోయిన్ మాళవిక మనోజ్ మాట్లాడుతూ ‘నా పాత్ర పేరు సత్యభామ. ఇలాంటి సినిమాలో ఇప్పటి వరకూ నటించలేదు. టాలీవుడ్ ఇండస్ట్రీ చాలా పెద్దది. గొప్ప సినిమాలు ఇక్కడి నుంచే వస్తున్నాయి’ అని చెప్పారు.








## పాపం.. నాని కష్టం మాములుగా లేదు.. మధ్యాహ్నం సమయంలో వర్కవుట్స్

నేచురల్ స్టార్ నాని ఎలాంటి బ్యాక్ గ్రౌండ్ లేకుండా ఇండస్ట్రీకి వచ్చాడు. తన టాలెంట్‌తోనే స్టార్ హీరోగా ఎదిగాడు. ఇప్పుడు నిర్మాతగాను సత్తా చాటుతున్నాడు. అయితే నానికి సంబంధించిన ఓ ఆసక్తికర విషయం ఇప్పుడు వెలుగులోకి వచ్చింది. తన ఫిజిక్‌ని కాపాడుకునేందుకు నాని ఎంత కష్టపడతాడు అనే విషయం ఇప్పుడు నెట్టింట తెగ హల్చల్ చేస్తుంది. తాజాగా హీరో నాని డైట్ గురించి ఫిట్‌నెస్ క్రియేటర్ అండ్ కోచ్ అయిన విశ్వ భరత్ కొన్ని ఆసక్తికర విషయాలు తెలియజేశారు. ఓ పాడ్ కాస్ట్ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ నాని ప్రతి రోజు కూడా 12.30 గంటలకి నిద్రలేచి ఒంటి గంటకి వర్కౌట్లు మొదలుపెడతారు. అనంతరం 300-400%ఎత్రీ% ఫ్రూట్ జ్యూస్ తీసుకుంటారు. ఆ జ్యూస్‌లో కొద్దిగా ఉప్పు కలుపుకుంటారు. ఆ తర్వాత పలు సప్లిమెంటరీలు తీసుకుంటారు. నాలుగు గంటల సమయంలో సాధారణ తెలుగు భోజనం చేస్తారు. ఇందులో 60 గ్రాముల రా రైస్, టమాటా లేదా తోటకూరతో కలిపి వండిన 50 గ్రాముల పప్పు, చిక్కుడుకాయ, బీరకాయ, బెండకాయ ఇలా కూరగాయలతో వండిన ఓ కూర, 150 గ్రాముల చికెన్, ఇంకా ఎగ్స్ వంటివి ఉంటాయని తెలిపారు. ఇలా భోజనం తీసుకోవడం వలన 800-900 గ్రాముల క్యాలరీస్, 60-70 గ్రాముల ప్రొటీన్ వస్తుంది. ఇక రాత్రి 9 గంటల సమయంలో ఓ ఫ్రూట్ బౌల్ లేదా 200 గ్రాముల చికెన్, ఫిష్ తీసుకుంటారు. రోజంతా హైడ్రేట్‌గా ఉండేందుకు సుమారు 4లీటర్ల నీళ్లు తాగుతారు అని చెప్పుకొచ్చారు విశ్వ భరత్. అయితే విశ్వ చెప్పిన మాటలని బట్టి చూస్తుంటే నాని ఎక్కువగా రాత్రి షూటింగ్స్‌లో పాల్గొంటారని, ఉదయం అంతా పడుకొని మధ్యాహ్నం నిద్ర లేచి వర్కవుట్స్ చేస్తారని అర్థమవుతుంది. నాని తీసుకునే డైట్ బాగుంది కానీ వేళాపాళా లేకుండా నిద్రలేవడం, తినడం మాత్రం అంత పర్‌ఫెక్ట్ అనిపించడం లేదని కొందరు కామెంట్స్ చేస్తున్నారు. ఇక ఇదిలా ఉంటే నాని సమర్పణలో రూపొందిన కోర్ట్ చిత్రం ఎంత పెద్ద హిట్ అయిందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఇక నాని ప్రధాన పాత్రలో ది ప్యారడైజ్ చిత్రం రూపొందుతుండగా, ఇది నాని కెరీర్‌లో బిగ్గెస్ట్ హిట్‌గా మారుతుందని కొందరు భావిస్తున్నారు. మరోవైపు హిట్ 3 కూడా చేస్తున్నాడు నాని.



## ‘బ్యూటీ’ భామ నీలఖికి యంగ్ సెన్సేషన్ అవార్డు

బ్యూటీ’ అనే చిత్రంతో నీలఖి త్వరలో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఈ సినిమాను గీతా సుబ్రమణ్యం, ‘హలో వరల్డ్’ ఫేమ్ వర్ధన్ దర్శకత్వంలో రూపొందిస్తున్నారు. ఈ చిత్రంలో అంకిత్ కొయ్య హీరోగా, నీలఖి హీరోయిన్‌గా నటించారు. నీలఖి తెలుగు సినిమా పరిశ్రమలోకి అడుగుపెట్టకముందే ఒడిశాలో తన ప్రతిభను చాటుకున్నారు. ఒడిశాలోని ప్రముఖ ఛానెల్ తరంగ్ టీవీ నిర్వహించిన ‘తరంగ్ సినీ ఉత్సవ్’ కార్యక్రమంలో ‘యంగ్ సెన్సేషన్ ఆఫ్ ది ఇయర్ - డెబ్యూ ఫీమేల్’ విభాగంలో నీలఖి అవార్డును గెలుచుకున్నారు. తెలుగు ప్రేక్షకులను కూడా తన నటనతో ఆకట్టుకుంటారని ‘బ్యూటీ’ టీమ్ గట్టి విశ్వాసంతో ఉంది. ఇప్పటికే విడుదలైన ‘బ్యూటీ’ సినిమా పోస్టర్లు, టీజర్‌లో నీలఖి అందరి దృష్టిని ఆకర్షించారు. ఆమె నటనలో భావోద్వేగాలను అద్భుతంగా పండించారని టీమ్ గతంలోనే వెల్లడించింది. ‘బ్యూటీ’ చిత్రంతో నీలఖి తెలుగు సినిమా పరిశ్రమలోకి ఘనంగా అడుగుపెట్టేందుకు సిద్ధమయ్యారు. ఈ సినిమా త్వరలో థియేటర్లలో విడుదల కానుంది. వానరా సెల్యులాయిడ్ బ్యానర్‌పై మారుతి టీమ్‌తో కలిసి జీ స్టూడియోస్ సమర్పిస్తోన్న ఈ చిత్రానికి అడిదాల విజయపాల్ రెడ్డి, ఉమేష్ కేఆర్ బన్సాల్ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు.

## ప్రభాస్ హీరోయిన్‌కు ‘తెలుగు’ క్లాసులు



సినిమాల్లో అనుకున్నంతగా సక్సెస్ కాకపోయినా సోషల్ మీడియాలో సూపర్ పాపులారిటీ ఉన్న అందాల భామల్లో మాళవిక మోహనన్ ఒకరు. ఉత్తరాదికి దిశా పటాని ఎలాగో దక్షిణాదికి మాళవిక అలా అని చెప్పొచ్చు. హాట్ హాట్ ఫొటో షూట్లతో కుర్రకారుకు కిర్రెక్కిస్తూ మిలియన్ల కొద్దీ ఫాలోవర్లను సంపాదించుకుంది మాళవిక. కానీ ఆమె కోరుకున్న బ్లాక్ బస్టర్ సక్సెస్ మాత్రం ఇంకా దక్కలేదు. ఇప్పటిదాకా ఆమె నటించిన చిత్రాలు నిరాశనే మిగిల్చాయి. ఈ స్థితిలో తన ఆశలన్నీ ప్రభాస్ మూవీ ‘రాజా సాబ్’ మీదే ఉన్నాయి. ఈ సినిమా తన కెరీర్‌కు గేమ్ చేంజర్ అవుతుందని ఆమె ఆశిస్తోంది. ఇందులో మాళవిక సొంతంగా డబ్బింగ్ కూడా చెప్పబోతున్నట్లు తెలుస్తోంది. ఇందుకోసం ఆమె తెలుగు క్లాసులు కూడా తీసుకుంటోందట. ఓ ఇంటర్వ్యూలో మాళవిక మాట్లాడుతూ.. ఏ ఇండస్ట్రీలో నటించినా ఆ భాష నేర్చుకుంటే మెరుగ్గా నటించడానికి అవకాశముంటుందని చెప్పింది. అందులోనూ తెలుగు ఇండస్ట్రీ ఎంతో ఎదిగిపోయిందని.. బాలీవుడ్‌తో సమానమైన ఇండస్ట్రీ అదని.. అలాంటపుడు ఆ భాష నేర్చుకుని నటిస్తే మంచిది కదా అని ఆమె వ్యాఖ్యానించింది. అందుకే తెలుగు క్లాసులు తీసుకుని ఆ భాష మీద పట్టు సంపాదిస్తున్నట్లు చెప్పింది. ఇక ప్రభాస్ గురించి మాట్లాడుతూ.. అతను చాలా రిజర్వ్డ్ పర్సన్ అని.. తన చుట్టూ ఉన్న తక్కువ మందితో మాత్రమే మాట్లాడతాడని మాళవిక వ్యాఖ్యానించింది. ప్రభాస్ వ్యక్తిగా చాలా మంచి వాడని.. తనతో పని చేయడం మంచి అనుభవమని తెలిపింది.




## డేవిడ్ వార్నర్‌కి తెలుగు క్లాసులు చెప్పిన నితిన్, శ్రీలీల..

ఆస్ట్రేలియా క్రికెటర్ డేవిడ్ వార్నర్‌కు తెలుగు క్లాసులు తీసుకున్నారు నటులు నితిన్, శ్రీలీల. వీరిద్దరు జంటగా నటిస్తున్న తాజా చిత్రం ‘రాబిన్‌హుడ్’ ఈ సినిమాకు వెంకీ కుడుముల దర్శకత్వం వహిస్తుండగా.. మైత్రీ మువీ మేకర్స్ నిర్మిస్తుంది. వెన్నెల కిషోర్, రాజేంద్ర ప్రసాద్, డేవిడ్ వార్నర్, తదితరులు ఈ సినిమాలో కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రం మార్చి 28న ప్రేక్షకుల ముందుకు రానుంది. అయితే ఈ మూవీ ప్రీ రిలీజ్ వేడుకను ఇటీవల హైదారాబాద్‌లో నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ వేడుకకు క్రికెటర్ డేవిడ్ వార్నర్ ముఖ్య అతిథిగా వచ్చి సినిమా విజయవంతం కావాలని కోరుకోవడంతో పాటు తెలుగులో మాట్లాడి అందరిని అలరించారు. అయితే డేవిడ్ తెలుగులో మాట్లాడటానికి నితిన్, శ్రీలీల ఏ విధంగా సాయం చేశారో చూపిస్తూ.. ఒక ఫన్నీ వీడియోను విడుదల చేసింది చిత్రబృందం. తెలుగు నేర్చుకుంటున్న డేవిడ్ వీడియోను మీరు చూసేయండి.

# ప్రజాప్రతినిధులు లేని పాలన ఇంకెన్నాళ్లు?

**ముంబై:** దేశంలోనే అత్యధిక ఆదాయాన్ని కలిగిన ముంబై మున్సిపల్ కార్పొరేషన్(బీఎంసీ)కు గత మూడేళ్లుగా ఎన్నికలు జరగలేదు. దీంతో మూడేళ్లుగా ప్రజాప్రతినిధులు లేకుండానే మున్సిపల్ కమిషనర్ల ఆధ్వర్యంలో కార్పొరేషన్ పరిపాలన కార్యకలాపాలు జరుగుతున్నాయి.

**రాజకీయ పరిణామాల రీత్యా...వాయిదా**

2022, మార్చి 7న మున్సిపల్ కార్పొరేటర్ల పదవీకాలం ముగిసింది. వెంటనే ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్నా ఎప్పటికప్పుడు మారుతున్న రాజకీయ సమీకరణాల కారణంగా వాయిదాపడుతూ వచ్చాయి. గత మూడేళ్లలో, ముంబై మున్సిపల్ కార్పొరేషన్ పరిపాలన బాధ్యతలను మొదట ఇక్బాల్ సింగ్ చాహల్ ఆ తరువాత భూషణ్ గగ్రానీ స్వీకరించారు. ఈ మూడేళ్లలో వీరిద్దరూ మున్సిపల్ కమిషనర్లు స్వయంగా మూడు బడ్జెట్లను సమర్పించారు. ఆర్థిక సంవత్సరానికి అనుగుణంగా నగరానికి అవసరమైన అభివృద్ధి పనులను చేపట్టారు. మున్సిపల్ ఎన్నికలు జరగకపోయినా మూడేళ్ల వ్యవధిలో రూ.6,000 కోట్ల విలువైన వివిధ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు గ్రీన్‌సిగ్నలిచ్చారు. ముఖ్యంగా రోడ్లు, మురుగునీటి శుద్ధి, డీశాలినేషన్ ప్రాజెక్టులు, దహిసర్%-%భయందర్ లింక్ రోడ్డులకు అనుమతులు మంజూరుచేశారు.

**ప్రభుత్వ అప్పుల పెరుగుదల....**

2024%-%25 ఆర్థిక సంవత్సరానికి మున్సిపల్ కార్పొరేషన్ అప్పులు రూ.1.90 లక్షల కోట్లుగా తేలింది. తాజా లెక్కల ప్రకారం, ఈ సంఖ్య రూ.2,32 లక్షల కోట్లకు చేరుకుంది. ప్రజా ప్రతినిధులు లేకపోవడంతో, బడ్జెట్ వ్యయంపై బహిరంగ చర్చ జరగలేదు.

**కమిషనర్లు పరిపాలించడమేమిటి?**



కమిషనర్ల ఆధ్వర్యంలో బీఎంసీ పరిపాలన జరగడమేమిటంటూ విపక్ష పార్టీలు విమర్శిస్తున్నాయి. ప్రజా ప్రతినిధులు లేని పాలన ప్రజాస్వామిక విధానాలకు విరుద్ధమని, ప్రజల అభిప్రాయాలను పట్టించుకోకుండా కీలక నిర్ణయాలు అమలవుతున్నాయని ఆరోపిస్తున్నాయి. మున్సిపల్ పాలనలో పారదర్శకత లేదని, పెద్ద మొత్తంలో నిధులు ఖర్చవుతున్నాయని మండిపడుతున్నాయి.

**మరో 6-7 నెలల తర్వాతే!**

ప్రస్తుత పరిస్థితి దృష్ట్యా ఎన్నికలు మరో 6-7 నెలలు ఆలస్యమయ్యే అవకాశం ఉంది. 1984లో అప్పటి కమిషనర్ డి.ఎం.సుక్తాంకర్ కార్యనిర్వాహక పాలన తర్వాత మళ్లీ 38 ఏళ్లకు ముంబై మున్సిపల్ కార్పొరేషన్‌లో ప్రజాప్రతినిధులు లేకుండా పాలన జరుగుతోంది. అయితే ఈసారి ఇది మరింత ఎక్కువ కాలం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో నగర అభివృద్ధి, ప్రజల అవసరాలను పరిగణనలోకి తీసుకుని త్వరలో ఎన్నికలు నిర్వహించాలని పలువురు నాయకులు, రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## సుపారీ తీసుకున్నారేమో?
## కునాల్ వ్యాఖ్యలపై షిండే



**ముంబై:** స్టాండప్ కమెడియన్ కునాల్ కామ్రా తనపై చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే తొలిసారి స్పందించారు. ఆయన (కునాల్) సెటైర్‌ను తాను అర్థం చేసుకోగలనని, కానీ దేనికైనా ఒక పరిమితి ఉంటుందని అన్నారు. కునాల్ వ్యాఖ్యలు చూస్తుంటే ఒకరి తరఫున సుపారి (కాంట్రాక్ట్) తీసుకుని వేరే వారి గురించి తప్పుగా మాట్లాడినట్టు కనిపిస్తోందని షిండే అన్నారు. తన మాట ఎలా ఉన్నా ఇదే వ్యక్తి ప్రధానమంత్రి పైన, సుప్రీంకోర్టు పైన, పాత్రికేయుడు అర్నాబ్ గోస్వామిపైన, మరి కొందరు పారిశ్రామికవేత్తలపై కూడా గతంలో కామెంట్లు చేశారని గుర్తుచేశారు. దీనిని భావ ప్రకటనా స్వేచ్ఛ అనరని, ఎవరి తరఫునో మాట్లాడి ఉంటారని అన్నారు. హాబిటంట్ వేదికను పార్టీ కార్యకర్తలు ధ్వంసం చేయడంతో షిండే మాట్లాడుతూ, అవతల వ్యక్తులు కూడా ఒక పద్ధతిగా వ్యవహరించాల్సి ఉంటుందని, అలాకాకుంటే ప్రతి యాక్షన్‌కు ఒక రియాక్షన్ ఉంటుందని వ్యాఖ్యానించారు. కాగా, ప్రముఖ వ్యక్తులపై జోక్స్ వేసే హక్కు తనకు ఉందని, తన కామెంట్లకు క్షమాపణ చెప్పేది లేదని కునాల్ ఇంతకుముందు వివరణ ఇచ్చారు. చట్టపరంగా సహకరించేందుకు సిద్ధంగా ఉన్నానని చెప్పారు. ఈ నేపథ్యంలో ఆయనపై నమోదైన కేసులో తమ ముందు హాజరుకావాలని ముంబై పోలీసులు కునాల్‌కు మంగళవారంనాడు నోటీసులు పంపారు. అయితే తనకు వారం రోజులు గడువు కావాలని కునాల్ పోలీసులకు రాసిన ఒక లేఖలో విజ్ఞప్తి చేశారు.

## 'ఇది పార్లమెంట్ సాక్షిగా జరిగిన అన్యాయం'



**ఢిల్లీ :** పార్లమెంట్ లో సోమవారం అరకు కాఫీ స్టాల్ ప్రారంభోత్సవం జరిగితే , దానికి తనను పిలవకపోవడం అవమానమే కాకుండా, ఇది తనను గెలిపించిన ప్రజలకు జరిగిన అన్యాయమన్నారు వైఎస్సార్‌సీపీ ఎంపీ తనూజా రాణి. 'పార్లమెంట్ లో అరకు కాఫీ స్టాల్ ను ప్రారంభిస్తే దానికి నన్ను పిలవలేదు. అరకు ఎంపీగా ఉన్న నన్ను అరకు కాఫీ స్టాల్ ప్రారంభోత్సవానికి పిలవకపోవడం చాలా అవమానం.. మా నియోజకవర్గం ప్రజలకి జరిగిన అన్యాయం కూడా. పార్లమెంట్ లో స్టాల్ పెట్టడం గర్వించదగ్గ విషయం. అరకు గురించి పార్లమెంట్ లో గళం వినిపిస్తున్నా. అరకు స్టాల్ పెడితే అరకు ఎంపీని పిలవరా?, అరకులోని కాఫీ అందరూ రుచి చూస్తున్నారు. ఎంతో కష్ట పడి పండిస్తున్నారు. అరకు కాఫీ ఒక్కటే కాదు.. చాలా రకాలు ఉన్నాయి. వాటి అన్నింటిని ఎంపీలకు తెలిపే అవకాశం ఉండేది. అరకు దింసా నృత్యం చాలా ఫేమస్ అరకు ఎంపీనే పట్టించుకోని నేతలు ఉన్నారు. వాళ్లు ప్రజలను ఎలా చూస్తారో అర్థం అవుతుంది పార్లమెంట్ సాక్షిగా ఇలాంటి అన్యాయం జరిగింది. పార్టీలను పక్కన పెట్టి ఎంపీగా ఆహ్వానం ఇవ్వాలి. ప్రోటోకాల్ ఉల్లంఘన జరిగింది. స్పీకర్ కు ఫిర్యాదు చేస్తాం' అని ఎంపీ తనూ.జా రాణి స్పష్టం చేశారు.

**మిమ్మల్ని ప్రజలు క్షమించరు..**

అరకు కాఫీ స్టాల్ ప్రారంభోత్సవానికి వైఎస్సార్‌సీపీ ఎంపీలను ఆహ్వానించకుండా టీడీపీ వారు శునకానందం పొందారని రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబురావు మండిపడ్డారు. ప్రోటోకాల్ ఎందుకు పాటించలేదు. ఎంపీకి బ్రిచ్ ఆఫ్ ప్రివిలేజ్ ఉంటుంది. ప్రోటాకాల్ ఉల్లంఘన జరగడంపై ప్రధాని, స్పీకర్ ను ఆశ్రయించవచ్చు. మేము అణగారిన వర్గాల వారం కాబట్టి మమ్మల్ని చిన్న చూపు చూస్తున్నారు. మీరు పార్లమెంట్ లో చేసే తప్పులను ప్రజలు క్షమించరు' అని గొల్ల బాబురావు ధ్వజమెత్తారు.

# ఒకే దేశం-ఒకే ఎన్నిక..
# జేపీసీ గడువు పొడిగింపు..!

ఒకే దేశం-ఒకే ఎన్నిక కోసం ఏర్పాటు చేసిన పార్లమెంటరీ కమిటీ పదవీకాలాన్ని పొడిగించేందుకు లోక్‌సభ మంగళవారం ఆమోదం తెలిపింది. కమిటీ పదవీకాలం పార్లమెంట్ వర్షాకాల సమావేశాల చివరి వారం తొలి రోజు వరకు ఉండనున్నది. ఉమ్మడి పార్లమెంటరీ కమిటీ చైర్మన్ పీపీ చౌదరి లోక్‌సభలో కమిటీ పదవీకాలాన్ని పొడిగించే తీర్మానాన్ని సభలో ప్రవేశపెట్టగా.. వాయిస్ ఓటు ద్వారా ఆమోదించారు. రాజ్యసభ నుంచి కొత్త సభ్యుడికి కూడా పార్లమెంటరీ కమిటీలో స్థానం కల్పించినట్లు లోక్‌సభ సెక్రటరీ జనరల్ సభకు తెలిపారు. వైఎస్సార్‌సీపీకి చెందిన రాజ్యసభ సభ్యుడు విజయ సాయిరెడ్డి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. దాంతో 39 మంది సభ్యుల కమిటీలో ఓ పోస్టు ఖాళీ కావడంతో కొత్తగా సభ్యుడికి చోటు కల్పించారు. దేశవ్యాప్తంగా ఒకేసారి లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలను నిర్వహించేందుకు తీసుకువచ్చిన 129వ రాజ్యాంగ సవరణ బిల్లును కేంద్రం లోక్‌సభలో ప్రవేశపెట్టిన విషయం విధితమే. ఈ బిల్లు భారత రాజ్యాంగ మూల స్వరూపానికి భంగం కలిగించేలా ఉందని.. జేపీసీకి బిల్లును పంపాల్సిందేనని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. దీంతో 39 మంది ఎంపీలతో జేపీసీ కమిటీ ఈ బిల్లును అధ్యయనం చేసేందుకు ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో లోక్‌సభ 27 మంది, రాజ్యసభ నుంచి 12 మంది ఎంపీలు సభ్యులుగా ఉన్నారు. కమిటీకి బీజేపీ ఎంపీ పీపీ చౌదరి నేతృత్వం వహిస్తున్నారు. మాజీ కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్, పురుషోత్తం రూపాలా, మనీశ్ తివారీ, ప్రియాంక గాంధీ, బన్సూరి స్వరాజ్, సంబిత్ పాత్రాతో పాటు పలువురు కమిటీలో సభ్యులుగా ఉన్నారు. ఈ కమిటీ



కాల పరిమితి ఏప్రిల్ 4తో ముగియనున్నది. బిల్లుపై ఇంకా చర్చించాల్సిన అవసరం ఉందని సంబంధిత అధికార వర్గాలు తెలిపాయి. ఈ విషయంలో ఇప్పటికే న్యాయ నిపుణులతో కమిటీ చర్చలు జరిపింది. సుప్రీంకోర్టు మాజీ సీజేఐలు జస్టిస్ యూయూ లలిత్, జస్టిస్ రంజన్ గొగోయ్, ప్రముఖ న్యాయవాది హరీశ్ సాల్వే, ఢిల్లీ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఏపీ షా కమిటీ ఎదుట హాజరైన అభిప్రాయాలను తెలిపారు.

## జస్టిస్ వర్మ అంశంపై
## రాజ్యసభ చైర్మన్ అఖిలపక్ష సమావేశం



**న్యూఢిల్లీ:** ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ నివాసంలో నోట్ల కట్టల వ్యవహారంపై కార్యాచరణను నిర్ణయించేందుకు రాజ్యసభ చైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖడ్ అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సోమవారం సాయంత్రం 4.30 గంటలకు ఈ సమావేశం జరుగనుంది. రాజ్యసభలోని వివిధ పార్టీల ఫ్లోర్ లీడర్లు సమావేశంలో పాల్గొంటారు. సభా నాయకుడు జేపీ నడ్డా, ప్రతిపక్ష నేత మల్లికార్జున్ ఖర్గే సైతం హాజరవుతున్నారు. జస్టిస్ యశ్వంత్ వర్మ నివాసంలో నోట్ల కట్టల వ్యవహారంపై ధన్‌ఖడ్ మాట్లాడుతూ, ఇది కచ్చితంగా చాలా తీవ్రమైన అంశమని అన్నారు. దీనిపై కార్యచరణకు సంబంధించి ఫ్లోర్ లీడర్లతో సమావేశం ఏర్పాటు చేయమని ఖర్గే సూచించగా, జేపీ నడ్డా అంగీకరించినట్టు తెలిపారు. జస్టిస్ వర్మ వ్యవహారంలో జరుగుతున్న పరిణామాలు, తొలిసారి ఇందుకు సంబంధించిన సమాచారం సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో ఉంచడం అసాధరణ విషయంగా తాము ముగ్గురం భావించినట్టు చెప్పారు. జస్టిస్ వర్మ వ్యవహారంపై ముగ్గురు న్యాయమూర్తులతో విచారణ కమిటీ సీజేఐ ఇప్పటికే ఏర్పాటు చేశారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న జస్టిస్ వర్మను అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేయాలని సుప్రీంకోర్టు కొలీజియం నిర్ణయించింది. అయితే, ఇదంతా కుట్ర అని, ఆ నోట్ల కట్టలతో తనకు ఎలాంటి సంబంధం లేదని జస్టిస్ వర్మ చెబుతున్నారు.

## జడ్జి ఇంట్లో నోట్ల కట్టల కేసు
## జస్టిస్ వర్మ ఇంటికి 'సుప్రీం' కమిటీ



**ఢిల్లీ:** హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ ఇంట్లో అగ్ని ప్రమాదం జరిగిన సందర్భంలో నోట్ల కట్టలు బయటపడ్డాయి. ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టేందుకు సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా నియమించిన ముగ్గురు ప్రధాన న్యాయమూర్తుల కమిటీ ఇవాళ జస్టిస్ యశ్వంత్ వర్మ ఇంటికి వెళ్లింది. అగ్ని ప్రమాదం జరిగిన సమయంలో బయపడ్డ నోట్ల కట్టల గురించి దర్యాప్తు చేపట్టనుంది. మార్చి 14న ఢిల్లీలోని జస్టిస్ యశ్వంత్ వర్మ నివాసంలో అగ్నిప్రమాదం జరిగింది. రాత్రి జరిగిన అగ్ని ప్రమాదం తర్వాత భారీ మొత్తంలో కాలిన నోట్ల కట్టలు వెలుగులోకి వచ్చాయి. దీంతో జస్టిస్ యశ్వంత్ వర్మపై ఆరోపణలు వెల్లువెత్తాయి. ఇదే అంశంపై విచారణ చేపట్టాలని సుప్రీం కోర్టు..పలు రాష్ట్రాలకు చెందిన ముగ్గురు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులతో కమిటీని నియమించింది. ఆ కమిటీలో పంజాబ్ హర్యానా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి షీల్ నాగు, హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జీఎస్ సందవాలియా, కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి అను శివరామన్‌లను సభ్యులుగా చేర్చింది. కాలిన నోట్ల కట్టల విలువ రూ.1.5 కోట్లు ఉంటుందని అంచనా అంటూ పలు రిపోర్టులు వెలుగులోకి వచ్చింది. దీంతో సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా, మరో నలుగురు సీనియర్ న్యాయమూర్తుల కొలీజియం జస్టిస్ యశ్వంత్ వర్మను ఢిల్లీ హైకోర్టు నుంచి అల్హాదాబాద్ హైకోర్టుకు ట్రాన్స్‌ఫర్ చేసింది. నోట్ల కట్టల విషయంలో స్పష్టత వచ్చే వరకు న్యాయపరమైన పనులు కేటాయించవద్దని సుప్రీం కోర్టు.. ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి దేవేంద్ర ఉపాధ్యాయకు ఆదేశాలు జారీ చేసింది.

## మీరు ప్రజాధనంతో శీష్ మహల్ కట్టుకున్నారు..
## మేము మాత్రం : సీఎం రేఖా గుప్తా



ఢిల్లీలో కొత్తగా కొలువుదీరిన బీజేపీ ప్రభుత్వం ఇవాళ తన తొలి బడ్జెట్‌ను అసెంబ్లీలో ప్రవేశపెట్టింది. సీఎం రేఖా గుప్తా రూ.లక్ష కోట్లతో బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా గత ఆప్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అరవింద్ కేజ్రీవాల్ ప్రభుత్వం ప్రజల సొమ్మును దోచుకుందని, ఆ డబ్బును విలాసాల కోసం ఖర్చు చేసిందని ఆరోపించారు. సీఎం అధికారిక నివాసమైన 'శీష్ మహల్' మరమ్మతుల పేరిట కేజ్రీవాల్ రూ.45 కోట్ల ప్రజా ధనాన్ని ఖర్చు చేశారని సీఎం ఆరోపించారు. ఢిల్లీని లండన్‌గా మారుస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. అందుకు బదులుగా ట్రాఫిక్ జామ్‌లకు నిలయంగా మార్చారని మండిపడ్డారు. అంతేకాకుండా ఎన్నో ప్రాజెక్టులను అసంపూర్తిగా వదిలేశారని ధ్వజమెత్తారు. 'మీకు (ఆప్‌ను ఉద్దేశిస్తూ), మాకు (బీజేపీ) చాలా తేడా ఉంది. మీరు హామీలు ఇస్తారు. మేము వాటిని నెరవేరుస్తాము. మీరు పొరుగు రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి అవినీతికి పాల్పడ్డారు. మేము కలిసికట్టుగా దేశాభివృద్ధి కోసం పని చేస్తున్నాము. మీరు శీష్ మహల్, లక్షల విలువైన బంగారు టాయిలెట్లను నిర్మించుకున్నారు. మేము పేదలకు ఇళ్లు, మరుగుదొడ్లను నిర్మిస్తాము' అని సీఎం రేఖా గుప్తా వ్యాఖ్యానించారు. ఢిల్లీని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు బీజేపీ ప్రభుత్వం యోచిస్తున్నట్లు సీఎం ఈ సందర్భంగా ప్రకటించారు. ఇందుకోసం రూ.177 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. ఇందులో శీష్ మహల్ సందర్శన కూడా ఉంటుందన్నారు.

Printed, Published & Owned by **SIRIKONDA MARIA,** Printed at ASHISH PUBLICATIONS H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 1-1-12/45/1, P.H.C. Colony, Adilabad - 504001, Telangana. Editor : **SIRIKONDA AUGUSTIN . RNI No.: APTEL/2013/52694.** E-mail: voodayam2007@gmail.com, Cell : 9247698676, 7075458621. Telefax. No. 040-27678676.